



సిద్ధం సభలో సీఎం ప్రసంగిస్తుండగానే బస్‌ల కోసం వెళుతున్న జనం(ఇన్‌సెట్లో) జగన్

సిద్ధం ఫ్లాప్!

ఉమ్మడి జిల్లాలోని మేదరమెట్ల సమీపంలో వైసీపీ ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు జనం నుంచి స్పందన కరువైంది. ఆ పార్టీ నాయకులు సామ,దాన,భేద దండోపాయాలను ప్రయోగించినా, వలంటీర్లను పూర్తిగా రంగంలోకి దింపినా ఫలితం కన్పించలేదు. మరోవైపు వైసీపీలోని అంతర్గత కలహాలు బహిర్గతమయ్యాయి. ఇద్దరు ఎమ్మెల్యేలు, పలువురు కిందిస్థాయి నాయకులు, వారి అనుచరులు సభకు దూరంగా ఉండిపోయారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాకు అధిష్ఠానం ఇచ్చిన టార్గెట్‌లో ఒకవంతు కూడా జనసమీరణ జరక్కపోగా వెళ్లిన వారిలో ఎక్కువ మంది సభకు దూరంగా ఉండటం, కొద్దిసేపటికే తిరుగు ప్రయాణమవడం స్పష్టంగా కనిపించింది. జనంలేని సభను జన సందోహంతో కిక్కిరిసిపోయిందని చూపుకునేందుకు వైసీపీ నేతలు గ్రాఫిక్స్ జిమ్మిక్కులతో చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ఇతర జిల్లాల నుంచి కూడా ఆశించిన మేర జనం రాకపోవడం అధికార పార్టీ అగ్ర నేతలను నిరాశకు గురిచేసింది. కొన్ని గ్రామాల్లో వాహనాల్లోకి అసలు పార్టీ శ్రేణులు ఎక్కకపోగా, మరికొన్ని గ్రామాలకు వచ్చిన వాహనాలకు పార్టీలోని అసమ్మతివాదులు అంతరాయాలు కల్గించడం లాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల సభకు రాని వారిపై వైసీపీ నేతలు బెదిరింపులకు పాల్పడ్డారు. సభలో జగన్ ప్రసంగం అనంతరం ఆయన వద్దకు చొచ్చుకుపోయే క్రమంలో ఒత్తిడికి గురై ఒంగోలుకు చెందిన మున్సిపల్ కార్మికుడు మృతి చెందడం విషాదకరం.



సీఎం మాట్లాడుతుండగానే వెనుదిరుగుతున్న మహిళలు

- ఎన్ని చేసినా కదలని జనం
- భారీగా తాయిలాలు.. గ్రాఫిక్‌తో జిమ్మిక్కులు
- గ్రామాల్లోనే ఆగిపోయిన కొన్ని వాహనాలు
- మినీ బార్లుగా మారిన బస్సులు
- టార్గెట్‌లో ఒక వంతు కూడా వెళ్లని వైనం
- ఒక్కొక్కరికి రూ.300 నుంచి రూ.500 వరకు చెల్లింపు
- అదనంగా మద్యం బాటిల్, పలావు ప్యాకెట్
- ఇద్దరు ఎమ్మెల్యేలు, పలువురు నేతలు, వారి అనుచరులు గైర్హాజరు
- వేదిక వద్ద ఒక గ్యాలరీ నుంచి ఇంకో గ్యాలరీలోకి దూకుతూ ఒంగోలుకు చెందిన కార్మికుడు మృతి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రాష్ట్రంలో భారీగా సిద్ధం సభల నిర్వహణ ద్వారా ఎన్నికల సమరానికి అధికార వైసీపీ శ్రీకారం పలికింది. అందులో భాగంగా నాల్గవది అయిన ఆఖరు సభ ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మండల కేంద్రమైన కొరిశపాడు సమీపంలో నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి భారీగా జనసమీకరణకు ప్రయత్నించారు. అందుకోసం ఆపార్టీ ముఖ్య నాయకులంతా సర్వశక్తులూ ఒడ్డారు. వైసీపీ రాష్ట్ర నాయకత్వం నియోజకవర్గాలవారీ నాయకులపై ఒత్తిడి పెంచి టార్గెట్లు ఇచ్చి భారీ జనసమీకరణకు ఆదేశించింది. ఆమేరకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన స్థాయిలో సభ విజయవంతం కాకపోవడంతో ఆపార్టీ నాయకులు కూడా నిర్ఘాంతపోయారు. ఆ సభ నిర్వహణ పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిపివేయడం, ఆర్టీసీ బస్సులన్నింటినీ జనసమీకరణకు పంపడంతో సాధారణ ప్రయాణికులు నరకయాతనకు గురయ్యారు. ఇంత చేసినా వైసీపీ నాయకత్వం ఆశించిన స్థాయిలో సభ సక్సెస్ కాలేదు. సుమారు 15 లక్షల మంది హాజరవుతారని ప్రకటించుకోగా అందులో ఒక వంతు కూడా రాలేదు.

ఫలించని బెదిరింపులు

వైసీపీ నేతల బెదిరింపులు కూడా ఫలించలేదు. ఒకవైపు వలంటీర్లకు డబ్బులు, బహుమతులు ఇచ్చి జనాన్ని సమీకరించమని ఒత్తిడి చేశారు. డ్వాక్రా సంఘాల గ్రూపుల నాయకులకు అలాంటి ఆదేశాలే ఇచ్చారు. గ్రామాల్లో సాధారణ ప్రజలపై అయితే వైసీపీ నాయకులు దౌర్జన్యంగా వ్యవహరించారు. పంగులూరు మండలం రామకూర్‌లో చక్రవర్తి అనే యువకుడు సభకు రాకపోవడమే కాక తన పొలంలో పనిచేసేవారిని పంపకపోవడంతో గ్రామంలోని వైసీపీ నాయకులు ఆయన్ను రక్త గాయాలయ్యేలా కొట్టారు.



సీఎం మాట్లాడుతున్న సమయంలో ఖాళీగా ప్రాంగణం

ఫలించని జిమ్మిక్కులు

సభకు భారీగా జనం వచ్చినట్లు చూపేందుకు గ్రాఫిక్ జిమ్మిక్కులకు వైసీపీ నాయకులు పాల్పడ్డారు. సీఎం జగన్‌రాకముందు సభా ప్రాంగణంలో రెండో డ్రోన్ కెమెరా దృశ్యాలు చిత్రీకరిస్తుంటే అది నారా లోకేష్ పని అంటూ మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. చివరకు పోలీసులు ఆ డ్రోన్ కెమెరా వైసీపీ అధికారిక సంస్థ అయిన ఐప్యాక్‌దని తేల్చేశారు.

టార్గెట్‌లో ఒక వంతు మాత్రమే

జిల్లా నుంచి కనీసం ఐదు లక్షల మందిని సమీకరించాలని వైసీపీ భావించింది. ప్రధానంగా అద్దంకి, పర్చూరు, చీరాల నుంచి అధికంగా తరలించాలని ఆదేశించారు. కానీ ఆమూడు నియోజకవర్గాల నుంచి వారు ఆశించిన స్థాయిలో పార్టీశ్రేణులు కానీ, ప్రజలు కానీ హాజరుకాలేదు. ఇతర నియోజకవర్గాల నుంచి అధిష్ఠానం ఇచ్చిన టార్గెట్‌లో ఒకవంతు మాత్రమే వచ్చారు. కొన్ని నియోజకవర్గాల్లో రెండు నుంచి ఐదు వేలమంది, మరికొన్ని సెగ్మెంట్‌లలో పది నుంచి పదిహేను వేల మంది, ఒకట్రెండు నియోజకవర్గాల నుంచి 20వేల ప్రకారం సమీకరణ జరిగింది. సరాసరి లక్షపైచిలుకు జిల్లా నుంచి సమీకరించగా, ఇతర జిల్లాల నుంచి మరో లక్ష వచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు.

ఇద్దరు ఎమ్మెల్యేలు, మరికొందరు నాయకులు గైర్హాజరు

దర్శి, కందుకూరు ఎమ్మెల్యేలు మద్దిశెట్టి వేణుగోపాల్, మానుగుంట మహీధర్ రెడ్డి సభకు గైర్హాజరయ్యారు. కందుకూరులో మహీధర్‌రెడ్డి అనుచరులు ముందుగానే చెప్పి మరీ కార్యక్రమాన్ని బహిష్కరించారు. దర్శిలో ఎమ్మెల్యే వేణుగోపాల్ అనుచరుల్లో కొందరు సభకు వెళ్లాలని భావించారు. కానీ వారికి వాహనాలను పార్టీ నుంచి ఏర్పాటు చేయలేదు. ఇక ఆయా నియోజకవర్గాల్లో కిందిస్థాయి నాయకుల్లో చాలామంది సిద్ధం సభకు దూరంగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌తోపాటు కనిగిరి, గిద్దలూరు, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు, కొండపి తదితర నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికతో అసంతృప్తితో ఉన్న పలువురు నాయకులు, ఆ పార్టీ ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు కూడా సమావేశానికి గైర్హాజరయ్యారు.

భారీగా తాయిలాలు ఇచ్చినా స్పందించని ప్రజలు

జనసమీకరణకు సర్వశక్తులు ఒడ్డిన వైసీపీ నేతలు భారీగా తాయిలాలు కూడా ఇచ్చారు. సభకు వచ్చే వారికి కొన్ని ప్రాంతాల్లో ఒక్కొక్కరికి రూ.300, మరికొన్ని ప్రాంతాల్లో రూ.500 ప్రకారం చెల్లించారు. ఇక మద్యం, పలావు పొట్లాలు అయితే అన్ని ప్రాంతాల్లో ఇచ్చారు. ఇవన్నీ కలుపుకుంటే రవాణా ఖర్చులు కాకుండా ఒక్కొక్కరికి రూ.800 నుంచి రూ.1000 వరకు వెచ్చించారు. అయినా వైసీపీ నాయకులు ఆశించిన స్థాయిలో ప్రజలు వాహనాలు ఎక్కలేదు. అనేక ప్రాంతాల్లో సర్పంచ్‌లు.. 'మాకు జగన్ అన్యాయం చేశారే తప్ప అభివృద్ధికి సహకరించలేదు. సభకు మేము రాము. మా అనుచరులనూ పంపం' అని ఎదురుతిరిగారు. కందుకూరు నియోజకవర్గంలో సర్పంచ్‌లు ముందుగానే విషయాన్ని తేల్చిచెప్పారు. గిద్దలూరు నియోజకవర్గంలోని కొమరోలు మండలం దద్దవాడ గ్రామంలో ఒక వైసీపీ కార్యకర్త గ్రామానికి వచ్చిన బస్సు టైర్లు పంక్చర్ చేసి కదలకుండా చేశారు. పుల్లలచెరువు మండలం సిద్దన్నపాలెంలో గ్రామానికి వెళ్లిన బస్సులో ఒక్కరూ ఎక్కకపోవడంతో సాయంత్రం వరకు అక్కడే ఉంది. ఇలాంటి సంఘటనలు అనేక ప్రాంతాల్లో చోటుచేసుకున్నాయి.



సభకు వెళ్తూ ఒంగోలు వద్ద రోడ్డుపక్కన మద్యం సేవిస్తున్న వైసీపీ కార్యకర్తలు

బస్సుల్లోనే మద్యం తాగి చిందులు

ఇక నలభై మంది పట్టే బస్సులో 10 మంది 5 మంది వచ్చిన వాహనాలు చాలా ఉన్నాయి. అయితే ప్రతి ప్రాంతంలోనూ పురుషులనే అధికంగా సమీకరించేందుకు ప్రయత్నించారు. మహిళలు వచ్చినా ప్రత్యేక వాహనం ఎక్కించారు. పురుషులు ఉన్న వాహనాలన్నీ మినీ బార్లుగా మారిపోయాయి. మద్యం సేవిస్తూ చిందులు వేశారు. కొన్ని వాహనాలు అయితే మధ్యలో ఆపుకొని సభ పూర్తయ్యే వరకు అదే పనిలో ఉండటం కనిపించింది. సభ వరకు వచ్చిన వారిలో కూడా మహిళలు ఎక్కువ మంది ప్రాంగణానికి దూరంగా చెట్ల కింద కూర్చుని కనిపించారు. అదేమిటని ప్రశ్నిస్తే 'డబ్బులు ఇచ్చారు వచ్చాం. తిరిగి వెళ్లేటప్పుడు వెళ్లిపోతాం. ఆ సభతో మాకెందుకు' అని స్పష్టంగా చెప్పారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

సభ ముగిసిన తర్వాత ముందు వరుసలో ఉన్న యువ కార్యకర్తలు జగన్‌ను దగ్గరగా చూసేందుకు, వీలైతే కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. ఆ సమయంలో ఒంగోలు మునిసిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న మురళి ఒక గ్యాలరీ నుంచి ఇంకో గ్యాలరీలోకి దూకేక్రమంలో తీవ్ర ఒత్తిడికి గురై మృతి చెందాడు. సభకు వచ్చిన నరసరావుపేట పట్టణంలోని స్టేడియం ఎదురు చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన గేదెల బాల దుర్గారావు (27) తిరిగి వెళ్లే సమయంలో బస్సు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది పూర్తిగా రాజకీయ సభ కావడం కాబోలు ముఖ్యమంత్రి జగన్ స్థానిక అంశాలు, జిల్లా అభివృద్ధి అంశాలను ప్రస్తావించలేదు.

రాక్షసుడుని తరిమికొట్టేందుకే మూడు పార్టీలు ఒక్కటయ్యాయి

టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశంలో జనార్దన్, రియాజ్

సైకో జగన్‌ను సాగనంపుదాం



టీడీపీ, జనసేన నేతల ఉమ్మడి సమావేశంలో అభివాదం చేస్తున్న జనార్దన్, రియాజ్, నాగేశ్వరరావు, సాయిబాబు


ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 10 : 'రాష్ట్రంలో నియంత పాలన సాగుతోంది. సైకో జగన్‌ను సాగనంపేందుకు టీడీపీ, జనసేన కలిసికట్టుగా పనిచేయాలి' అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పీఏజీ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ పథకాలు చేపడితే వాటన్నింటినీ తొలగించిన దుర్మార్గపు ముఖ్యమంత్రి జగన్ అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రాక్షసుడి పాలనను అంతమొందించేందుకు మూడు పార్టీలు ఒక్కటయ్యాయని అన్నారు. ప్రస్తుతం మన అందరి ముందు ఉన్న ఏకైక లక్ష్యం సైకోను శాశ్వతంగా ఇంటికి పంపి, సంక్షేమ పాలన సాధించుకోవడం కోసం టీడీపీని గెలిపించుకోవడమేనన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి అయిన ఒంగోలు ఎమ్మెల్యే ఇప్పటి వరకూ పట్టించుకోకుండా ఎన్నికల సమయంలో పట్టాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఆయన కుమారుడి అరాచకాలు మరీ ఎక్కువయ్యాయని అన్నారు. అనేక మంది టీడీపీలో చేరుతుంటే ఎమ్మెల్యే కొడుకు బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడటం సిగ్గు చేటన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మినీ స్టేడియం, అంబేద్కర్ భవన్ ఆధునికీకరణ, పోతురాజు కాలువ పనులు, గుండ్లకమ్మ నుంచి రోజూ తాగునీటి కోసం రూ.163 కోట్లు, షాదీఖానా నిర్మాణం, ఇంకా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నేడు వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే వ్యాపారం చేస్తున్నదని మండిపడ్డారు. జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్, ఒంగోలులో బాలినేని రాక్షస పాలన ముగిసే సమయం దగ్గరపడిందన్నారు. ఒంగోలు అభివృద్ధి కోసం బాలినేని హఠావో, ఒంగోలు బచావో నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. జనసేన, టీడీపీ అన్న భేదం లేకుండా అందరూ అన్నదమ్ముల్లాగా, ఒకే కుటుంబంలా పనిచేసి టీడీపీని గెలిపించాలన్నారు. జనసేన నేత జడా బాలనాగేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇరు పార్టీలకు చెందిన నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య, శశికాంత్ భూషణ్, మహిళా నాయకులు ఆర్ల వెంకటరత్నం, కుసుమ కుమారి, బీరం అరుణ రెడ్డి, నరసమ్మ, జనసేన నాయకులు, కార్పొరేటర్ రమేష్‌బాబు, సుంకర సాయిబాబా, చనపతి రాంబాబు, రాయపాటి అరుణ, పలువురు పాల్గొన్నారు.

రమణీయం.. ఆదిదేవుడి రథోత్సవం

శివనామస్మరణతో మార్మోగిన త్రిపురాంతకం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

త్రిపురాంతకం, మార్చి 10: మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం త్రిపురాంతకంలో ఆదిదేవుడి రథోత్సవం రమణీయంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. మధ్యాహ్నం తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రథం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ పూజా కార్యక్రమాలను రథదాతలైన గ్రామంలోని గోళ్ల, ఇమ్మడిశెట్టి వంశీయులు నిర్వహించారు. అనంతరం ఉత్సవం జరిగింది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. తహసీల్దారు బి.రామకృష్ణ శివప్రసాద్, ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ చైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు విశ్వం, ప్రసాద్ పూజలు చేశారు. సీఐ ఎస్.సుబ్బారావు, ఎస్ఐ వి.సాంబశివయ్య ఆధ్వర్యంలో పటిష్ఠ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవానికి వచ్చిన భక్తులకు అన్ని సంఘాల సత్రాల వారు భోజన సౌకర్యాలు కల్పించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహించారు. స్థానిక జడ్పీ పాఠశాల 1985-86 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో భక్తులకు శీతల పానీయాలను, మజ్జిగను పంపిణీ చేశారు. చిన్నారుల కోలాట ప్రదర్శన అలరించింది.



రథోత్సవంలో భక్తులు(ఇన్‌సెట్లో) రథంపై కొలువైన పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరుడు

సొసైటీలో స్వాహాపర్వం

కొమరోలు సహకార సంఘంలో భారీ కుంభకోణం

- రూ.80.26 లక్షలు గోల్‌మాల్
- సొంతానికి వాడేసుకున్న సీఈవో
- విచారణలో వెలుగు చూసిన వైనం
- చర్యలకు డీసీవో ఆదేశం

ఒంగోలు (విద్య), మార్చి 10 : కొమరోలు విశాల వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో భారీ కుంభకోణం చోటుచేసుకుంది. సొసైటీ నిధులు రూ.80.26 లక్షలు స్వాహా అయ్యాయి. లావాదేవీల్లో అడుగడుగునా అక్రమలు చోటుచేసుకున్నాయి. వీటన్నింటికీ సీఈవో రావూరి దిలీప్‌కుమార్ కేంద్రబిందువుగా నిలిచారు. సొసైటీ నిధులను సీఈవో యథేచ్ఛగా సొంతానికి వాడేసుకున్నారు. సొసైటీ నిర్వహించిన ఎరువుల వ్యాపారంలో అక్రమాలు, శనగలు కొనుగోలు చేసి ఇష్టారాజ్యంగా బహిరంగ మార్కెట్‌లో విక్రయించి దిగమింగారు. రుణాలకు సంబంధించి రైతుల నుంచి వసూలు చేసిన సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా స్వాహా చేశారు. సూపర్ మార్కెట్ వ్యవహారంలోనూ నిధులు స్వాహా చేశారు. సొసైటీలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గిద్దలూరు సబ్ డివిజనల్ సహకారాధికారి చేపట్టిన విచారణలో నిధులు స్వాహా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై డీసీవో సమగ్ర విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా పొదిలి సబ్ డివిజనల్ సహకారాధికారి కె.వెంకటేశ్వర్లును నియమించారు. దీన్ని అడ్డుకొనేందుకు సీఈవో చేయని ప్రయత్నాలు లేవు. రాజకీయంగా, న్యాయపరంగా చేసిన ప్రయత్నాలకు అడ్డుకట్టపడింది. విచారణ చేపట్టడతో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. 80.26 లక్షలు దిగమింగినట్లు తేలింది.

అక్రమాల్లో మచ్చుకు కొన్ని..

- సొసైటీలో 41 మంది రైతుల నుంచి రూ.29.64 లక్షలు వసూలు చేసి ఆ మొత్తాన్ని నగదు పుస్తకాల్లో నమోదు చేయకుండా, బ్యాంకులో జమ చేయకుండా సీఈవో దిగమింగారు. బకాయిలు చెల్లించిన రైతులకు సొసైటీ రసీదులు ఇవ్వకుండా తెల్లకాగితం మీద స్టాంపులు అంటించి ఇచ్చారు.
- రైతులు రెండోసారి చెల్లించిన బకాయిలు రూ.8.75 లక్షలు సొసైటీ నగదు పుస్తకంలో రాయకుండా, బ్యాంకులో జమ చేయకుండా సీఈవో స్వాహా చేశారు.
- రైతుల వ్యవసాయ రుణాలకు సంబంధించి వడ్డీ చెల్లింపు కోసం వసూలు చేసిన రూ.1.78 లక్షలు సొంతానికి వాడుకున్నారు.
- సొసైటీ ద్వారా కొనుగోలు చేసిన శనగల విక్రయంలో కూడా గోల్‌మాల్ జరిగింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన శనగలు నేరుగా మార్క్‌ఫెడ్‌కు విక్రయించకుండా కొన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొని ఆ మొత్తాలు రైతులకు చెల్లించకుండా దిగమింగారు. రైతులు ఒత్తిడి చేయడంతో సీఈవో వారికి చెక్కులు ఇవ్వగా అవి బౌన్స్ అయ్యాయి. ఈవిధంగా రూ.7.24లక్షలు స్వాహా చేశారు.
- మార్క్‌ఫెడ్ నుంచి రూ.15.55 లక్షల ఎరువులు కొనుగోలు చేసి వాటిలో కొంత మొత్తం అసలు సొసైటీకి చేరకుండానే బయట విక్రయించారు. దీనికి సంబంధించి మార్క్‌ఫెడ్‌కు రూ.2.50 లక్షలు జమ చేశారు. ఈవ్యాపారంలో 2.52 లక్షలు స్వాహా చేశారు. అదేవిధంగా సొసైటీ నిల్వ నగదులో రూ.4.49 లక్షలు సొంతానికి వాడుకున్నారు.
- సొసైటీ అధ్వర్యంలో నిర్వహించిన సూపర్ మార్కెట్ లావాదేవీల్లోనూ అక్రమాలకు పాల్పడి లక్షల రూపాయలు దోచుకున్నారు. సూపర్ బజారు స్టాక్ నిల్వలో తేడా వలన రూ.5.49 లక్షలు, బయటి వ్యక్తులకు విక్రయించి సొసైటీకి జమ కాని మొత్తం రూ.3.50 లక్షలు, సూపర్ మార్కెట్ రూము రెంటు రెండు లక్షలు, రెంట్ అడ్వాన్స్ రూ.1.50 లక్షలు స్వాహా చేశారు.
- సొసైటీకి జమ అయిన మొత్తాలను ఖర్చుగా చూపించి రూ.46,260 సొంతానికి వాడుకున్నారు.
- పాలకవర్గం అనుమతి లేకుండా, జీతాల పే బిల్లుల ఎంట్రీలు లేకుండా రూ.2.46 లక్షలు డ్రా చేసి దిగమింగారు.
- సొసైటీకి తనఖా పెట్టిన 26,842 బాండ్లు వాయిదా, గడువు మీరిపోవడంతో సంస్థకు నష్టం వాటిల్లింది.




సొసైటీ కార్యాలయం

తగు చర్యలకు ఆదేశం

కొమరోలు సొసైటీలో జరిగిన కుంభకోణంపై జిల్లా సహకారాధికారి పోలిశెట్టి రాజశేఖర్‌ను వివరణ కోరగా అక్కడ నిధులు దుర్వినియోగం వాస్తవమేనని ధ్రువీకరించారు. తగు చర్యలు తీసుకోవాలని మార్కాపురం డివిజనల్ సహకారాధికారిని ఆదేశించినట్లు చెప్పారు. నిధులను సంబంధిత వ్యక్తులనుంచి రాబట్టేందుకు చర్యలు తీసుకుంటామని రాజశేఖర్ తెలిపారు.

మంత్రిగారూ మీరెక్కడ..?

- ఆదిమూలపు సురేష్ కనిపించడం లేదంటూ
- ఎర్రగొండపాలెంలో పోస్టర్లు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్



మంత్రి సురేష్ కనిపించడం లేదని వేసిన పోస్టర్

ఎర్రగొండపాలెం, మార్చి 10 : రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ 'కనబడుట లేదు' అని ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఎర్రగొండపాలెంలో ఆదివారం పోస్టర్లు వెలిశాయి. ఇవి ఇటు ఎర్రగొండపాలెంతోపాటు ఆయన వైసీపీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న కొండపి నియోజకవర్గంలోనూ చర్చనీయాంశమయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఓవైపు సిద్ధం సభ జరుగుతుండగా అదేసమయంలో మంత్రి పోస్టర్లు ప్రత్యక్షం కావడం గమనార్హం. 'మేము 2019లో ఓట్లు వేసి గెలిపించిన 59 ఏళ్ల ఆదిమూలపు సురేష్ కనిపించడం లేదు. అచూకీ తెలిసిన వారు మాకు తెలియజేగలరు' అని ఎర్రగొండపాలెం ప్రజల తరఫున ఈ పోస్టర్ ఉంది.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ



ఉత్తర్వులను అందజేస్తున్న డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 10 : వైద్యఆరోగ్యశాఖ పరిధిలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరణ(రెగ్యులరైజేషన్) చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి ఉత్తర్వులను అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ ఉత్తర్వులను వారికి అందజేశారు. వైద్యశాఖలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న 102 మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో తదనుగుణంగా వారికి రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఏఎన్ఎంలు 33 మంది, ల్యాబ్ టెక్నీషియన్లు 8మంది, మేల్ హెల్త్ అసిస్టెంట్లు 61 మందిని రెగ్యులర్ చేసినట్లు రాజ్యలక్ష్మి తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

ఒంగోలు(విద్య), మార్చి 10 : ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో ఆదివారం అసోసియేషన్ ఆఫ్ ప్రైవేటు లెక్చరర్స్ అండ్ టీచర్స్, ఏపీ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్విస్ ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలు రేవతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ స్త్రీ, పురుషుల మధ్య హెచ్చుతగ్గులు, తేడాలు అంతమైనప్పుడే సమానత్వం సిద్ధిస్తుందన్నారు. అనంతరం 30 మంది మహిళలను ఘనంగా సత్కరించారు. వారిలో డాక్టర్ గీతారాణి, వసంతలక్ష్మి, డాక్టర్ చాపల శాంతకుమారి, డాక్టర్ ఎన్.రవికుమార్, శ్రీనివాసరెడ్డి, శ్రీవాణి, గాయత్రి తదితరులు ఉన్నారు.

మహిళల హాకీ టోర్నీ విజేత కాకినాడ



ట్రోఫీని అందుకుంటున్న కాకినాడ జిల్లా క్రీడాకారులు

సంతనూతలపాడు, మార్చి 10: సంతనూతలపాడు మండలం మైనంపాడు జడ్పీహైస్కూల్ క్రీడామైదానంలో గతం మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్ మహిళ హాకీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన పోటీల్లో ప్రథమ స్థానాన్ని కాకినాడ జిల్లా, ద్వితీయస్థానం అనకాపల్లి, తృతీయస్థానంలో ఉమ్మడి అనంతపురం జిల్లా క్రీడాకారులు నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హాకీ జనరల్ సెక్రటరీ హర్షవర్ధన్, ఒంగోలు గెలాక్సీ అధినేత బదరీనారాయణ, గొడుగు కాలేషా, డైట్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఆకుల బ్రహ్మయ్య గొడుగు మస్తాన్, పీడీ వనజ, జ్ఞానేశ్వరరెడ్డి, సుందరరామిరెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయకులు

ఒంగోలు(కల్చరల్), మార్చి 10: ఘంటసాల ఆరాధనోత్సవాలలో భాగంగా శ్రీగిరి మెలోడీస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ముందుగా ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి కళాకారులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీనియర్ గాయకులు అప్పిశెట్టి రత్తయ్య పర్యవేక్షణలో, సంస్థ అధ్యక్షుడు శ్రీగిరి శ్రీనివాస్ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో గాయకులు అప్పిశెట్టి రత్తయ్య, శ్రీగిరి శ్రీనివాస్, అశోక్, మల్లిఖార్జున్, శైలజ, బి.పావని, డి.శైలజా రాజేష్ తదితరులు పలు చిత్రాలలోని గీతాలను ఆలపించారు. కాగా కీబోర్డుపై జెర్మియా, ప్యాడ్స్ సురేష్, తబలా శివప్రసాద్, డ్రమ్స్ మోహన్ వాద్య సహకారాన్ని అందజేయగా వెన్నూరి నాగేశ్వరరావు నిర్వహణా సహకారాన్ని అందజేశారు.

ప్రొఫెషనల్ వింగ్ కమిటీ నియామకం

సంతనూతలపాడు, మార్చి 10: నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ కమిటీని ఆదివారం ఒంగోలులో టీడీపీ,జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నియమించారు. నియోజకవర్గం అధ్యక్షుడుగా ఎం.రామక్రిష్ణ, చీమకుర్తి పట్టణ ప్రధానకార్యదర్శిగా పి.చంద్ర, చీమకుర్తి మండల ప్రధానకార్యదర్శిగా ఎన్.వెంకటేశ్వరరావు, సంతనూతలపాడు మండల ప్రధానకార్యదర్శిగా టి.హరిప్రసాద్, మద్దిపాడు మండల ప్రధానకార్యదర్శిగా కె.అశోక్, నాగులుప్పలపాడు మండల ప్రధానకార్యదర్శిగా ఆర్.హరీష్‌లను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎన్ గెలుపు కోసం కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్సాహంగా మెగా ఈవెంట్



విభావరిలో పాల్గొన్న గాయకులు

ఒంగోలు(కల్చరల్), మార్చి 10: సితార్ ఈవెంట్స్ బ్యానర్‌పై ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల గాయకులతో జరిగిన మెగా ఈవెంట్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నిరంతరాయంగా జరిగిన ఈవెంట్‌కు సంస్థ అధ్యక్షులు సీతారం నిర్వాహకులుగా, వ్యాఖ్యాతగా వ్యవహరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయకులు సీతారాం, డి.వెంకటేష్, హరిబాబు, ఖాదర్, వి.వి.రమణారావు, డాక్టర్ చందు, రామస్వామి, చిరంజీవి, ఎస్.వి.ప్రసాద్, డాక్టర్ మల్లిఖార్జున రావు, కె.మాణిక్యారావు, చాందినీ, సుహాసిని, లక్ష్మిప్రియ, కవిత, ఝాన్సీ రాణి, విజయ, నీరజ, హసీనా, ఎస్.ఝాన్సీ తదితర దాదాపు 50 మంది తమ పాటలతో, హుషారైన స్టెప్పులతో మైమరపించారు.

ఒంగోలు ఆర్డీవోగా సుబ్బారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 10 : ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారిగా జీవీ.సుబ్బారెడ్డిని నియమిస్తూ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఒడా) వైస్ ఛైర్మన్‌గా పనిచేస్తున్న సుబ్బారెడ్డిని ఒంగోలు ఆర్డీవోగా నియమించారు. ఒంగోలు ఆర్డీవోగా పనిచేస్తున్న విశ్వేశ్వరరావును ఒడా వైస్‌ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

టీడీపీ హయాంలోనే
చేపల మార్కెట్ నిర్మాణం

అధికారంలోకి రాగానే అన్ని సమస్యలు పరిష్కారం ● పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల



కార్మికుల సమస్యలను తెలుసుకుంటున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 10: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చేపలవ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తానని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ తెలిపారు. ఆదివారం ఒంగోలులోని చేపల మార్కెట్‌ను సందర్శించిన ఆయన అక్కడి వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.4 కోట్లు నిధులు కేటయించి చేపలమార్కెట్ నిర్మాణం, నీటివసతి, ఇతర సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఇదే సమయంలో వ్యాపారులు మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు అధిక అద్దెలు వసూలు చేస్తున్నారని, వాటిని తగ్గించాలని కోరారు. దీనిపై స్పందించిన దామచర్ల తప్పకుండా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నపుడు అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశానని, మరో అవకాశం కల్పిస్తే అన్నీ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో చేపల వ్యాపారుల సంఘ మాజీ అధ్యక్షులు కొక్కిలిగడ్డ సముద్రాలు, నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, మాజీ మునిసిపల్ ఛైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్ల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు కోసం పనిచేయాలి

రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 19వ డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీ ఎక్స్‌టెన్షన్‌లోని కొండపాటూరి అప్పాజి నివాసం వద్ద ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. బూత్ లెవల్ నుంచి కార్యకర్తలు ఓట్లు పోలయ్యే విధంగా చూడాలని కోరారు.

30వ డివిజన్‌లో...

తెలుగుదేశం పార్టీ గెలుపు కోరుతూ బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ, జనం కోసం జనార్దన్ కార్యక్రమం ఆదివారం స్థానిక 30వ డివిజన్‌లో కొనసాగింది. డివిజన్‌లో రెండు రోజులపాటు చేపట్టిన ప్రచార కార్యక్రమంలో ప్రజలు దామచర్లకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో అంబేడ్కర్‌భవన్ ఆధునీకరణ కోసం అత్యధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్లు చెప్పారు. నగర ప్రజలకు తాగునీటి అవసరాల కోసం రూ.163 కోట్లు తీసుకు వచ్చి పనులు చేపట్టినట్లు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకుని ప్రజల దాహార్తిని తీర్చినట్లు చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంగోలులో అభివృద్ధి శూన్యమన్నారు. తెలుగుదేశం పార్టీ సంక్షేమ పాలన కోసం ప్రజలు విలువైన ఓటు వేసి తనను గెలిపించాలని, చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. ఇదిలా ఉండగా ఉదయం స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో సయ్యద్ అన్వర్ బాషా షాపు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు యాభై మంది వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. అలాగే తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 3వ డివిజన్‌కు చెందిన షేక్ అజహర్ అబీద్ ఆధ్వర్యంలో పలువురు వైసీపీ సానుభూతిపరులు తెలుగుదేశం పార్టీలో చేరగా, దామచర్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసమే టీడీపీ-జనసేనల పొత్తు

జిల్లా అధ్యక్షుడు రియాజ్, ఇన్‌చార్జి బీఎన్ ● ఎన్‌జీపాడులో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం ● భారీగా తరలివచ్చిన శ్రేణులు



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రియాజ్, బీఎన్, కందుకూరి బాబు



విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన మైనంపాడు వైసీపీ నాయకులు

నాగులుప్పలపాడు, మార్చి 10 : రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమే టీడీపీ-జనసేనపార్టీలు పొత్తు పెట్టుకున్నాయని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ పేర్కొన్నారు. ఆదివారం నాగులుప్పలపాడు బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ మండల కార్యాలయాన్ని బీఎన్, రియాజ్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు (బాబు,) అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరిలతో కలిసి ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. కార్యాలయం వద్ద జనసేన పార్టీ జెండాలను మండల అధ్యక్షులు భూపతి మురళీ మోహన్ అధ్యక్షతన ఆవిష్కరించారు. అనంతరం సాయిబాబా దేవాలయం వరకు చేరుకుని అక్కడి నుంచి కార్లు, ద్విచక్ర వాహనాలతో కనపర్తి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్, రియాజ్ మాట్లాడుతూ ఇరు పార్టీల నాయకులు సమష్టిగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపాలన్నారు. సమన్వయకర్త కందుకూరి బాబు, రాయపాటి అరుణ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన ఉమ్మడి అభ్యర్థి విజయ్‌కుమార్‌ను గెలిపించుకొనేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడగా స్వాములు జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, పెంట్యాల కోటి, చిట్టెం ప్రసాదు, తేళ్ళ మనోజ్‌కుమార్, నున్నా బాల సుబ్రహ్మణ్యం, నాయకులు కొంజేటి ధనుష్, తాడి దానామూర్తి, బుర్రి దుర్గ, పందిటి మధుబాబు పాల్గొన్నారు. కాగా పలు గ్రామాల్లో జనసేన పార్టీల జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఇరు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరికలు

సంతనూతలపాడు: ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో మైనంపాడుకు చెందిన నాయకులు ఆళ్ల మురళి, ఈర్ల శ్రీను, పి.రాము, ఆర్.చెంచయ్య ఆధ్వర్యంలో బీసీలకు చెందిన 25 కుటుంబాలు వైసీపీ వీడి ఆదివారం విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఆయన పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల అధక్షుడు మద్దినేని హరిబాబు అవినాష్, రామాంజనేయులు, భాస్కర్ గోవిందయ్య, నాగరాజు, కరిముల్లా, రామారావు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: చదలవాడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మద్దెల రాంబాబు, మాజీ వార్డు సభ్యులు దాసరి హనుమంతరావు, కొప్పోలు బుజ్జి టీడీపీలో చేరారు. ఆదివారం ఒంగోలులోని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో వారు పార్టీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరగా కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, గ్రామ అధ్యక్షులు దాసరి సురేష్, నెప్పల శివకృష్ణ, గుమ్మా వేణు, వలసయ్య, వెంకట్రావు, బాలాజీ, సత్యనారాయణ, యానాదిరావు, సాయి, రవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ విజేత విశాఖ



నగదు బహుమతిని అందజేస్తున్న ఈదర మోహన్‌బాబు, మల్లికార్జునరావు





విశాఖ జట్టుకు, ప్రకాశం క్రీడాకారులకు నగదు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు శిరిగిరి రంగారావు తదితరులు

ఒంగోలు(రూరల్), మార్చి 10: కరవదిలోని పీఆర్ఆర్ హైస్కూలులో రిటైర్డ్ హెచ్ఎం సూరిగుచ్చి హనుమంతరావు జ్ఞాపకార్థం గత మూడు రోజుల నుంచి జరుగుతున్న వాలీబాల్ పోటీలు ఆదివారం రాత్రితో హోరాహోరీగా ముగిశాయి. ఈ పోటీలలో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచింది. ప్రకాశం జట్టు ద్వితీయ స్థానం సాధించింది. తృతీయ స్థానంలో కృష్ణా, నాలుగో స్థానంలో గుంటూరు జిల్లా క్రీడాకారులు నిలిచారు. అలాగే మహిళా వాలీబాల్ పోటీలలో కృష్ణా జిల్లా జట్టు ప్రథమస్థానం, ప్రకాశం జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. మహిళా క్రీడాకారులకు పీడీసీసీ బ్యాంక్ మాజీ ఛైర్మన్ ఈదర మోహన్‌బాబు, డాక్టర్ మల్లికార్జునరావు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మారెళ్ల అంజనేయులు, పెద్దసుబ్బారెడ్డి, ఆర్ఎంపీ ప్రభాకర్, చిన్నసుబ్బారెడ్డి, శిరిగిరి రంగారావు, పోకూరి శేషయ్య, దేవరపల్లి నాగేశ్వరరావు, బొడపాటి సుబ్బారావు, నాగిరెడ్డి, యర్రా అంజనేయులు, గుట్టపల్లి కోటేశ్వరరావు, విశ్రాంత పీఈటీ సూదనగుంట నరసింహారావు, అంచెపోగు వెంకటేశ్వర్లు, బొల్లా సుబ్బారెడ్డి, ఉప్పుటూరి కోటి, పీటీ డాక్టర్ ధనుంజయ్, సూరిగుచ్చి మురళి, కొండ్రగుంట శేషయ్య పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు భారీగా జనం తరలివచ్చారు.

ఆర్టీసీ బస్టాండ్లు ఖాళీ..!

బస్సులన్నీ సిద్ధం సభకు కేటాయింపు ● ప్రయాణికుల అవస్థలు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 10 : ఉమ్మడి ప్రకాశం జిల్లా మేదరమెట్ల సమీపంలో వైసీపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభ ఆర్టీసీ ప్రయాణికులకు కష్టాలు తెచ్చిపెట్టింది. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి హాజరైన ఈ సభకు జిల్లావ్యాప్తంగా 320 ఆర్టీసీ బస్సులు కేటాయించిన అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణణాతీతమయ్యాయి. ప్రయాణికులు మండుటెండలో గంటల కొద్దీ పడిగాపులు కాశారు. రెండు గంటలకు ఒకసారి వచ్చే బస్సుకోసం ఎదురుచూశారు. శుక్రవారం, రెండో శనివారం, ఆదివారం వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో సంతోషంగా కుటుంబ సభ్యులతో గడిపిన వారు ఉద్యోగ, ఉపాధి, ఉపాధి, విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు నిరీక్షించక తప్పలేదు. దీంతో వైసీపీ సభ సంగతి దేవుడెరుగు ప్రజల కష్టాలు పట్టించుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని ఐదు డిపోల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని డిపోల్లో అసలు బస్సులే లేకపోవడంతో ప్రయాణికులతో రద్దీగా కనిపించాయి.



బస్సులు లేక ఖాళీగా ఉన్న ఒంగోలు బస్టాండు

సిద్ధం సభ కోసం వాహనాల మళ్లింపు

● స్తంభించిన ట్రాఫిక్



సిద్ధం బస్సును పంపిస్తున్న పోలీసులు



పొలాల్లో బోల్తాపడిన లారీ

ఒంగోలు క్రైం, మార్చి 10: మేదరమెట్లలో సిద్ధం సభ కారణంగా ఆదివారం త్రోవగుంట నుంచి చీరాల మార్గంలో వాహనాలను మళ్లించడంతో ప్రజలకు అవస్థలు తప్పలేదు. ఒంగోలు నుంచి గుంటూరు, విజయవాడ వైపు వెళ్లే వాహనాలను త్రోవగుంట వద్ద నుంచి చీరాల జాతీయరహదారి వైపు మళ్లించారు. అదేవిధంగా విజయవాడ, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు కూడా చీరాల రోడ్డుకు మళ్లించారు. అదే రోడ్డులో నుంచి సిద్ధం సభ వాహనాలు రావాడంతో ట్రాఫిక్ జామ్ అయింది. చీరాల నుంచి ఒంగోలుకు రావడానికి నాలుగైదు గంటల పట్టడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం కొన్ని వాహనాలను చీరాల రోడ్డులో పొలాల్లోకి పోలీసులు పంపించడంతో ఓ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. కాగా త్రోవగుంట వద్ద నుంచే సాధారణ వాహనాలను నియంత్రణ చేయడంతో కనీసం మద్దిపాడు, ఏడుగుండ్లపాడు గ్రామాలకు వెళ్లేవారు సైతం పోలీసుల అనుమతితో వెళ్ళాల్సి వచ్చింది. గ్రోత్ సెంటర్ నుంచి కేవలం సిద్ధం సభ వాహనాలను మాత్రమే అనుమతి ఇచ్చారు. దీంతో ప్రయాణికుల అవస్థలు వర్ణాతీతంగా మారాయి.

అవీ..ఇవీ..

నేడు పోలీసు స్పందన రద్దు

ఒంగోలు క్రైం, మార్చి 10: ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సిన పోలీసు స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు పోలీసు కార్యాలయం వర్గాలు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించాయి. కావున జిల్లాలోని ఫిర్యాదిదారులు ఎవరూ సుదూర ప్రాంతాలనుంచి వ్యయప్రయాసలకు ఓర్చి రావద్దని, ప్రజలు ఈ విషయం గమనించాలని కోరారు.

నేడు ఈదుమూడిలో విగ్రహావిష్కరణ

నాగులుప్పలపాడు, మార్చి 10 : ఈదుమూడిలోని ఆర్వోప్లాంటు వద్ద నూతనంగా నిర్మించిన బస్‌షెల్టర్, వైఎస్ఆర్ విగ్రహాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్, మంత్రి మేరుగ నాగార్జున, మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ కనకారావు, ఎంపీపీ ఎస్.అంజమ్మ, కృష్ణారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

ప్రింటింగ్ రంగ కార్మికులను ఆదుకోవాలి



ఎంపీ మాగుంటకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 10: జిల్లాలోని ప్రింటింగ్ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సహకారం అందించాలని ప్రింటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని కోరారు. ఆదివారం ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో వారు ఎంపీ మాగుంటను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.నెల్సన్ రాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రింటింగ్ రంగ కార్మికులు పలు సమస్యలను ఎదుర్కొటున్నట్లు చెప్పారు. ముఖ్యంగా కనిగిరిలోని నవోదయ ప్రింటింగ్ ప్రెస్ కార్మికుడు షేక్ బాషా గుండెపోటుతో మరణించాడని, ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఆ నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత అందించాలని కోరారు. దీనిపై స్పందించిన మాగుంట తప్పకుండా బాషా కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్, యామిని కృష్ణ, ప్రింటింగ్ షాపుల యమానులు, కార్మికులు పాల్గొన్నారు.

మాధవరావుకు స్వర్ణ శివనంది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మాధవరావు

ఒంగోలు(కల్చరల్), మార్చి, 10: శ్రీఅభయసేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావుకు హైదరాబాద్‌కు చెందిన కళాకార్ తెలుగు సంస్థ స్వర్ణ శివనంది పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించింది. ఆదివారం హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో అడిషన్ ఎస్పీ రామదస్‌తేజవత్ చేతులమీదుగా మాధవరావుకు స్వర్ణ శివనందిని, ప్రశంసాపత్రాన్ని అందజేసి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా మాధవరావు చేస్తున్న కృషి అభినందించారు. కాగా మాధవరావుకు పురస్కారం లభించటం పట్ల జిల్లాకు చెందిన కళాకారులు, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

పాగాలంకరణ వ్యాఖ్యాతగా పొన్నూరి



వ్యాఖ్యానం చేస్తున్న పొన్నూరి వేంకటశ్రీనివాసులు

ఒంగోలు(కల్చరల్), మార్చి 10: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో జరిగే పాగాలంకరణ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించే అవకాశం ఒంగోలుకు చెందిన ప్రరసం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులుకు లభించింది. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి రోజు లింగోద్భవ సమయంలో నిర్వహించే విశిష్ట కార్యక్రమం పాగాలంకరణ. అటువంటి కార్యక్రమానికి వ్యాఖ్యాతగా జిల్లా నుంచి రెండవసారి కూడా శ్రీనివాసులుకు అవకాశం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఇటువంటి అవకాశం లభించటం శ్రీశైల మల్లిఖార్జునుడి కృప అని, ఈ అవకాశం ఇచ్చిన దేవస్థాన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఒక విశిష్ట కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన పొన్నూరి వేంకట శ్రీనివాసులుకు ప్రరసం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, ముస్లిం రచయితల సంఘ అధ్యక్షుడు షేక్ మహబూబ్ జాన్, ఎర్రన సాహిత్య పరిషత్ అధ్యక్షులు మైనంపాటి సాయికుమార్, అన్నమయ్య సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు ఐ.మురళీకృష్ణలు అభినందనలు తెలిపారు.

మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న తిరుమల

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 10: శ్రామిక మహిళలపై సాగిస్తున్న దోపిడీ, దాడులకు, హింసకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడుదామని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు తిరుమల పిలుపునిచ్చారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాటదినం సందర్భంగా ఆదివారం ఒంగోలు నగరం ఈమనిపాలెంలోని స్త్రీవిముక్తి సంఘటన ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆమె మాట్లాడారు. మహిళా సాధికారత నినాదాలకే పరిమితమైందన్నారు. ఎన్‌జీవో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కె.కోటేశ్వరమ్మ, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి మాట్లాడుతూ ఆయిల్ వనరులపై సామ్రాజ్యవాదుల ఆధిపత్యం కోసం పాలస్తీనా మహిళలు బలి అవుతున్నారన్నారు. మణిపూర్ మహిళలు అక్కడి అడవుల్లోని సంపదలపై బహుళజాతి కంపెనీల దోపిడీ కోసం దాడులకు గురవుతున్నారని చెప్పారు. జిల్లా అధ్యక్షురాలు డి.రేణుక అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనసాహిత జిల్లా కార్యదర్శి ప్రసన్న, స్త్రీ విముక్తి సంఘటన కార్యదర్శి వి.శాంతకుమారి, వి.అంజనాదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమానత్వం కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఉదయిని

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 10: సమాజంలో సగభాగమైన మహిళలు నేటికి సమానత్వాన్ని పొందలేకపోతున్నారని, అందువల్ల సమైక్యంగా ఉద్యమాలు చేయడం ద్వారానే సమానత్వాన్ని సాధించుకోగలరని బేతూన్ నర్సింగ్ హోం వైద్యురాలు ఎస్.ఉదయిని పేర్కొన్నారు. ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో ఐద్వా, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన మహిళా దినోత్సవ సభలో ఆమె మాట్లాడారు. ఆధునిక సమాజంలోనూ మహిళలపై వివక్షత, దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరగడం విచారకరమన్నారు. ఐద్వా నాయకురాలు రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వీరాంజనేయులు ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, కళ్యాణి, ఝాన్సీ, సీ తామహా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతులు కలళ్యాణం



గ్రామంలో ఊరేగుతున్న స్వామివారు

ఒంగోలు(రూరల్), మార్చి 10: ఒంగోలు నగరం త్రోవగుంటలోని శ్రీగంగాపార్వతీ సమేత శ్రీమూలస్థానేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఆమంచి ఉదయభాస్కర్ స్వామివారి కల్యాణ క్రతువును ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం జరిగింది. సాయంత్రం స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు

వాహనం ఢీకొని యువకుడి మృతి

త్రిపురాంతకం, మార్చి 10: గుర్తు తెలియని వాహనం ఢీకొని టి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన అలగముతక శ్రీను(23) ఆదివారం మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై మిట్టపాలెం వెళుతుండగా గ్రామ సమీపంలోకి వెళ్లేసరికి వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వై.పాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



టీడీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న స్వామి, సత్య

టీడీపీలో చేరిన 21 వైసీపీ కుటుంబాలు

● కండువాలు వేసి ఆహ్వానించిన స్వామి, సత్య

టంగుటూరు, మార్చి 10 : మండలంలోని ఎం నిడమలూరుకు చెందిన 21 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరంతా ఎం నిడమలూరు గ్రామ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కాకుమాని సుబ్బారావు, సీనియర్ నేత పిడుగురాళ్ల సురేష్‌బాబు నేతృత్వంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. జాతీయ రహదారిలో ఐటీసీ ఎదురుగా ఉన్న టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే స్వామి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య వీరి మెడల్లో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామి, సత్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కొత్తవారికి సైతం పాతవారితో సమానంగా గౌరవం ఉంటుందన్నారు. పాత, కొత్త నాయకులంతా సమన్వయంతో పనిచేస్తూ టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. టీడీపీ నాయకుడు పిడుగురాళ్ల సురేష్ మాట్లాడుతూ ఎం నిడమలూరులో టీడీపీ వారి ఇళ్లకు కుళాయి కనెక్షన్లు కూడా ఇవ్వలేదని, టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని ఇళ్లకూ కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. ముందుగా వైసీపీ నాయకుడు బోడపాటి అంజిబాబుకు ఎమ్మెల్యే స్వామి, సత్య పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. వారి వెంట దేవరపల్లి డేవిడ్, కంకిపాటి రాజేష్, కంకిపాటి హరీష్, ఉచ్చూరి యాకోబు, కాకి సుధాకర్, చాట్రగడ్డ ప్రభాకర్, కోడూరి వంశీ, దేవరపల్లి విజయ్, పంచాయతీ సభ్యురాలి భర్త చాట్రగడ్డ మధు, చుండి రాజు, పసుమర్తి కోటేష్, పసుమర్తి చంకయ్య, పిడుగురాళ్ల నరసింహారావు, పిడుగురాళ్ల కిరణ్, గడ్డం లక్ష్మీనరసింహం, పాలేటి లక్ష్మీనారాయణ, కొండ్రు బాలకృష్ణ, చేగొండి యశ్వంత్, నిడమనూరి శ్రీను, పేరాబత్తిన రాము కుటుంబాలు టీడీపీలో చేరాయి.

పోతుల వెస్ట్ కాలనీ నుంచి ..

టంగుటూరు పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీకి చెందిన 30 వైసీపీ కుటుంబాల వారు ఆదివారం రాత్రి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరంతా స్థానిక టీడీపీ నాయకుడు మొలకలపల్లి శ్రీనివాసరావు, శ్రీహరి నేతృత్వంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.టంగుటూరులో జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, రైతునేత బెజవాడ వెంకటేశ్వర్లు, టంగుటూరు సర్పంచ్ మద్దిరాల మమత, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి తోకల భారతి, శ్రీదేవి, బ్రహ్మానందం పాల్గొన్నారు.



బస్సులు లేక ఆటోలు ఎక్కుతున్న ప్రయాణికులు

'సిద్ధం' దెబ్బకు కిటకిటలాడిన ఆటోలు

టంగుటూరు, మార్చి 10 : ముఖ్యమంత్రి జగన్ సిద్ధం సభ దెబ్బకు ఆదివారం బస్సులు లేక ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. బస్టాండ్‌లో గంటల తరబడి నిలబడినా ఒక్క బస్సు కూడా రాలేదు. దీంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించక తప్పలేదు. టంగుటూరులోని ఇటు ఒంగోలు, అటు సింగరాయకొండ, ఇంకా కొండపి మార్గాల్లో ప్రయాణికులతో ఆటోలు కిటకిటలాడాయి. రోడ్డు మార్గాన మోటారు సైకిళ్లపై వెళ్లే వారిని కూడా లిఫ్ట్ అడిగారు. కొందరైతే సిద్ధం సభలకు వెళ్లే బస్సులు ఎక్కి వారి ప్రయాణ అవసరాలు తీర్చుకున్నారు. ప్రయాణికులంతా బస్సులు లేకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఆదివారం హాస్టళ్లలో చదివే పిల్లల వద్దకు వెళ్లే కుటుంబ సభ్యులు, ఇతర పనులపై పట్టణాలకు వెళ్లే వారంతా బస్సులు లేక అల్లాడిపోయారు

దిగుబడి లేదు.. ధరా లేదు

అనుకూలించని వాతావరణం, వర్షాభావం

నష్టాల్లో శనగ కౌలు రైతులు

సొంతదారులకు దక్కిన పెట్టుబడి



శనగ నూర్పిడి చేస్తున్న కూలీలు

కొండపి, మార్చి 10 : ఈ ఏడాది శనగ వేసిన కౌలు రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. సొంతభూమిలో శనగ వేసిన రైతులకు కౌలు కూడా దక్కే పరిస్థితి లేదు. పెట్టిన పెట్టుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉంది. కొండపి ప్రాంతంలో శనగ సాగు రెండేళ్లుగా తగ్గిపోతూనే ఉంది. గతంలో కొండపి మండలంలో 3 వేల హెక్టార్లలో, జరుగుమల్లి మండలంలో కూడా 3500 హెక్టార్లలో సాగు చేసేవారు. రెండేళ్లుగా ఈ రెండు మండలాల్లో పొగాకు సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ ఏడాది ఆ రెండు మండలాల్లో కలిపి దాదాపు 3వేల హెక్టార్లలో మాత్రమే శనగ సాగు చేశారు. ఈ ఏడాది డిసెంబరులో మాత్రమే వర్షం కురిసింది. వర్షానికి ముందుగా శనగలు విత్తిన రైతులకు ఎకరాకు 7 క్వింటాళ్లు దిగుబడి వస్తుండగా, వర్షం తర్వాత శనగ పంట వేసిన వారికి 4నుంచి 5 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తున్నది.

నాణ్యత తక్కువ

శనగ పైరు వేశాక వర్షం పడకపోవడంతో దిగుబడి పడిపోయింది. శనగకాయలు తగ్గిపోయి, గింజలు కూడా సైజు పెరగలేదని రైతులు తెలిపారు. శనగ వేశాక తేలికగా వర్షం పడితే దిగుబడి వచ్చేదని, గతేడాది డిసెంబరులో వర్షం పడ్డాక తిరిగి పడలేదని, అందువల్ల దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. సహజంగా అధిక దిగుబడిని ఇచ్చే నల్లరేగడి నేలల్లో కూడా ఈఏడాది దిగుబడి తగ్గింది. ఎర్ర రేగడి నేలల్లో సహజంగా దిగుబడి తగ్గింది.

కాగ్ -2 రకం క్వింటా రూ.7,800

కాగ్-2 రకం శనగ కొండపి ప్రాంతంలో అధికంగా వేశారు. కాగ్-2 రకం శనగలు కోతలకు ముందు క్వింటా ధర 10,500 రూపాయలు వరకు పలికింది. కోతలు అంతటా ప్రారంభమయ్యాక క్రమంగా ధర తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం 7,800 రూపాయలకు చేరిందని అంటున్నారు. ధరలో నిలకడ లేకపోవడంతో అటు వ్యాపారులు, రైతులు కూడా మిన్నకుండి పోతున్నారు. వ్యాపారులు కొనడం లేదు. అదేవిధంగా పెద్ద రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వచేసుకుంటుండగా, చిన్న, సన్నకారు, కౌలు రైతులు విక్రయిస్తున్నారు. నల్లరేగడి నేలలు ఎకరం 20 నుంచి 25 వేల రూపాయలకు కౌలుకు తీసుకున్న రైతులకు కౌలు నష్టం వస్తుండగా, సొంత భూమిలో శనగ వేసిన రైతులకు పెట్టుబడి మాత్రమే ఇప్పుడు ఉన్న ధర ప్రకారం దక్కుతున్నది. దుక్కి దున్నకం, రెండుసార్లు గొర్రు తోలకం, సత్తువ మందు, పురుగుమందుల ధరలు, పిచికారి కూలీలు, కలుపు కూలి, కోత, మిల్లర్ల ధరలు గణనీయంగా పెరగంతోపాటు ఈ ఏడాదే దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు.

సిద్ధం సభకు జన స్పందన అంతంతే..

తొలుత మండలానికి వంద బస్సుల ఏర్పాటుకు ప్రణాళిక

అంతజనం రారన్న మండల నాయకులు

ఆ తర్వాత 50 బస్సులు పంపారు

వాటిలో కూడా ప్రజలు ఎక్కక కొన్ని వెనక్కి..

కొండపి, మార్చి 10 : అద్దంకి నియోజకవర్గం మేదరమెట్ల వద్ద వైసీపీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సిద్ధం సభకు నియోజకవర్గం నుంచి స్పందన నామమాత్రంగా మారింది. ఆ సభకు నియోజకవర్గం నుంచి భారీగా జన సమీకరణ చేయాలని పది రోజుల నుంచి రాష్ట్ర మంత్రి, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తొలుత నియోజకవర్గంలోని ఆరు మండలాలకు మండలానికి 100 బస్సుల చొప్పున పంపిస్తానని, వాటికి జనాన్ని ఎక్కించాలని, ఖర్చులు కూడా తానే చూసుకుంటానని ఆరు మండలాల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, ఈ సందర్భంలో ఏమిచ్చినా జనం బస్సులు ఎక్కరని పలువురు మండల, గ్రామ స్థాయి నాయకులు మంత్రికి చెప్పారు. నాయకులు, మంత్రి తర్జనభర్జనల అనంతరం మండలానికి 50 బస్సులు పంపారు. కొన్ని మండలాల్లో వాటికి కూడా జనాన్ని ఎక్కించడం కష్టమేనని అనడంతో మండలానికి 40 బస్సుల చొప్పున 240 బస్సులు ఏర్పాటు చేయగా, వాటిల్లో కూడా కొన్నింటిని కొన్ని మండలాల నుంచి పొరుగు మండలాలకు పంపారని తెసింది. ప్రతి బస్సుకు పది వేల రూపాయల చొప్పున ఆయా గ్రామాల నాయకులకు మంత్రి ఖర్చులకు ఇచ్చారని తెలిసింది. కొండపి, టంగుటూరు, జరుగుమల్లి మండలాల నుంచి కొన్ని బస్సులు జనం లేక ఉదయాన్నే వచ్చి వెనుదిరిగి వెళ్లాయి.



టంగుటూరులో హోటల్ వద్ద ఆగి ఉన్న బస్సులు

వైసీపీ శ్రేణుల సమీకరణకు నానాఅగచాట్లు

టంగుటూరు : మేదరమెట్లలో జరుగుతున్న సిద్ధం సభకు వైసీపీ శ్రేణులను తరలించేందుకు పార్టీ బాధ్యులు నానాఅగచాట్లు పడ్డారు. బస్సెక్కిన వారికి మందు, భోజనం ఇస్తున్నారు. బస్సెక్కిన మరుక్షణం నుంచే మాకు అవి కావాలి, ఇవి కావాలంటూ కార్యకర్తల ఒత్తిడి దెబ్బకు బాధ్యులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. పార్టీ బస్సు ఎక్కే వారి ఖర్చులకు ఇచ్చింది కేవలం రూ.10వేలు. బస్సు రెస్టారెంట్ దగ్గర ఆగిందంటే బాధ్యుడి జేబు గుల్లే. ముందు సభ పది గంటలకేనన్నారు. తిరిగి మధ్యాహ్నం 2గంటలకు మార్చడంతో బస్సులన్నీ హోటళ్ల ముందే దర్శనం ఇచ్చాయి. నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన బస్సులు సైతం జాతీయ రహదారిలో రెస్టారెంట్ల ముందు ఆగిపోయాయి. టంగుటూరు మండలానికి 60 బస్సులు కేటాయించారు. ఒక్క టంగుటూరుకే 6బస్సులు ఏర్పాటు చేశారు. అత్యధిక బస్సుల్లో 20 మందికి మించి ఎక్కలేదు. ఆలకూరపాడుకు రెండు బస్సులు పంపించగా అందులో ఒక బస్సు ఖాళీగానే తిరిగి వెళ్లిపోయింది. మరొక బస్సుల్లో 15 మంది ఎక్కారు.

టీడీపీ ఇన్‌చార్జి గోరంట్లకు అభినందనలు

తాళ్లూరు, మార్చి 10 : టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన శ్రీ హర్షిణి విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవికుమార్‌ను తాళ్లూరు మండల తెలుగు తమ్ముళ్లు ఆదివారం ఒంగోలు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి అభినందలు తెలిపారు. గత కొంత కాలంగా దర్శి నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జి లేక పోవడం వల్ల కార్యకర్తల సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారని, టీడీపీ బలోపేతానికి కృషి చేస్తూ తమకు అండగా నిలవాలని గోరంట్లకు విజ్ఞప్తి చేశారు. కార్యకర్తలకు అండగా వుంటానని గోరంట్ల భరోసా ఇచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. గోరంట్ల దంపతులను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వహక కార్యదర్శులు వల్లభనేని సుబ్బయ్య, శాగంకొండారెడ్డి, రాష్ట్ర టీడీపీ మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ కాలేషావలి, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు,నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ మీరామొహిద్దీన్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు చెన్నపురెడ్డి వీరనాగిరెడ్డి, టీడీపీ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వంగపల్లి నాగేశ్వరరావు, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, కె.రామకోటిరెడ్డి, ఎస్.ఆదినారాయణరెడ్డి, కె.నరసింహారావు, షేక్ కాశీంసైద్, కుమ్మిత సుబ్బారెడ్డి, జీ లక్ష్మీనారాయణ, జీ రమణారెడ్డి, కె.రామయ్య, ఎర్రాయిమ్, నాదెండ్ల శ్రీను, పాలెపోగు రాజు పాల్గొన్నారు.



రవికుమార్‌కు అభినందనలు తెలుపుతున్న తాళ్లూరు తెలుగు తమ్ముళ్లు

దొనకొండ : టీడీపీ ఇన్‌చార్జిగా గోరంట్ల రవికుమార్ నియామకం పట్ల టీడీపీ మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి నేతృత్వంలో పార్టీ కార్యాలయంలో ఆదివారం సంబరాలు నిర్వహించారు. బాణసంచాకాల్చి కేకు కట్ చేసి ప్రజలకు కేక్, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు షేక్ మూసామియా, కామేపల్లి చెంచయ్య, షేక్ సుభానీ మాట్లాడుతూ రవికుమార్ నియామకంపై హర్షం ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుగ్గెంపూడి కోటేశ్వరరావు, వేగినాటి అల్లూరయ్య, వల్లపనేని ఆదినారాయణ, వైకె చౌదరి, ఫణిదపు అనంతరాములు, సింగమనేని హనుమంతు, ఫణిదపు వీరాంజనేయులు, మాచర్ల యోహాన్ పులిమి శివ, విప్పర్ల శేషు, బత్తుల గాలయ్య, యాంగటి పోలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

రాష్ట్ర భవిష్యత్ కోసమే పొత్తు

● ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

● అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని హామీ

సింగరాయకొండ, మార్చి 10 : రాష్ట్ర భవిష్యత్‌ను, ప్రజల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని జరగబోయే సార్వత్రిక ఎన్నికల కురుక్షేత్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా పోటీ చేయనుందని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. మండలంలోని కనుమళ్ల అరుంధతీ, అంబేద్కర్ నగర్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన శంఖారావం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వామి మాట్లాడారు. అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించి కూటమి ఎన్నికల్లో విజయ దుదింభి మోగిస్తుందని జోస్యం చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మహాశక్తి పథకం ద్వారా ఆడబిడ్డ నిధి కింద 18 నుంచి 59 ఏళ్ల వరకు ఇంట్లో ఎంతమంది ఉన్నా ఒక్కొక్కరికీ నెలకు రూ.1500 చెల్లిస్తామన్నారు. తల్లికి వందనం పేరిట ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉన్నా ఏడాదికి ఒక్కొక్కరికి రూ. 15 వేలు చెల్లిస్తామని చెప్పారు. ఒక్కో మహిళకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పింఛన్‌ను రూ.3వేలు నుంచి రూ. 4వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ ఐదేళ్లలో తాము వేసిన రోడ్ల పక్కన ఒక్క సైడుకాలువ కూడా కట్టించలేదని అసమర్థ ప్రభుత్వం వైసీపీదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు వేల్పుల సింగయ్య, ఐనాబత్తిన రాజేష్, నేతలు చీమకుర్తి కృష్ణ, కూనపరెడ్డి సుబ్బారావు, పులి ప్రసాద్, చిగురుపాటి గిరి, సుదర్శి చంటి, భైరవనేని మోహన్‌రావు, మోటుపల్లి వెంకటేశ్వర్లు, చెనికల మాల కొండయ్య కూతల సురేష్, యస్థాని, నరసింహ, శేషు, చంటి, వల్లెపు రవి పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నయనానందం.. శివపార్వతుల రథోత్సవం

దర్శి, మార్చి 10 : దర్శిలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నయనానందంగా సాగింది. శివరాత్రి రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్న విషయం విదితమే. శివపార్వతుల కల్యాణం ఆదివారం నిర్వహించారు. ఆది దంపతులను ఆదివారం బంగారు రథంలో ఊరేగించారు. జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లివెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గొలుసులాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. వందలాది మంది భక్తులు, మహిళలు గొలుసులాగేందుకు పోటీపడ్డారు. కాశీవిశ్వేశ్వర ఆలయం నుంచి అద్దంకి రోడ్డు మీదుగా గడియార స్తంభం వద్దకు చేరుకున్న రథంపై ఆదిదంపతులు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయం వరకు రథోత్సవ కార్యక్ర మం జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు కొందరు పులిహోర, మజ్జిగను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

డాక్టర్ ఉగ్రను గెలిపించాలి

● ముస్లిం మైనారిటీల సమావేశంలో అమీర్‌బాబు

పామూరు, మార్చి 10 : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి ముస్లిం మైనారిటీలు వచ్చే ఎన్నికల్లో మద్దతు తెలిపి గెలిపించాలని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీర్‌బాబు సూచించారు. టీడీపీ మండల ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ గౌస్‌బాషా గృహంలో ముస్లిం నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఉగ్ర అనుమతితో పామూరు షాదిఖానా ఫంక్షన్ హాల్‌లో త్వరలో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమీర్‌బాబు మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనారిటీలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని బాగు చేస్తామని, ముస్లింలను అన్నివిధాలా ఆదుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి మాటతప్పారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీకి మద్దతు ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలో ఉగ్ర గెలుపునకు అందరం సహకరించాలని అమీర్‌బాబు కోరారు. సమావేశంలో జిల్లా మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి ఆర్‌ఆర్ రఫీ, పట్టణ గౌరవాధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, పులి నాయభ, ముబినమౌలాలి, కౌలూరి రహంతుల్లా, చినహజరత్, కావేరి రసూల్, కోడిగుంపల నాయబ్‌రసూల్, పత్తు మస్తాన్, మాచర్ల రహిమాన్, నాయభ, షేక్ జిలానీ, హాజీ, ఖాదర్‌బాషా, రహంతుల్లా, జనసేన జిల్లా కార్యదర్శి వై.రహీములా పాల్గొన్నారు.

బస్సు నుంచి జారిపడి యువకుడు మృతి

అద్దంకి, మార్చి 10: మేదరమెట్ల సమీపంలో జరిగిన సిద్ధం సభకు వచ్చిన యువకుడు తిరిగి వెళ్లే సమయంలో బస్సులో నుంచి జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. నర్సరావుపేట పట్టణంలోని స్టేడియం ఎదురు చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన గేదెల బాల దుర్గారావు(27) ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓ ప్రయివేట్ కళాశాల బస్సులో మేదరమెట్ల సమీపంలో జరిగిన సిద్ధం సభకు హాజరయ్యారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సభ జరిగే సమయంలోనే దుర్గారావు వచ్చిన బస్సు తిరుగు ప్రయాణమైంది. అద్దంకి మండలం గోపాల పురం వద్దకు వచ్చేసరికి బస్సులో గేటు వద్ద నిలబడి ఉన్న బాలదుర్గారావు జారి కిందపడ్డాడు. దీంతో అతనిపై గుండా అదే బస్సు వెనుక టైర్లు వెళ్ళటంతో తల నుజ్జు అయ్యి అక్క డికక్కడే మృతిచెందాడు. దుర్గారావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. దుర్గారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



మృతి చెందిన గేదెల బాలదుర్గారావు

వైసీపీ కార్యకర్తల దాడిలో యువకుడికి గాయాలు

పంగులూరు, మార్చి 10: సిద్ధం సభకు రానని చెప్పడంతో వైసీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేశారు. మండలంలోని రామకూరులో ఆదివారం జరిగిన ఈ ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. మేదరమెట్ల సమీపంలో ఏర్పాటుచేసిన సిద్ధం సభకు ప్రత్యేక బస్సులలో వైసీపీ కార్యకర్తలు బయలుదేరారు. ట్రాక్టర్ నడుపుతూ గ్రామంలో మంచినీరు తాగేందుకు ఆగిన తలారి ధనచక్రవర్తిపై పార్టీ జెండాలున్న కర్రలతో వైసీపీ కార్యకర్తలు దాడిచేయడంతో గాయపడ్డాడు. గాయపడిన ధన చక్రవర్తిని చికిత్స నిమిత్తం ఉపసర్పంచ్ పెడవల్లి అశోక్, మరికొందరు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సిద్ధం సభకు రమ్మని కోరగా తాను నిరాకరించాడంతో తలపై కర్ర తో మోది గాయపరిచారని ధనచక్రవర్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గతంలో వైసీపీలో ఉన్న ధనచక్ర వర్తి మూడేళ్ళ క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికలలో ఆ పార్టీకి దూరమైనట్లు సమాచారం.

నలుగురికి నోటీసులు

చినగంజాం, మార్చి 10: కొరిశపాడు మండలం గుడిపాడు వద్ద జరిగే సిద్ధం సభలో పాల్గొనరాదని మండలంలోని నలుగురికి చినగంజాం పోలీసులు నోటీసులు అందజేశారు. మండలంలోని కడవకుదురుకు చెందిన సీపీఎం నాయకుడు గున్నమనేని ప్రతాప్‌కుమార్, జనసేన మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు, సోపిరాలకు చెందిన వైసీపీ నాయకుడు అనుమాలశెట్టి శ్రీరామకృష్ణ, చినగంజాంకు చెందిన మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్‌కు శనివారం రాత్రి పోలీసులు నోటీసులు అందజేసి, ఆదివారం ఉదయం బైండోవర్ చేశారు. సిద్ధం సభలో పాల్గొని ఏదైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా ఉండేనిమిత్తం ముందు జాగ్రత్తచర్యలో భాగంగా నోటీసులు అందజేశారు. మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై సిద్ధం సభలో ప్లకార్డులను ప్రదర్శిస్తామనే భయంతో నోటీసులు జారీచేసి భయ భ్రాంతలకు గురిచేయడం అన్యాయమని ప్రతాప్‌కుమార్, శ్రీనివాసరావు పేర్కొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసమే..!

- కేడర్‌కు పొత్తు అవసరాన్ని వివరించిన నేతలు
- బూత్, క్లస్టర్ ఇన్‌చార్జులతో ముత్తుముల సమావేశం



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, మార్చి 10 : రానున్న 2024 ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి పొత్తుతో వైసీపీలో వణుకు మొదలైందని ఎర్రగొండపాలెం టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబు ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కూటమి పొత్తుపై విలేకర్లతో మాట్లాడారు. కూటమి పొత్తు చారిత్రాత్మక కలయిక అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్టపరిస్థితుల ఆధారంగా టీడీపీ అధినేత చంద్రబాబు పొత్తుపెట్టుకున్నారని అన్నారు. వైసీపీ నిరంకుశ పాలనను తుదముట్టించేందుకే టీడీపీ, బీజేపీ, జనసేనలు ఒక తాటిపైకి వచ్చాయన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, 18 నుంచి 60 ఏళ్ల లోపు మహిళలకు నలెకు రూ.1500 ఆర్థిక సాయం అందజేస్తారన్నారు. రైతులకు ఏడాదికి రూ.20 వేల సాయం, నిరుద్యోగులకు నెలకు 3 వేల భృతి అందజేస్తారని అన్నారు. వైసీపీ చేసే అక్రమల పై టీడీపీ అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మీ ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చేకూరి సుబ్బయ్య, మాజీ ఎంపీపీ మంత్రూ నాయక్, చేవుల అంజయ్య, చిట్యాల వెంగళ్‌రెడ్డి, కాకర్ల కోటయ్య, సత్యనారాయణగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : టీడీపీ జనసేన, భారతీయ జనతపార్టీల కూటమిని టీడీపీ సభ్యులుగా స్వాగతిస్తున్నామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల దృష్ట్యా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పొత్తునిర్ణయం తీసుకున్నారన్నారు. వైసీపీ నిరంకుశ పాలన, ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలికేందుకు టీడీపీ, బిజెపి, జనసేనలు కలిసి పోటీ చేస్తున్నాయన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. కులంతో సంబంధం లేకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీలపై దాడులు వైసీపీ ప్రభుత్వంలో ఎక్కువగా జరిగాయన్నారు. ఈ ప్రభుత్వం లో బీసీలను ఎంత హీనంగా చూశారో ఆపార్టీకి చెందిన బీసీసెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి మాటల్లోనే అర్థమవుతోందని పేర్కొన్నారు. బీసీలకు టీడీపీ పుట్టినిల్లు లాంటిదని అన్నారు. మొన్న జరిగిన జయహో బీసీ ద్వారా మరోసారి రుజువైందన్నారు. తెలుగు ప్రజల కోసం ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతి కోసం టీడీపీ సంకల్పించిన మహాయజ్ఞానికి జనసేనతోపాటు బీజేపీ కూడా కలిసి వచ్చిందన్నారు.



క్లస్టర్ ఇన్‌చార్జుల సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి



గిద్దలూరులో సమావేశానికి హాజరైన క్లస్టర్ ఇన్‌చార్జులు

గిద్దలూరు టౌన్ : రానున్న ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీదే విజయమని ఆపార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం నంద్యాల రోడ్డులోని చీతిరాల కల్యాణ మండపం వద్ద గిద్దలూరు మండలంలోని 7, 8, 9 క్లస్టర్ల పరిధిలోని యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, కుటుంబ సాధికార సారధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు అభివృద్ధికి అవినీతికి మధ్యన జరిగే యుద్ధమన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే టీడీపీ, జనసేనలతోనే సాధ్యమన్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ కార్యకర్తలు కష్టపడి ఓటర్లను టీడీపీ వైపు తిప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని, ప్రతి ఒక్కరూ తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ మండల, పట్టణ పార్టీల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, షహన్వావలి, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, బైలడుగు బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అక్రమాలకు అడ్డుకట్టవేయాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బేస్తవారపేట, మార్చి10 : రాష్ట్రంలో జరుగుతున్న వైసీపీ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. బేస్తవారపేటలో ఆదివారం ఇంటింటికి తిరిగి ఆ గ్రామ మాజీ సర్పంచ్ గాజుల విశ్వనాథం, నాయకులు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. వైసీపీ పాలనలో జరుగుతున్న అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. అందుకు ప్రజలే అడ్డుకట్ట వేయాల్సిన సమయం వచ్చిందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీని అఖండ మేజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ముప్పూరి రాము, బోయిళ్ల రోషన్ బాబు, పొలిశెట్టి సుబ్రహ్మణ్యం, బీసు అరుణ్‌కుమార్, దూదెకుల సైదులు, కోనపల్లె లోయలో మండల పార్టీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రచారం నిర్వహించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

త్రిపురాంతకం, మార్చి 10: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని మిట్టపాలెం సమీపంలో ఆదివారం చోటుచేసుకొంది టి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన అలగముతక శ్రీను(23) ద్విచక్రవాహనంపై మిట్టపాలెం వెళుతున్నాడు. గ్రామ సమీపంలోకి వెళ్లేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వై.పాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



మృతిచెందిన యువకుడు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మార్కాపురం రూరల్, మార్చి 10: పట్టణంలోని ఒకటో సచివాలయంలో ఎడ్యు కేషన్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న సిద్దంశెట్టి నరేంద్రకుమార్ గత నెల 13వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆయన సోదరుడు చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరిసర ప్రాంతాలలో ఎవరికైనా తప్పిపోయిన వ్యక్తి సమాచారం తెలిసినట్లయితే పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమాచారం తెలియజేయాలని పట్టణ ఎస్ఐ అబ్దుల్ రహమాన్ కోరారు.



నరేంద్ర కుమార్

నేడు వేలంపాట

గిద్దలూరు, మార్చి 10 : గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో మాంసం మార్కెట్‌లో రోజు వారి రుసుం వసూలు చేసే హక్కు కోసం 11వ తేదీ సోమవారం సాయంత్రం 4గంటలకు తమ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో వ్యాపారులు వేలంపాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఓపీఎస్ అమలులో మాటతప్పిన జగన్

- యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పొదిలి, మార్చి 10 : వైసీపీ అధికారంలోకి ఇచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని నమ్మబలికిన జగన్‌రెడ్డి ఐదేళ్లయినా, అమలుచేయలేదని, ఆయన మాట తప్పారని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాదయాత్రలో చెప్పిన హామీ అమలు చేయడం మాని, దానిస్థానంలో ఉపయోగం లేని జీపీఎస్ విధానాన్ని తెరపైకి తెచ్చారన్నారు. గ్యారెంటీ పెన్షన్ విధానంతో గ్యారెంటీ లేదని తక్షణమే ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందుకు సహకరించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని తేల్చి చెప్పారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కమిటీ వేసి 50శాతం పెన్షన్ మాత్రమే ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. కానీ ఇప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి ఇచ్చిన తరువాత 50శాతం పెన్షన్ ఇస్తామని, డీఏ, పీఆర్సీ ఇవ్వడం కుదరదని కంట్రిబ్యూషన్ చెల్లించాలని అన్నారన్నారు. కంట్రిబ్యూషన్‌లేని ఓపీఎస్ మాత్రమే కావాలన్నారు. జనవరి 28న రాజమండ్రిలో ఓట్‌ఫర్ ఓపీఎస్ నినాదం తీసుకొచ్చామన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన డీఏ, పీఆర్సీ, ఎల్‌పీఎఫ్, ఏపీజీఎల్, బకాయిలు సుమారుగా రూ.18వేల కోట్లు మార్చిలోపు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని వారికి పీఎఫ్ నంబర్లు అలర్ట్ చేయాలని కోరారు. జిల్లాలో ఆగిన ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, సిఫార్స్ బదిలీలు నిలుపుదల చేయాలని కోరారు. 30శాతం ఐఆర్ లేదా పీఆర్సీ ప్రకటించి వెంటనే అమలు చేయాలన్నారు. 2024 డీఎస్సీలో దుర్మార్గమైన అప్రెంటీస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి మీగడ వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ బీవీ నరసింహారావ్, జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు, అధ్యక్షులు ఓ.వీరారెడ్డి, సహాధ్యక్షులు అబ్దుల్‌హై, కోశాధికారి చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు బాల వెంకటేశ్వర్లు, రహమతుల్లా, రమణారెడ్డి, పిరమణారెడ్డి, ప్రభాకరరావ్, రాజశేఖర్ తదితర మండల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు

జేబులు గుల్ల చేసిన ఆటోవాలాలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 10: మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి సిద్ధం సభకు బస్సులు వెళ్లడంతో ఆర్టీసీ బస్టాండ్‌లోని ప్రయాణికుల తీవ్ర అవస్థలు పడ్డారు. ఆర్టీసీ డిపోలో మొత్తం 94 బస్సులు ఉండగా 70 బస్సులు సిద్ధం సభకు కేటాయించారు. మరో 4 హయ్యర్ బస్‌లు కూడా బాపట్ల జిల్లా మేదరమిట్లలో జరిగే సిద్ధం సభకు కేటాయించారు. దీంతో అరకొర బస్సులు ఉండటంతో వాటిలో నిలబడి ప్రయాణించారు. ఇదే అదనుగా బస్టాండ్‌లో ఆటో వాలాలు వచ్చి తమ ప్రతాపం చూపించారు. మార్కాపురం నుంచి కంభానికి రూ.30 టికెట్ ఉండగా రూ.100 వసూలు చేశారు. సిద్ధం సభలకు ప్రైవేట్ పాఠశాలల బస్సులు కూడా కేటాయించారు.

గిద్దలూరు : సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులన్నీ వెళ్ళిపోగా ప్రయాణికులు నానా ఇక్కట్లకు గురయ్యారు. గిద్దలూరు ఆర్టీసీ డిపో పరిధిలో 72 బస్సు సర్వీసులు ఉండగా 50 బస్సులు సభకు వెళ్లాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఏ ఒక్క రూటులో కూడా ఆర్టీసీ బస్సు తిరగలేదు. కొమరోలు, అకవీడు, పోరుమామిళ్ల, మైదుకూరు, కంభం, మార్కాపురం, నంద్యాల రూట్లలో ఆదివారం ఒక్క ఆర్టీసీ బస్సు కూడా నడువలేదు. దీంతో ప్రయాణికులు అధిక చార్జీలు వెచ్చించి ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో తరలివెళ్లారు. కేవలం విజయవాడ, హైదరాబాద్ లాంటి సర్వీసులను మాత్రమే అధికారులు తిప్పారు. సభలకు అవసరమైతే కొన్ని బస్సులు తీసుకొని వెళ్లినా, ప్రతి రూటులో కనీసం ఒకటి, రెండు సర్వీసులనైనా తిప్పాలి కదా అని ప్రయాణికులు ప్రశ్నించగా ఆర్టీసీ అధికారులు వారికి సమాధానాలు చెప్పుకోలేక మౌనం వహించడం గమనార్హం.

కంభం : సిద్ధం సభకు బస్సులని తరలివెళ్లడంతో వివిధ ప్రాంతాల నుంచి కంభం ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. కంభం, అర్థవీడు, బేస్తవారపేట మండలాలకు వెళ్లడానికి ఒక్కబస్సు కూడా లేదు. దీంతో పలువురు ప్రయాణికులు ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించి వెళ్లారు.

మార్కాపురం : బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద జరుగుతున్న వైసీపీ సిద్ధం సభకు వెళ్లే కార్యకర్తలకు జోరుగా మద్యం పంపిణీ చేశారు. అధిష్ఠానం ఏర్పాటు చేసిన 150 బస్సులలో ఒక్కొక్క బస్సుకు ఒక్కొక్క కేసు జగన్ మందు పంపిణీ చేశారు. మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి సిద్ధం సభకు బస్సులు, ఇతర వాహనాలు బయలుదేరి వెళ్లాయి. అక్కడ ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ముందుగా తయారు చేసుకున్న జాబితా మేరకు ప్రతి బస్సుకు ఒక కేసు చొప్పున మద్యం పంపిణీ చేశారు. మందు తాగటానికి అవసరమైన గ్లాస్, నీళ్ల కూడా వైసీపీ నాయకులే ఏర్పాటు చేశారు. బస్సులకు పంపిణీ చేసినది జగన్ బ్రాండ్ మద్యం కావడంతో పలువురు నాయకులు, కార్యకర్తలు పెదవి విరిచారు. దీంతో పలువురు నాయకులు తమ పరపతి ఉపయోగించుకొని ఆ కేసులను బార్ అండ్ రెస్టారెంట్లలో మార్పు చేసి మిగిలిన డబ్బులను వారు చెల్లించి తీసుకెళ్లారు.





మార్కాపురం, కంభం బస్టాండుల్లో వేచి ఉన్న ప్రయాణికులు



మద్యంకేసును తీసుకెళుతున్న కార్యకర్తలు

మానవత్వం చాటుకున్న చిన్నారులు

పొదిలి, మార్చి 10 : పొదిలి తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఓ శునకాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న శునకాన్ని చూసిన చిన్నారుల మానవత్వం చాటుకున్నారు. ఆ శునకానికి చికిత్స చేయించాలని వారు పడిన తపనను చూసిన పలువురు వారిని ప్రశంచారు. చిన్నారులు శునకాన్ని అట్టపెట్టెలో వేసుకొని రెండు కిలో మీటర్లకుపైగా దూరంలోని విశ్వనాథపురం పశువైద్యశాలకు తీసుకొచ్చారు. ఆదివారం కావడంతో అక్కడ ఎవరు లేరు. దీంతో పలువురితో మాట్లాడిన చిన్నారులు చివరకు పశువైద్యశాలలో పనిచేస్తున్న అటెండర్‌ను పిలుచు కొని వచ్చి శునకానికి ప్రథమ చికిత్స చేయించారు. శునకానికి చికిత్స చేయడానికి వారుపడిన తపనను చూసి వైద్యశాల వద్ద ఉన్న పలువురు ప్రజలు వారిని అభినందించారు.



వైద్యం అందించిన అనంతరం చిన్నారుల ఆనందం

గ్రాడ్యుయేషన్ పత్రాలు అందజేత



పత్రాలు అందజేసేందుకు వచ్చిన మతపెద్దలు

పొదిలి, మార్చి 10 : మదర్సాదారుల్ ఉలూమ్‌లో విద్యను అభ్యసించిన 40 మంది విద్యార్థులకు ఆదివారం ధార్మిక విద్యా గ్రాడ్యుయేట్ పత్రాలను అందజేశారు. కాటూరివారిపాలెం గ్రామ సమీపంలో జరిగిన వార్షికోత్సవ సభలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ముస్లిం పెద్దల చేతులమీదుగా విద్యార్థులకు పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పెద్దలు ముస్లిం సమాజానికి ధార్మిక విద్యప్రాధాన్యత గురించి వివరించారు. అల్లా చూపిన సన్మార్గంలో పయనించాలని తద్వారా ప్రతి ఒక్కరు ముక్తిని పొందవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు గౌరవ డాక్టరేట్ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యులు సాయిరాజేశ్వరరావు, రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మౌలానాలు సయ్యద్ మహ్మద్‌రఫి, వాసిప్ ఉస్మాని సాహెబ్, మౌలానా అబ్దుల్ రహీం, మహమ్మదుల్ హసన్, ముఫ్తి అహమ్మద్ సయిద్, ముసద్దిఖుల్ ఖాస్మీసాహెబ్, సులేమాన్ అజ్మల్, పట్టణ ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలకు త్వరలో చరమగీతం

- మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, మార్చి 10: వైసీపీ అరాచకాలకు ప్రజలు త్వరలో చరమగీతం పాడతారని మాజీ ఎమ్మెల్యే కందల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని 5వ వార్డులో మన కోసం- మన కందుల, భవిష్యతుకు గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికలు అభివృద్ధికి-అరాచకాలకు మధ్య పోటీ అని అభివర్ణించాడు. తెలుగుదేశం, జనసేన ప్రభుత్వంతోనే మార్కాపురం జిల్లా, వెలిగొండ ప్రాజెక్ట్ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సాదిక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నారాయణరెడ్డి

అంకాలపరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు

పొదిలి, మార్చి 10 : మండలంలోని కంభాలపాడు గ్రామంలో వెలసిన శ్రీ అంకాలపరమేశ్వరి అమ్మవారికి ఆదివారం అమావాస్య రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆదివారం ప్రత్యేకంగా పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి బెల్లంకొండ బిట్స్ కళాశాల అధిపతులు బెల్లంకొండ శ్రీనివాసరావు దంపతులతోపాటు పలువురు భక్తులు పొంగళ్ళు, చీరసారెతో మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు తిరుమలశెట్టి శ్రీనివాసరావు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. అదే విధంగా రాత్రికి జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అంబటి ఓబులరెడ్డి, కొండపీటి శ్రీనివాసులు, బిట్స్ కళాశాల యాజమాన్యంవారు అన్నదానం చేసింది.

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణ శివార్లలో వెలసియున్న శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఉగాది ముందు జరిపే 5 ఆదివారాల జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. నాగశిలలకు పూజలు చేసి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీరభద్రుని కల్యాణం

తర్లుపాడు తర్లుపాడులో వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కళ్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పవన్‌కుమార్‌శర్మ, వేద పండితులు రాధాకృష్ణశర్మ, రవిశంకర్‌శర్మ, రంగనాథ్‌శర్మ, భార్గవశర్మ ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలు నేరెళ్ల శివకుమార్, నేరెళ్ల కుమార్‌లు పీటలపై కూర్చొని కల్యాణ క్రతువు నిర్వహించారు. ఆలయ సింగల్ ట్రస్ట్ బోర్డు ధర్మకర్త నేరెళ్ల సాంబశివరావు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు.

వైభవంగా గ్రామోత్సవం

భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా రాత్రి తర్లుపాడు పురవీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ, వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త జవాజి విజయభాస్కరరావు, సహస్ర లింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త నేరెళ్ల కుమార్, భక్తులు పాల్గొన్నారు.

గిద్దలూరు : పాతాళ నాగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు స్వామి వారు రథంపై పట్టణంలోని ప్రధాన వీధుల నుంచి ముందుకు సాగారు. భక్తులు స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టిమొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థాన కమిటీ చైర్మన్ శివపురం రమాదేవి, మాజీ చైర్మన్ ఆంజనేయులు, ధర్మకర్తల మండలి, నాయకులు పాల్గొన్నారు.





అంకాలపరమేశ్వరి అమ్మవారు, మార్కాపురంలో నాగశిలలకు పూజలు



తర్లుపాడులో పూజలందుకుంటున్న వీరభద్రుడు

అవీ..ఇవీ..

ఉత్సాహంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

- పోటీలను ప్రారంభించిన మాగుంట రాఘవరెడ్డి



ప్రారంభిస్తున్న రాఘవరెడ్డి

త్రిపురాంతకం, మార్చి 10: మహాశివరాత్రి ఉత్స వాల్లో భాగంగా రథోత్స వం సందర్భంగా త్రిపురాంతకంలో ఆదివారం ఎడ్ల బలప్రదర్శన పోటీల ను నిర్వహించారు. ఉత్సా హంగా సాగిన ఈ పోటీలను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి కుమారుడు రాఘవరెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన పోటీలలో గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన పీఆర్ మెమోరిల్ ఎడ్లజత మొదటి బహుమతి, కృష్ణా జిల్లా ఘంటశాలకు చెందిన ఎంకేఎం బల్స్ రెండో బహుమతి, ఆర్‌వీఎస్‌ఆర్ వీరాస్వామి చౌదరి జత మూడో బహుమతి, పీఆర్ మెమోరియల్ భైరవ నాలుగో బహుమతిని సాధించాయి. మార్టూరుకు చెందిన ఎంకేఎం ఐదో బహుమతి, గిద్దలూరు మండలం కొండపేటకు చెందిన మీనిగ కాశయ్య జత ఆరో బహుమతి, గుంటూరు రూరల్ లింగాపురానికి చెందిన యల్లం సాంబశివరావు జత ఏడో బహుమతి, వీరయ్యచౌదరికి చెందిన జత ఎనిమిదో బహుమతిని సాధించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

శ్రీనివాసప్రసాద్‌కు ఇంటర్నేషనల్ ఐకాన్ అవార్డు

కంభం, మార్చి 10 : వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కంభం పట్టణానికి చెందిన స్పందించే హృదయాలు ట్రస్టు చైర్మన్ పులి శ్రీనివాసప్రసాద్ ఇంటర్నేషనల్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. వివిధ రంగాల్లో ఉత్తమ విలువలను, ప్రతిభను చాటిన వారికి అందజేసే ఈ అవార్డులలో సామాజిక సేవావిభాగంలో శ్రీనివాసులుకు గుర్తింపు దక్కింది. శ్రీనివాసప్రసాద్‌కు ఆదివారం ఢిల్లీలో బ్రాడ్‌మన్ ఇండియా, ఇంటర్నేషనల్ ఎమర్జన్సీ మల్టీమీడియా వారు సంయుక్తంగా అవార్డులు ప్రధానం చేశారు. తెలుగు సినీనటి మయూరి చిత్రనాయక సుధాచంద్రన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసప్రసాద్

మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

మార్కాపురం వన్ టౌన్, మార్చి 10: మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మార్కాపురం నెహ్రూ యువకేంద్రం ప్రతినిధి సాయి సుబ్బారావు అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నారీశక్తి ఫిట్‌నెస్ రన్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై మక్కువ పెంచుకోవాలన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం ప్రతినిధులు లక్ష్మీ, అనూష, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న సుబ్బారావు

సత్తాచాటిన విద్యార్థులు

గిద్దలూరు, మార్చి 10 : విజయవాడలో నిర్వహించిన అబాకస్, వైదిక్ మ్యాథ్స్ రాష్ట్రస్థాయి పోటీలలో రాచర్లలోని స్పందన విద్యాసంస్థల విద్యార్థులు సత్తాచాటారు. అబాకస్ జూనియర్ లెవెల్-1లో షేక్ నజీర్‌భాషా మొదటి ర్యాంక్ సాధించగా వైదిక్‌మ్యాథ్స్ లెవెల్-2లో షేక్‌సమీర్ ద్వితీయ స్థానం సంపాదించాడు. వీరిరువురిని పాఠశాల డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు.



ట్రోఫీతో విద్యార్థి సమీర్

నూర్ బాషా సంఘ నూతన కమిటీ ఏకగ్రీవం



ఎన్నికైన నూతన కమిటీ

బేస్తవారపేట,మార్చి10: గిద్దలూరు నియోజకవర్గ నూర్ బాష నూతన కమిటీ బేస్తవారపేటలో దూదెకుల ఆదాం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ మీరావలి, గౌరవ అధ్యక్షులు షేక్‌మీరా మోహిద్దీన్, షేక్ మస్తాన్‌వలి, ఎస్‌కే.కాశీంసాహెబ్, షేక్.మురళి వై.బాదరయ్య, షేక్.రజీయా బేగం, షేక్.జరినా. డి.పాతిమాలు పాల్గొని కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బేస్తవారపేట మండల అధ్యక్షులుగా బనగానిపల్లి బాబు షాహెబ్, కంభం అధ్యక్షులు గాడి.ఖాదర్‌వలి,కొమరోలు అధ్యక్షుడిగా అంబరం పీరయ్య, రాచర్ల అధ్యక్షుడిగా అల్లావలిని, ఏకగ్రీవంగా నియమించారు.

సిద్ధం సభకు వెళ్లని సిద్దెనపాలెం వాసులు

- వర్గపోరుతో బస్సు ఎక్కని వైసీపీ కార్యకర్తలు

పుల్లలచెరువు, మార్చి 10 : వైసీపీ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలో నిర్వహించిన సిద్ధం సభకు పుల్లలచెరువు మండలం సిద్దెనపాలెంకు చెందిన వైసీపీ కార్యకర్తలు వెళ్లలేదు. గ్రామంలో వర్గపోరుతో సిద్ధం సభ కోసం వచ్చిన బస్సు కదలలేదు. ఐటీవరం పంచాయతీలో సిద్దెనపాలెంకు ఆదివారం వైసీపీ నాయకత్వం బస్సును పంపించింది. అయితే గ్రామంలో ఆపార్టీ వారు ఇప్పటికే రెండు వర్గాలుగా విడిపోయారు. ఒకరిపై ఒకరు పంతంతో ఆవైపు చూడకపోవడంతో బస్సు అక్కడే నిలిచిపోయింది. మర్రివేముల గ్రామంలో సుమారు రెండువేల జనాభా ఉన్నప్పటికీ, కేవలం 13 మంది మాత్రమే తరలివెళ్లారు.



పక్కన ఉంచిన ఆర్టీసీ బస్సు

ఫ్లెక్సీలో పేరు లేదని.. బస్‌టైర్ పంక్చర్ చేశాడు..!

- దద్దవాడలో వైసీపీ నాయకుడి వినూత్న నిరసన

కొమరోలు, మార్చి 10 : వైసీపీ తలపెట్టిన సిద్ధం సభకు ఏర్పాటు చేసిన చేసిన ఫ్లెక్సీలో తన పేరు లేకపోవడంతో ఓ వైసీపీ నాయకుడు వినూత్నంగా నిరసన తెలిపారు. సభకు జనాన్ని తరలించడం కోసం ఏర్పాటు చేసిన బస్సును పంచర్ చేశాడు. మండలంలోని దద్దవాడ గ్రామానికి చెందిన మునగాల రఘు వైసీపీలో నాయకుడిగా ఉన్నాడు. బస్సుకు కట్టిన ఫ్లెక్సీలో తనపేరు లేకపోవడంతో ఆవేశానికి లోనై 'సిద్ధం సభకు నో...' అంటూ నినాదాలు చేశాడు. బస్సు టైర్లకు రంధ్రాలు వేసి గాలితీసేసాడు. దీంతో స్థానిక వైసీపీ నాయకులు సిద్ధం సభకు వెళ్లలేకపోయారు. తాను వైసీపీ నాయకుడినే కదా తన పేరు ఎందుకు వేయలేదని స్థానిక నాయకులను నిలదీశారు.

అవస్థల సిద్ధం..!



బస్సులు లేక ఖాళీగా ఉన్న కనిగిరి ఆర్టీసీ డిపో



విజయవాడ నుంచి వచ్చి సీఎస్‌పురం వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో వేచి ఉన్న ప్రయాణికులు

- కనిగిరి డిపో నుంచి 48 బస్సులు తరలింపు
- ఇక్కడి జనాలను తరలించేందుకు అన్నమయ్య జిల్లా డిపో నుంచి 150 ఏర్పాటు
- వాహనాలు లేక ఇబ్బంది పడిన ప్రయాణికులు, విద్యార్థులు
- 10 మంది కూడా లేకుండానే సభకు తరలిన వైనం

కనిగిరి, మార్చి 10: సీఎం జగన్ సిద్ధం సభ జనాలకు, ప్రయాణికులు, విద్యార్థులకు అవస్థలు తెచ్చిపెట్టింది. కనిగిరిలో డిపో నుంచి సిద్ధం సభకు 48 బస్సులను వినుకొండ ప్రాంతంలోని నూజెండ్ల మండలానికి ఆదివారం తరలించినట్లు డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ తెలిపారు. అదేవిధంగా కనిగిరి నియోజకవర్గంలోని 6 మండలాల్లోని జనాలను తరలించేందుకు అన్నమయ్య జిల్లా లోని వివిధ డిపోల నుంచి 150 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బస్సులు లేక అవస్థలు పడిన ప్రయాణికులు, విద్యార్థులు

కనిగిరి డిపో పరిధిలోని 48 బస్సులను సిద్ధం సభకు కేటాయించారు. దీంతో రోజువారీ ప్రయాణికులు, విద్యార్థులు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనిగిరి డిపో నుంచి వివిధ ప్రాంతాలకు 103 బస్సులు నడుస్తున్నాయి. వాటిలో 48 బస్సులు సిద్ధం సభకు తరలించారు. నియోజకవర్గంలోని మారుమూలు గ్రామాల నుంచి కనిగిరి వచ్చి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సులు లేక నానా ఇబ్బందులు పడ్డారు. కర్నాటక, హుబ్లీ, గోవా లాంటి ప్రాంతాలకు మార్కాపురానికి చేరుకొని రైలు మార్గం ద్వారా వెళ్లేందుకు కనిగిరికి వచ్చి బస్సులు లేక డిపో వద్ద పడిగాపులు గాసారు. 20 రోజుల క్రితం ఆయా రైళ్లకు రిజర్వేషన్లు చేయించుకోవడంతో ప్రయాణం వాయిదా రద్దు చేసుకోవల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది మహిళలు చంటిబిడ్డలతో బస్సుల కోసం డిపోలో వేచి ఉన్నారు. మరోపక్క ఎండలు ఎక్కువగా ఉండడంతో నరకం చూశారు. కనిగిరి డిపోల నుంచి ఏఏ బస్సులు రద్దు అయినదీ తెలియ చేయడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇంటర్, డిగ్రీ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఇంటి నుంచి కాలేజీలకు రాజమండ్రి, నరసరావుపేట, మద్రాసు, తిరుపతి వెళ్లే విద్యార్థులు నేడు జరిగే పరీక్షలకు అందుకోలేమని ఆందోళన చెందారు. ఆదివారం సాయంత్రానికి ఆయా కళాశాలలకు చేరుకోవాలని ఉన్న వారు బస్సులు లేకపోవడంతో ఏం చేయాలో తెలియక హైరానా పడ్డారు. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదని వాపోయారు. ప్రజలను ఇబ్బంది పెట్టి సభలు నిర్వహించడం ఎంతవరకు సమంజసం అంటూ అసహనం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ఓటమి తప్పదన్నారు.



నలుగురితో సిద్ధం సభకు వెళ్తున్న బస్సు

సభకు ఖాళీగా తరలిన బస్సులు

కనిగిరి నియోజకవర్గానికి అన్నమయ్య జిల్లా నుంచి 150 బస్సులు సిద్ధం సభకు ప్రజలను తరలించేందుకు ఏర్పాటు చేశారు. ఒక్కో బస్సుకు రూ.12వేల నగదుతో పాటు, పలావ్ ప్యాకెట్, మంచినీరు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బస్సుల్లో వెళ్లేవారికి రూ.400 ఇస్తామని చెప్పి బస్సు దగ్గరకు వచ్చేసరికి డబ్బులు లేవని, పలావ్‌ప్యాకెట్, మందు, మంచినీరు ఉందని బస్సుల్లో ఎక్కాలని నిర్వాహకులు చెప్పగా ఎక్కకుండా ఉడాయించారు. దీంతో బస్సుకు పట్టుమని పది మంది కూడా లేకుండా సభకు తరలి బయలుదేరాయి. కనీసం బస్సుల్లో ఎక్కండి.. ఫొటోలు తీసుకోవాలని నిర్వాహకులు బతిమలాడాల్సిన దుస్థితి కనిగిరిలో ఏర్పడింది. పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల, హనుమంతునిపాడు, కనిగిరి నుంచి వెళ్లే చాలా బస్సులు ఖాళీగానే సిద్ధం సభకు వెళ్లాయని, ఒంగోలు సొంత పనులపైన పోయేవారిని ఎక్కించుకున్నట్లు తెలుస్తుంది.

మందు, మనీ, బిర్యానీ సిద్ధం

దర్శి : జగన్‌రెడ్డి సిద్ధం సభకు పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించేందుకు వైసీపీ నాయకులు నానా తంటాలు పడ్డారు. వెళ్లేవారికి నగదు, బిర్యానీ ప్యాకెట్, మద్యం బాటిళ్లను అందజేశారు. ఇందుకోసం ఒక్కో బస్సుకు రూ.15వేల నగదును సిద్ధం చేశారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో 200 ఆర్టీసీ బస్సులు, 150 ప్రైవేటు వాహనాలను సిద్ధం చేశారు. అయితే అరకొరగానే ప్రజలు బయలుదేరి వెళ్లినప్పటికీ కొందరు మాత్రం సభా స్థలానికి వెళ్లలేకపోయారు.

తాళ్లూరు : సిద్ధం సభకు వెళ్లే వారికి లిక్కర్, పలావ్ ప్యాకెట్, రూ.500 నగదు అందజేశారు. బస్సులన్నీ సభకు తరలించడంతో సాధారణ ప్రయాణికులు అవస్థలు పడ్డారు.



మాట్లాడుతున్న అమీర్‌బాబు

డాక్టర్ ఉగ్రను గెలిపించాలి

ముస్లిం మైనారిటీల సమావేశంలో అమీర్‌బాబు

పామూరు, మార్చి 10 : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి ముస్లిం మైనారిటీలు వచ్చే ఎన్నికల్లో మద్దతు తెలిపి గెలిపించాలని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీర్‌బాబు సూచించారు. టీడీపీ మండల ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ గౌస్‌బాషా గృహంలో ముస్లిం నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఉగ్ర అనుమతితో పామూరు షాదిఖానా ఫంక్షన్ హాల్‌లో త్వరలో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమీర్‌బాబు మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనారిటీలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని బాగు చేస్తామని, ముస్లింలను అన్నివిధాలా ఆదుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి మాటతప్పారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీకి మద్దతు ఇవ్వాలన్నారు. గతంలో బీజేపీతో టీడీపీ కలిసి ఉన్నప్పుడు ఏనాడూ ముస్లింలపై దాడులు జరగలేదని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు అధినేత చంద్రబాబు భరోసా ఇచ్చిన నేపథ్యంలో టీడీపీ, జనసేన పార్టీల విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో ఉగ్ర గెలుపునకు అందరం సహకరించాలని అమీర్‌బాబు కోరారు. సమావేశంలో జిల్లా మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి ఆర్‌ఆర్ రఫీ, పట్టణ గౌరవాధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, పులి నాయబ, ముబినమౌలాలి, కౌలూరి రహంతుల్లా, చినహజరత్, కావేరి రసూల్, కోడిగుంపల నాయబ్‌రసూల్, పత్తు మస్తాన్, మాచర్ల రహిమాన్, నాయబ, షేక్ జిలానీ, హాజీ, సయ్యద్ ఖాదర్‌బాషా, రహంతుల్లాతో పాటు జనసేన జిల్లా కార్యదర్శి వై.రహీములా పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి



దొనకొండ, మార్చి 10 : మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీలోని కట్టకిందపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చింతగుంట్ల దుర్గారావు (37) కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై గుంటూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. గుంటూరు నుంచి స్వగ్రామానికి దుర్గారావు మృతదేహం చేరుకున్న సమాచారం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, కొచ్చెర్లకోట పంచాయతీలోని టీడీపీ నాయకులు కట్టకిందపల్లి గ్రామం చేరుకొని దుర్గారావు మృతదేహానికి నివాళులర్పించి కుటుం బ సభ్యులను పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం శివకోటేశ్వరరావు రూ.10 వేల నగదును అందించారు. దుర్గారావుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమా ర్తె ఉన్నారు.

ఎండమావిగా మహిళా రిజర్వేషన్ బిల్లు

ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి



మాట్లాడుతున్న రమాదేవి

కనిగిరి, మార్చి 10: ప్రభుత్వాలు మారుతున్నా మహిళా రిజర్వేషన్ బిల్లు ఎండమావిగా మిగిలిపోయిందని ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి అన్నారు. యూటీఎఫ్ కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మా ట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా మహిళల హక్కులు మాత్రం అమలుకు నోచకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు పెరిగిపోతున్నాయన్నారు. మహిళలకు రక్షణ కొరవడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీలో మద్యం అమ్మకం విచ్చలవిడి చే యడం వలన మహిళలపై దాడులు అకృత్యాలకు కారణమైందన్నారు. గ్యాస్ ధరలను పెంచి స్వల్పంగా తగ్గించి మహిళలకు ఎంతో మేలు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. సమానపనికి స మాన వేతనం అమలు కావడం లేదని, మహిళల సమస్యలు పరిష్కరించే పరిస్థితిలు లేవని రాబోయే కాలంలో ఉద్యమాలు తీవ్రతరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్, ఆశా, అంగన్వాడీలను ఘ నంగా సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, సీఐటీయూ నాయకులు పీసీకేశవరావు, నరేంద్ర, శాంతకుమారి, రజని, ఎస్ పద్మ, నరసమ్మ, చిన్నబాబు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నయనానందం.. శివపార్వతుల రథోత్సవం

దర్శి, మార్చి 10: దర్శిలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నయనానందంగా సాగింది. శివరాత్రి రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్న విషయం విదితమే. శివపార్వతుల కల్యాణం ఆదివారం నిర్వహించారు. ఆది దంపతులను ఆదివారం బంగారు రథంలో ఊరేగించారు. జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లివెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గొలుసులాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. వందలాది మంది భక్తులు, మహిళలు గొలుసులాగేందుకు పోటీపడ్డారు. కాశీవిశ్వేర ఆలయం నుంచి అద్దంకి రోడ్డు మీదుగా గడియార స్తంభం వద్దకు చేరుకున్న రథంపై ఆదిదంపతులు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయం వరకు రథోత్సవ కార్యక్ర మం జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు కొందరు పులిహోర, మజ్జిగను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

60 మందికి ఉచిత వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

పామూరు, మార్చి 10 : గాంధీ ఆసుపత్రి మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఉచిత శ్వాసకోస వైద్య శిబిరంలో 60 మందికి పరీక్షలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆసుపత్రి డాక్టర్ శ్రీకాంత్‌యాదవ్ మీసాల తెలిపారు. హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి చెందిన పామూరువాసి, ప్రముఖ ఛాతి వైద్య నిపుణుడు డాక్టర్ పీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్వాస సంబంధ రోగులతోపాటు షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ల్యాబ్‌టెక్నీషియన్ విజయ్, శివ పాల్గొన్నారు.

కుంచించుకుపోతున్న మైనర్ కాలువలు

- అనుమతులు లేకుండా వెడల్పు తగ్గించి గోడల నిర్మాణం
- ఆందోళన చెందుతున్న రైతులు



దర్శిలో అనుమతులు లేకుండా మైనర్ కాలువను కుదించి కట్టిన గోడలు

దర్శి, మార్చి 10 : సాగర్ కాలువలు కుంచించుకు పోతున్నాయి. మేజర్లు, మైనర్ కాలువలను అడ్డగోలుగా మింగేస్తున్నారు. అధికారులు సహకరిస్తుండడంతో అడ్డగోలుగా నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. దర్శి మైనర్ కాలువను ఎలాంటి అనుమతులు లే కుండా వెడల్పు తగ్గించి గోడలు కడుతున్నారు. ఆక్రమణ దారులకు లబ్ధి చేరూర్చేందుకు అధికారులు ఈ చర్యలకు పూనుకున్నారు. దర్శి మైనర్ కాలువ ఇరువైపులా కట్టలు కలిపి 30 అడుగులకు పైగా వెడల్పు ఉంది. దశలవారీగా కాలువకు ఇరువైపులా సగానికి పైగా ఆక్రమించారు. తాజాగా ఉన్న కాలువను కూడా కుందించి వెడల్పు తగ్గించి ఏకంగా గోడలను నిర్మించి ఇరువైపులా లైనింగ్ వేస్తున్నారు. కాలువ కుదించేందుకు ఎన్ఎస్పీ అధికారులు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. కాలువలు తగ్గించి నిర్మాణాలు చేపడుతున్నా ఎన్ఎస్పీ అధికారులు పట్టించుకోలేదు. ఎన్ఎస్పీ అధికారులు, నగర పంచాయతీ అధికారులు కుమ్మక్కై ఆక్రమణదారులకు లబ్ధిచేకూరూచ్చేలా చేస్తున్నారని, రైతులు, ప్రజలు విమర్శిస్తున్నారు.

మైనర్ కాలువలోకి మురుగు నీరు మళ్లింపు



మైనర్ కాలువలోకి మురుగు కాలువ ద్వారా పంపిస్తున్న నీరు

మైనర్ కాలువ వెడల్పు తగ్గించడంతో దాని రూపు రేఖలు మారి పోవడంతో సాగర్ కా లువ చూడటానికి మురుగు కాలువగా మారి. రోడ్ల నుంచి వచ్చే మురుగు నీరు మైనర్ కాలువలోకి మళ్లించారు. సిమెంట్ రోడ్లకు ఇరువైపులాఉన్న కాలువల్లోని మురుగు కాలువల నీరు మైనర్ కాలులోకి మళ్లిస్తూ గోడలను ఏర్పాటు చేశారు. మైనర్ కాలువ రూపు రేఖలు మారిపోవడంతో ఆయకట్టు దిగువనున్న పొలాలకు సాగర్ నీరు పోయే వీలు లేకుండా పోయింది. దీనికి తో డు మురుగు నీరు సాగర్ కాలువలోకి నీరు చేరుతుండడంతో సాగునీరు విడుదవు తుండడంతో నీరు కలుషిత మవుతుందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు, ఉన్నతాధికారులు ఇక్కడి పరిస్థితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, రైతులు, ప్రజలు కోరుతున్నారు.

గెలిపించండి.. అండగా ఉంటా

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర



డాక్టర్ ఉగ్ర, కేటీఆర్‌ను సన్మానిస్తున్న పీఎల్‌రావు

కనిగిరి, మార్చి 10 : వెనుకబడిన వర్గాలకు అండగా ఉంటానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. ప్రైవేటు ఫంక్షన్ హాలులో ముదిరాజుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ముతరాజులు తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. మీకు అన్ని విధాలుగా అండగా ఉండడంతో పాటు రాజకీయ అభివృద్ధికి తోడ్పడతానన్నారు. కనిగిరి అభివృద్ధి కోసం ముదిరాజులు అదరూ ఒకేతాటిపైకి వచ్చి ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముదిరాజ్ నాయకులు పీఎల్‌రావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. జగన్‌లాంటి సైకో పాలనను తుదముట్టించే సమయం ఆసన్నమైందన్నారు. కనిగిరి నియోజకవర్గంలోని ముదిరాజులందరూ కనిగిరి టీడీపీ అభ్యర్థి ఉగ్రకు మద్దతుగా నిలిచి ఆయన గెలుపులో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో కేటీఆర్ స్కూల్ చైర్మన్ కుందురు తిరుపతి రెడ్డి, జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు పందిళ్లపల్లి శ్రీనివాసులు, రామరాజు, ఐఎస్ఆర్, ఇండ్లా నరసింహులు, వీర్ల కిషోర్, దేవిరెడ్డి పరుశురాం, నరేంద్ర, బాల గురప్పడు, రామకృష్ణ, మాసిపల్లి రామయ్య, అనంత నారాయణ, పల్లారావు, రాయుడు, రామరాజు, నాగరాజు, భీముడు పాల్గొన్నారు. తొలుత డాక్టర్ ఉగ్రను ఘనంగా సన్మానించి సత్కరించారు.

ఉగ్ర గెలుపే లక్ష్యంగా కలిసి పనిచేద్దాం





మాట్లాడుతున్న శ్యామల కాశిరెడ్డి .. కరపత్రాలను పంపిణీ చేస్తున్న శ్రేణులు

వెలిగండ్ల, మార్చి 10 : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి పనిచేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు శ్యామల కాశిరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు ఆదివారం వెలిగండ్ల పార్టీ కార్యాలయంలో జనసేన సమన్వయంతో శ్రేణులను ఎన్నిలకు సిద్ధం చేయడమే అజెండాగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా పార్టీలో అసంతృప్తితో ఉంటే ఒకటికి పది సార్లు స్వయంగా వెళ్లి కలవాలని స్పష్టం చేశారు. జగన్ ఎన్నికల్లో గెలుపునకు తన పాలనను నమ్ముకోలేదని, దౌర్జన్యాలు, అక్రమాలు, దొంగ ఓట్లు డబ్బును నమ్ముకున్నారని ధ్వజమెత్తారు. జగన్ కుట్రలు, కుతంత్రాలను రోజూ కనిపెట్టి తిప్పికొట్టాలని సూచించారు. జగన్‌రెడ్డి పాలనపై విసుగు చెందిన వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున టీడీపీలోకి చేరుతున్నారని, ఇది చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు వాళ్ల కార్యకర్తలకే కండువాలు కప్పి టీడీపీ నుంచి వస్తున్నట్లు డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన నుండీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, రాష్ట ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గొనా ప్రతాప్, జిల్లా ఎస్సీసెల్ అధికార ప్రతినిధి సలోమన్ రాజు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మౌలాలీ, ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వర్లు, కొండు భాస్కర్ రెడ్డి, మీనిగ కాశయ్య, కారంపూడి వెంటేశ్వర్లు, ఒంగోలు శ్రీను, రావి శ్రీను చౌదరి, సాన నారాయణ రెడ్డి, బొబ్బా రమణారెడ్డి, బొబ్బా భూపాల్ రెడ్డి, పుల్లారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో ఆర్థిక లబ్ధి

పామూరు : సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి పేద మహిళల కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరుతుందని టీడీపీ పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు ఇర్రి కోటిరెడ్డి తెలిపారు. పట్టణంలోని తూర్పువీధి బూత్ నెంబర్ 274లో టీడీపీ, జనసేన నాయకులు ఆదివారం చంద్రబాబు మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంచిపెట్టారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత జగన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధిని గమనించాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అనేదే చేయలేని అసమర్థ పాలకుడు జగన్‌రెడ్డి అన్నారు. చేతగాని హామీలను గుప్పించి, నవరత్నాల పేరుతో ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. అవినీతి, దోపిడీ, అరాచక పాలనతో రాష్ట్రాన్ని పాతికేళ్ల వెనక్కి నెట్టారన్నారు. రాష్ట్రం బాగు కోసం చంద్రబాబును, నియోజకవర్గం బాగు కోసం డాక్టర్ ఉగ్రను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి గుత్తి మహేష్, జనసేన నాయకులు మహిత్ కుమార్, గుత్తి సావిత్రి, రాజమాత, మండ్ల రామయ్య, మల్లి కార్జున మహిళలు పాల్గొన్నారు. మండలంలోని బలిజపాలెం పంచాయతీ ఎస్సీ పాలెంలో బూత్ నెంబర్ 245లో జనసేన ఆధ్వర్యంలో ఉగ్ర విజయాన్ని కాంక్షిస్తూ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దూది మహేష్, అజయ్, నున్న మానస్, బొర్రా నరసింహులు, మాటూరి మనోజ్ పాల్గొన్నారు. మండలంలోని వెంకటాపురం బూత్ నెంబర్ 258లో బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బూత్ కమిటీ ఇన్‌చార్జి పోతురాజు వెంకటనారాయణ, కాకు ఆదినారాయణ పాల్గొన్నారు.

టీడీపీ ఇన్‌-చార్జి గోరంట్లకు అభినందనలు



రవికుమార్‌కు అభినందనలు తెలుపుతున్న తాళ్లూరు తెలుగు తమ్ముళ్లు

తాళ్లూరు, మార్చి 10 : టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన శ్రీ హర్షిణి విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవికుమార్‌ను తాళ్లూరు మండల తెలుగు తమ్ముళ్లు ఆదివారం ఒంగోలు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి అభినందలు తెలిపారు. గత కొంత కాలంగా దర్శి నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జి లేక పోవడంవల్ల కార్యకర్తల సమ్యలను పట్టించుకునే వారు కరువయ్యారని, టీడీపీ బలోపేతానికి కృషి చేస్తూ తమకు అండగా నిలవాలని గోరంట్లకు విజ్ఞప్తి చేశారు. కార్యకర్తలకు అండగా వుంటానని గోరంట్ల భరోసా ఇచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. గోరంట్ల దంపతులను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వహక కార్యదర్శులు వల్లభనేని సుబ్బయ్య, శాగంకొండారెడ్డి, రాష్ట్ర టీడీపీ మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ కాలేషా వలి, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు,నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ మీరామొహిద్దీన్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు చెన్నపురెడ్డి వీరనాగిరెడ్డి, టీడీపీ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వంగపల్లి నాగేశ్వర రావు, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మేదగం వెంకటేశ్వరరెడ్డి, కె.రామకోటిరెడ్డి, ఎస్.ఆదినారాయణరెడ్డి, కె.నరసింహారావు, షేక్ కాశీంసైద్, కుమ్మిత సుబ్బారెడ్డి, జీ లక్ష్మీనారాయణ, జీ రమణారెడ్డి, కె.రామయ్య, ఎఫ్రాయిమ్, నాదెండ్ల శ్రీను, పాలెపోగు రాజు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

దొనకొండ : టీడీపీ ఇన్‌చార్జిగా గోరంట్ల రవికుమార్ నియామకం పట్ల టీడీపీ మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి నేతృత్వంలో పార్టీ కార్యాలయంలో ఆదివారం సంబరాలు నిర్వహించారు. బాణ సంచాకాల్చి కేకు కట్ చేసి ప్రజలకు కేక్, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు షేక్ మునామియా, కామేపల్లి చెంచయ్య, షేక్ సుభానీ మాట్లాడుతూ రవికుమార్ నియామకంపై హర్షం ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుగ్గెంపూడి కోటేశ్వరరావు, వేగినాటి అల్లూరయ్య, వల్లపునేని ఆదినారాయణ, వైకె చౌదరి, పణిదపు అనంతరాములు, సింగమనేని హనుమంతు, పణిదపు వీరాంజనేయులు, మాచర్ల యోహన్ పులిమి శివ, విప్పర్ల శేషు, బత్తుల గాలయ్య, యాంగటి పోలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 11 మార్చి 2024





జనం లేక ఖాళీగా ఉన్న గ్యాలరీలు

సిద్ధం!

- ఎన్ని చేసినా కదలని జనం
- భారీగా తాయిలాలు.. గ్రాఫిక్స్‌తో జిమ్మిక్కులు
- గ్రామాల్లోనే ఆగిపోయిన కొన్ని వాహనాలు
- మినీ బార్లుగా మారిన బస్సులు
- టార్గెట్‌లో ఒక వంతు కూడా వెళ్లని వైనం
- చివర్లో వేదిక వద్ద పారిశుధ్య కార్మికుడు మృతి



జగన్ మాట్లాడుతున్న సమయంలో వెళ్లిపోతున్న జనం

ప్రజలకు నరకం!

- సభకు రాని వారిపై వైసీపీ నేతల దాడి
- ఉదయం నుంచే సాగిన నోటీసుల పర్వం
- జామర్లు పెట్టి నాలుగు గంటలపాటు సిగ్నల్స్ నిలిపివేత
- సిద్ధం సభకు వస్తే తాయిలాలు అంటూ వాట్సాప్ గ్రూపులో మెసేజ్‌లు
- జాతీయ రహదారి గంటల పాటు దిగ్బంధం, నరకం చూసిన ప్రజలు
- ఇన్ని అరాచకాలు చేసినా స్పందన పేలవమే

బాపట్ల, మార్చి10 (ఆంధ్రజ్యోతి): సభకు రానివారిపై దాడి....వాట్సాప్ గ్రూపుల్లో ఏకంగా వైసీపీ నేతలే సభకు వచ్చేవారికి తాయిలాల ఆఫర్...నిరసన తెలిపే అవకాశమున్న వారిపై ఉదయం నుంచే నోటీసుల పర్వం....జాతీయ రహదా రిపై గంటల తరబడి ట్రాఫిక్ దిగ్బంధనంతో వాహనదారుల అవస్థలు...సభలో జరిగే లోటుపాట్లు బయటకు పొక్కకుండా జామర్లు పెట్టి నాలుగు గంటల పాటు సిగ్నల్స్ బంద్...సభా ప్రాంగణంలో మద్యం ఏరులుగా పారించారు...బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం వైసీపీ నిర్వహించిన సిద్ధం సభ విజయవంతం కోసం పాలకపార్టీ చేసిన అరాచకాలివి. సిద్ధం సభ సక్సెస్ కోసం పాలకపార్టీ ఇన్ని చేసినా ఆశించిన స్థాయిలో స్పందన దక్కకపోగా ప్రజలు నరకం చూశారు

అర్ధరాత్రి వరకు నరకం...

జాతీయ రహదారి 16ను ఇరువైపులా ఆదివారం ఉదయం నుంచే సిద్ధం సభ కోసం దిగ్బంధనం చేయడంతో వాహనాదారులతో పాటు సామాన్య ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు. సభ ప్రారంభానికి నాలుగు గంటల ముందు, సభ ముగిసిన తర్వాత అర్ధరాత్రి వరకు ప్రజలు అవస్థలు వర్ణణాతీతం. ముఖ్యంగా చంటిబిడ్డలతో ప్రయాణం చేసే వారు పిల్లలతో నరకం చూశారు. రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో అంబులెన్స్‌లు సైతం దారి కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. సిద్ధం సభకోసం జనాలు లేకపోయినా ఇద్దరు, ముగ్గురు ఉన్నా ఒక బస్సును వేయడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి వాహనాదారులు నానా తిప్పలు పడ్డారు.

ఉదయం నుంచే నోటీసుల పర్వం

కొరిశపాడు మండలం తూర్పుపాలెం గ్రామానికి చెందిన యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం ముంపు గ్రామ రైతులు ఆదివారం సిద్ధం సభ వేదికగా సీఎం దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లాలని భావించారు. వీరంతా సానుభూతిపరులే కావడం గమనార్హం. కానీ ఉదయమే వారికి పోలీసులు నోటీసులు అందించి సభకు రావడానికి వీల్లేదన్నారు. దారి వివాదంలో అనేక విధాలుగా పోరాడుతున్న కొరిశపాడు బొడ్డువానిపాలెంకు చెందిన గొట్టిపాటి సుధారాణికి సైతం పోలీసులు నోటీసులు అందించారు. అదే విధంగా అద్దంకి ఈటీవీ రిపోర్టర్ కొండలకు, యూట్యూబ్ చానల్‌లో పనిచేస్తున్న మరో రిపోర్టర్‌కు పోలీసులు నోటీసులు అందించారు. అద్దంకి యూటీఎఫ్ నాయకులకు, స్థానిక టీడీపీ నేతలకు కూడా నోటీసులు అందించి ప్రజాస్వామిక హక్కులను కాలరాయడాన్ని కొనసాగించారు.

వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు...

సిద్ధం సభ జనసమీకరణ కోసం వైసీపీ చోటామోటా నేతలు వాట్సాప్ గ్రూపుల్లో తాయిలాలు ఆఫర్ చేస్తూ ఆడియో మెసేజ్‌లను పెట్టారు. చీరాల 17వ వార్డుకు చెందిన వైసీపీ నేత ఒకరు సిద్ధం సభకు వచ్చేవారికి రూ.300లతో పాటు బిర్యానీ, పురుషులకు మందు ఆఫర్ చేయడం వైసీపీ జనసమీకరణ కోసం దిగజారిన వైనాన్ని తేటతెల్లం చేసింది. నేతలే కాకుండా వలంటీర్లు కూడా జనాన్ని తరలించడానికి పోటీ పడ్డారు.

జామర్లు పెట్టి నాలుగు గంటల పాటు సిగ్నల్స్ నిలిపివేత

సభలో జరిగే లోటుపాట్లు బయటకు పొక్కకుండా ఉండడానికి ఈ దఫా వైసీపీ కొత్తమార్గాన్ని ఎంచుకుంది. సిద్ధం సభా ప్రాంగణంలో జామర్లు అమర్చి దాదాపు నాలుగుగంటల పాటు అక్కడి జనానికి బాహ్యప్రపంచానికి సంబంధాలు తెంచేసింది. గతంలో జరిగిన సిద్ధం సభలో లక్షల మంది జనం అని పాలకపార్టీ ఊదరగొడుతుంటే సెల్ టవర్ ఆధారంగా ఒరిజినల్‌గా సభకు హాజరైన జనం సంఖ్యను గణాంకాలతో టెకీ నిపుణులు ఎండగట్టారు. అధికారపార్టీ చెప్పే సం ఖ్యకు అక్కడ వాస్తవంగా హాజరైన జనానికి పొంతనలేకపోవడంతో వైసీపీ ఈసారి సిగ్నల్స్ నిలిపేసే కొత్తఎత్తుగడకు తెరలేపిందని తెలుస్తోంది.

సభకు రానివారిపై దాడులు...

జె.పంగలూరు మండలం రామకూరు గ్రామంలో వైసీపీ నేతలు అరాచకానికి తెగబడ్డారు. వ్యవసాయ పనులు ఉండడం వల్ల సిద్ధం సభకు రాలేనని చెప్పినందుకు ధన చక్రవర్తి అనే వ్యక్తిపై వైసీపీ నేతలు దాడికి తెగబడ్డారు. మిర్చికోతలు ఉండడం వల్ల సిద్ధం సభకు రాలేనని ఆ రైతు చెప్పినప్పటికీ కనికరం లేకుండా కర్రలు, రాడ్లతో వైసీపీ నేతలు దాడి చేయడం పాలకపార్టీ సిద్ధం సభ సక్సెస్‌కోసం చేసిన దౌర్జన్యాలకు పరాకాష్టగా నిలిచింది.

ఏరులై పారిన మద్యం...

సిద్ధం సభా ప్రాంగణంలో ఏ మూలకు వెళ్లినా మద్యం ఏరులై పారుతున్న దృశ్యాలే కనిపించాయి. ఏకంగా బీరు బాటిళ్లను బహిరంగంగా అమ్మకాలు కూడా కొనసాగించడం బరితెగింపుకు పరాకాష్టగా నిలిచింది. పలుచోట్ల మద్యం మత్తులో ఉన్న ప్రజలు రోడ్డమీద పడి ఉండి కనిపించడం సిద్ధం సభకోసం వైసీపీ ఏ స్థాయిలో మద్యం పారించిందో తెలుస్తోంది.

రాష్ట్రం నలుమూలల నుంచి బస్సులు

సిద్ధం సభ కోసం ఆర్టీసీ బస్సులను ఇష్టారాజ్యంగా వైసీపీ వాడి పడేసింది. సభ ప్రాంగణం నుంచి పదికిలోమీటర్లులేని ఊళ్లకు కూడా మూడేసి ఆర్టీసీ బస్సులను వైసీపీ నేతలు పంపించారు. వింతగా ఆయా గ్రామాలకు తరలించిన బస్సులనీ కాకినాడ, భీమవరం, రాజమండ్రి డిపోలకు చెందినవిగా ఉన్నాయి. అద్దంకి, చీరాల డిపో బస్సులను వేరే ప్రాంతాలకు పెట్టారు. ఆర్టీసీ బస్సులను ఇలా వాడడమే తప్పయితే తలాతోక లేని నిర్ణయాలతో డీజిల్ లక్షల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ఆర్టీసీని మరింత ఊబిలోకి నెట్టేసే పాపం వైసీపీ మూటగట్టుకుంటుంది.

ఇన్ని చేసినా స్పందన పేలవమే...

సభ కోసం వైసీపీ తనకున్న ఆర్థిక, అంగబలాలతో పాటు ప్రభుత్వవ్యవస్థల దుర్వినియోగానికి తెగబడిన జనం స్పందన మాత్రం పేలవంగానే ఉంది. వందల ఎకరాల్లో సభ అంటూ ఊదరగొట్టినా అంతా కలిపి 50 ఎకరాల్లోపే సభా ప్రాంగణం పరిమితమవడం, హాజరైన జనం కూడా రెండు లక్షల్లోపేనని అంచనాలు వెలువడడంతో సిద్ధం సభ జనానికి వెతలను మిగల్చాడానికే పెట్టినట్లయింది.



సభకు వెళ్లే దారిలో రోడ్డుమీదే బీర్ల అమ్మకాలు



సీఎం సభకు వెళ్తూ మార్గమధ్యమైన ఒంగోలులో మద్యం సేవిస్తున్న వైసీపీ కార్యకర్తలు

విఫలం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వైసీపీ ఆదివారం ఉమ్మడి జిల్లాలోని మేదరమెట్ల సమీపంలో నిర్వహించిన సిద్ధం సభకు జనం నుంచి స్పందన కరువైంది. వైసీపీ నాయకులు సామ,దాన,భేద దండోపాయాలను ప్రయోగించినా, వలంటీర్లను పూర్తిగా రంగంలోకి దింపినా ఫలితం కన్పించలేదు.



మరోవైపు వైసీపీలోని అంతర్గత కలహాలు బహిర్గతమయ్యాయి. ఇద్దరు ఎమ్మెల్యేలు, పలువురు కిందిస్థాయి నాయకులు, వారి అనుచరులు సభకు దూరంగా ఉండిపోయారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాకు వైసీపీ అధిష్ఠానం ఇచ్చిన టార్గెట్‌లో ఒకవంతు కూడా జనసమీరణ జరక్కపోగా వెళ్లిన వారిలో ఎక్కువ మంది సభకు దూరంగా ఉండటం, కొద్దిసేపటికే తిరుగు ప్రయాణం కావడం స్పష్టంగా కనిపించింది. ఇతర జిల్లాల నుంచి కూడా ఆశించిన మేర జనం రాకపోవడం వైసీపీ అగ్ర నేతలను నిరాశకు గురిచేసింది. కొన్ని గ్రామాల్లో వాహనాల్లోకి అసలు పార్టీ శ్రేణులు ఎక్కకపోగా, మరికొన్ని గ్రామాల్లో పార్టీలోని అసమ్మతి వాదులు వచ్చిన వాహనాలకు అంతరాయాలు కల్గించడం లాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. మధ్యలో ఒకట్రెండు చోట్ల సభకు రాని వారిపై వైసీపీ నేతలు బెదిరింపులకు పాల్పడ్డారు. సభలో జగన్ ప్రసంగం అనంతరం ఆయన వద్దకు చొచ్చుకుపోయేందుకు ముందుభాగంలో ఉన్న యువకులు పోటీ పడగా ఆ ఒత్తిడిలో ఒంగోలుకు చెందిన మున్సిపల్ కార్మికుడు మృతి చెందడం విషాదకరం.

రాష్ట్రంలో భారీగా సిద్ధం సభల నిర్వహణ ద్వారా ఎన్నికల సమరానికి అధికార వైసీపీ శ్రీకారం పలికింది. అందులో భాగంగా ఆఖరు సభ ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మండల కేంద్రమైన కొరిశపాడు సమీపంలో నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి భారీగా జనసమీకరణకు ప్రయత్నించారు. వైసీపీ రాష్ట్ర నాయకత్వం నియోజకవర్గాలవారీ నాయకులపై ఒత్తిడి పెంచి టార్గెట్లు ఇచ్చి భారీ జనసమీకరణకు ఆదేశించింది. ఆమేరకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన స్థాయిలో సభ విజయవంతం కాకపోవడంతో ఆపార్టీ నాయకులు కూడా నిర్ఘాంతపోయారు. ఆ సభ నిర్వహణ పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిపివేయడం, ఆర్టీసీ బస్సుల న్నింటినీ జనసమీకరణకు పంపడం తో సాధారణ ప్రయాణికులు నరకయాతనకు గురయ్యారు.

సుమారు 15 లక్షల మంది హాజరవుతారని ప్రకటించుకోగా అందులో ఒకవంతు కూడా రాలేదు. ఆయా నియోజకవర్గాల్లో కిందిస్థాయి నాయకుల్లో చాలామంది సిద్ధం సభకు దూరంగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌తో పాటు కనిగిరి, గిద్దలూరు, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు, కొండపి తదితర నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికతో అసంతృప్తితో ఉన్న పలువురు నాయకులు, ఆ పార్టీ ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు కూడా సభకు గైర్హాజరయ్యారు.

భారీగా తాయిలాలు ఇచ్చినా...

జనసమీకరణకు సర్వశక్తులు ఒడ్డిన వైసీపీ నేతలు సభకు వచ్చేవారికి కొన్ని ప్రాంతాల్లో ఒక్కొక్కరికి రూ.300, మరికొన్ని ప్రాంతాల్లో రూ.500 ప్రకారం చెల్లించారు. ఇక మద్యం, పలావు పొట్లాలు అయితే అన్ని ప్రాంతాల్లో ఇచ్చారు. ఇవన్నీ కలుపుకుంటే రవాణా ఖర్చులు కాకుండా ఒక్కొక్కరికి రూ.800 నుంచి రూ.1000 వరకు వెచ్చించారు. అయినా వైసీపీ నాయకులు ఆశించిన స్థాయిలో ప్రజలు వాహనాలు ఎక్కలేదు. అనేక ప్రాంతాల్లో సర్పంచ్‌లు.. 'మాకు జగన్ అన్యాయం చేశారే తప్ప అభివృద్ధికి సహకరించలేదు. సభకు మేము రాము. మా అనుచరులనూ పంపం' అని ఎదురుతిరిగారు.

బస్సుల్లోనే మద్యం తాగి చిందులు

ఇక నలభై మంది పట్టే బస్సులో 10 మంది 5 మంది వచ్చిన వాహనాలు చాలా ఉన్నాయి. అయితే ప్రతి ప్రాంతంలోనూ పురుషులనే అధికంగా సమీకరించేందుకు ప్రయత్నించారు. మహిళలు వచ్చినా ప్రత్యేక వాహనం ఎక్కించారు. పురుషులు ఉన్న వాహనాలన్నీ మినీ బార్లుగా మారిపోయాయి. మహిళలు ఎక్కువ మంది ప్రాంగణానికి దూరంగా చెట్ల కింద కూర్చుని కనిపించారు. అదేమిటని ప్రశ్నిస్తే 'డబ్బులు ఇచ్చారు వచ్చాం. తిరిగి వెళ్లేటప్పుడు వెళ్లిపోతాం. ఆ సభతో మాకెందుకు' అని స్పష్టంగా చెప్పారు.

ఫలించని బెదిరింపులు

వైసీపీ నేతల బెదిరింపులు కూడా ఫలించలేదు. ఒకవైపు వలంటీర్లకు డబ్బులు, బహుమలు ఇచ్చి జనాన్ని సమీకరించమని ఒత్తిడి చేశారు. డ్వాక్రా సంఘాల గ్రూపుల నాయకులకు అలాంటి ఆదేశాలే ఇచ్చారు. గ్రామాల్లో సాధారణ ప్రజలపై అయితే వైసీపీ నాయకులు దౌర్జన్యంగా వ్యవహరించారు. పంగులూరు మండలం రామకూర్‌లో చక్రవర్తి అనే యువకుడు సభకు రాకపోవడమే కాక తన పొలంలో పనిచేసేవారిని పంపకపోవడంతో గ్రామంలోని వైసీపీ నాయకులు ఆయన్ను రక్త గాయాలయ్యేలా కొట్టారు.

ఫలించని జిమ్మిక్కులు

సభకు భారీగా జనం వచ్చినట్లు చూపేందుకు గ్రాఫిక్ జిమ్మిక్కులకు వైసీపీ నాయకులు పాల్పడ్డారు. సీఎం జగన్ రాకముందు సభా ప్రాంగణంలో రెండో డ్రోన్ కెమెరా దృశ్యాలు చిత్రీకరిస్తుంటే అది నారా లోకేష్ పని అంటూ మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. చివరకు పోలీసులు ఆ డ్రోన్ కెమెరా వైసీపీ అధికారిక సంస్థ అయిన ఐప్యాక్‌దని తేల్చేశారు.


టార్గెట్‌లో ఒక వంతు మాత్రమే

జిల్లా నుంచి కనీసం ఐదు లక్షల మందిని సమీకరించాలని వైసీపీ భావించింది. ప్రధానంగా అద్దంకి, పర్చూరు, చీరాల నుంచి అధికంగా తరలించాలని ఆదేశించారు. కానీ ఆమూడు నియోజకవర్గాల నుంచి వారు ఆశించిన స్థాయిలో పార్టీశ్రేణులు కానీ, ప్రజలు కానీ హాజరుకాలేదు. ఇతర నియోజకవర్గాల నుంచి అధిష్ఠానం ఇచ్చిన టార్గెట్‌లో ఒకవంతు మాత్రమే వచ్చారు. కొన్ని నియోజకవర్గాల్లో రెండు నుంచి ఐదు వేలమంది, మరికొన్ని సెగ్మెంట్‌లలో పది నుంచి పదిహేను వేల మంది, ఒకట్రెండు నియోజకవర్గాల నుంచి 20వేల ప్రకారం సమీకరణ జరిగింది. సరాసరి లక్షపైచిలుకు జిల్లా నుంచి సమీకరించగా, ఇతర జిల్లాల నుంచి మరో లక్ష వచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

సభ ముగిసిన తర్వాత ముందు వరుసలో ఉన్నకార్యకర్తలు జగన్‌ను దగ్గరగా చూసేందుకు, వీలైతే కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. ఆ సమయంలో ఒంగోలు మునిసిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న మురళి తీవ్ర ఒత్తిడికి గురై మృతి చెందాడు. అదేవిధంగా సిద్ధం సభకు వచ్చిన నరసరావుపేట పట్టణంలోని స్టేడియం ఎదురు చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన గేదెల బాల దుర్గారావు (27) తిరిగి వెళ్లే సమయంలో బస్సు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

- హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం సందేశం
- ముగిసిన గుడారాల పండుగ



సందేశమిస్తున్న హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం

దేవుని స్తుతిస్తే అధిక మహిమ



హాజరైన విశ్వాసులు

గుంటూరు(తూర్పు), మార్చి10: వాక్యాన్ని ధ్యానించాలి, ఇంటింటికి చెప్పాలి, అప్పుడే ఏసయ్య హృదయాన్ని తాకుతాడు అని హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం సందేశమిచ్చారు. గోరంట్ల సమీపంలో హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ ఆదివారం మధ్యాహ్నం ముగిసింది. చివరి రోజు ప్రార్థనలను పాస్టర్ జేమ్స్ ప్రారంభించారు. మనసు హిమం వలే పరిశుద్ధంగా ఉండాలి, క్రీస్తు మాటలు సువాసన కలిగి ఉన్నాయి, క్రీస్తు మనలను సువర్ణంగా మార్చును అని చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ సందేశమి చ్చారు. తొలుత హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్లు, సిస్టర్లు పరలోక తేజస్సు అనురాగ పూర్ణుడా, గోత్రపు సింహమా అనే స్తుతి గీతాలు అలరించాయి. హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం ముగింపు సందేశానిస్తూ దేవుని మహిమ అధికంగా మనుషులపై ఉందని వాక్యోపదేశం చేశారు. గుడారాల పండుగకు వచ్చిన భక్తులు క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాం క్షించారు. ఈ సందర్భంగా గుడారాల పండుగ విజయవంతం అయ్యేందుకు సహకరించిన ప్రభుత్వ శాఖలను నిర్వాహకులు, పాస్టర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముగింపు కార్యక్రమంలో భాగంగా పాస్టర్లు ప్రాంగణమంతా తిరుగుతూ విశ్వాసులకు క్రీస్తు ఆశీర్వచనాలను అందించారు. గుడారాల పండుగ ముగియడంతో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది విశ్వాసులు తమ స్వస్థలాలకు బయలుదేరి వెళ్లారు.

అమరావతిలో కొలువైన బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి దివ్యరథోత్సవ సంబరం ఆది వారం అంబరాన్ని తాకింది. బాల చా ముండికా సమేత అమరేశ్వ ర స్వామి ఉత్సవమూ ర్తులను ప్రత్యే కంగా అలంకరించిన దివ్యరథం పై ఉంచారు. రథోత్స వాన్ని ఆలయ అధికారి వేమూరి గోపి, ఉత్సవ అధికారి సైదమ్మ బాయి టెంకాయ లు కొట్టి సాయంత్రం 4.53 గంటలకు ప్రారంభిం చారు. ఉత్సవమూర్తుల విగ్రహాలను పూజలు నిర్వహించి దివ్యరథం పైకి చేర్చారు. వేలాదిమంది భక్తులు రథం మోకును పట్టుకుని శం భోశంకర సాంబశివ.. అంటూ రథాన్ని ముందు కు లాగుతూ కార్యక్రమా న్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. రథోత్సవానికి ముందు కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, మంగళవాద్యాలు భక్తులను అలరించాయి. డీఎస్పీ పర్యవేక్షణ లో సీఐలు, ఎస్‌ఐలు తమ సిబ్బంది తో కలసి విధులు నిర్వహిం చి రథోత్సవాన్ని ప్రశాంతంగా ముగించారు. - అమరావతి

హరహర మహాదేవ

- అంబరాన్ని తాకిన అమరేశ్వరుని రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్తజన సందోహం



విశేష అలంకరణలో అమరేశ్వరస్వామి

గుంటూరు - గుంతకల్లు రైల్వే డబ్లింగ్‌లో...

నాలుగు సెక్షన్లు జాతికి అంకితం

- 12న వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న పీఎం మోదీ
- పశ్చిమ వైపున కోచ్ రెస్టారెంట్ అందుబాటులోకి తీసుకురానున్న రైల్వే



మాట్లాడుతున్న డీఆర్ఎం ఎం రామకృష్ణ

గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - గుంతకల్లు రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో నిర్మాణం పూర్తి అయిన నాలుగు సెక్షన్లను ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ నెల 12వ తేదీన ఆయన గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రామకృష్ణ తెలిపారు. ఆదివారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. సాతులూరు - మునుమాక మధ్యన 16 కిలోమీటర్ల పొడవునా రూ.144 కోట్లతో రెండో రైలుమార్గం నిర్మాణం జరిగింది. ఇందుకోసం సాతులూరులో పొడవైన లూప్ కూడా నిర్మించారు. శావల్యాపురం - చీకటీగలపాలెం మధ్యన 17 కిలోమీటర్ల పొడవునా రూ.153 కోట్లు ఖర్చు చేసి పూర్తి చేశారు. జగ్గంబొట్ల కృష్ణాపురం - గిద్దలూరు మధ్యన 25 కిలోమీటర్ల పొడవునా రూ.225 కోట్లు, తర్లుపాడు - జగ్గంబొట్ల కృష్ణాపురం మధ్యన 21 కిలోమీటర్ల పొడవునా రూ.189 కోట్లను రెండో మార్గం కోసం ఖర్చు చేసి పూర్తి చేశారు. దీంతో గుంటూరు నుంచి గిద్దలూరు వరకు రెండో రైలుమార్గం అందుబాటులోకి వచ్చింది. గిద్దలూరు - దిగువమెట్ట సెక్షన్ కూడా శరవేగంగా నిర్మాణం జరుగు తుందని, ఆ తర్వాత దిగువమెట్ట - నంద్యాల మధ్యన డబ్లింగ్ చేస్తామని డీఆర్ఎం చెప్పారు. కాగా పూర్తి అయిన నాలుగు సెక్షన్లను ప్రధాని మోదీ మంగళవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభిస్తారన్నారు.

ఇవికాక తుమ్మలచెరువులో నిర్మించిన మెస్సర్స్ చెట్టినాడ్ సిమెంట్స్ కార్పొరేషన్ ప్రైవే టు లిమిటెడ్ గతి శక్తి కార్గో టెర్మినల్, తిప్పర్తిలో నిర్మాణం చేసిన మెస్సర్స్ సాయిబా లాజీ వేర్‌హౌసింగ్, లాజిస్టిక్స్ ప్రైవేటు లిమి టెడ్ జీసీటీని కూడా ప్రధాని ప్రారంభిస్తారు. వీటి వలన పెద్దఎత్తున సరుకు రవాణ జరిగి రైల్వేకు ఆదాయం సమకూరుతుందని డీఆర్ ఎం పేర్కొన్నారు. అలానే రేపల్లె, గుంటూరు, నరసరావుపేట, కంభం, గిద్దలూరు, నంద్యాల, నల్గొండలో ఏడు ప్రదేశా లలో ఒన్ స్టేషన్ ఒన్ ప్రొడక్ట్ అవుట్‌లెట్లను కూడా పీఎం ప్రారంభిస్తారని చెప్పారు. గుంటూరు రైల్వేస్టేషన్ పశ్చిమ వైపున నూతనంగా సకల హంగులతో నిర్మించిన కోచ్ రెస్టారెంట్‌ని కూడా మంగళవారం ప్రారం భించనున్నట్లు చెప్పారు సమావేశంలో డీసీఎం కమలాకర్‌బాబు, సీనియర్ డీఈఎన్ వెస్లు గౌతం పాల్గొన్నారు.



సభాస్థలి చుట్టూ కంచెలు ఏర్పాటుచేసినా సిద్ధం ఫ్లెక్సీలు చించుకుని వెళుతున్న శ్రేణులు

పసలేని ప్రసంగం... పేలని పిట్టకథలు

- జగన్ ప్రసంగం మొదలుకాగానే వెనుదిరిగిన శ్రేణులు
- ఏరులై పారిన మద్యం
- మద్యం మత్తులో పడిపోయిన పలువురు కార్యకర్తలు

చీరాల, మార్చి 10: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభ ఆద్యంతం పేలవంగా సాగింది. మేదరమెట్ల సమీపంలోని పి.గుడిపాడు వద్ద ఆదివారం జరిగిన సిద్ధం సభలో జగన్‌తో పాటు అంతకుముందు మాట్లాడిన వారి మాటల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుపై అభద్రత, ఆందోళన కొట్టొచ్చినట్లు కనిపించింది. చేసిన అభివృద్ధిపై చెప్పిన మాటలు శూన్యం. జగన్ ప్రసంగంలో తాను పంచ్ డైలాగులుగా భావించి టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులపై చేసిన వ్యాఖ్యలకు, చెప్పిన పిట్ట కథలకు వైసీపీ శ్రేణుల నుంచి నామమాత్రం స్పందన కూడా రాలేదు. జగన్ సుమారు గంట పాటు మాట్లాడితే అందులో అభివృద్ధికి సంబంధించిన మాట ఒక్కటి కూడా లేదు. ఆద్యంతం కూటమిపై విమర్శలే చేశారు. ఈక్రమంలో జగన్ ప్రసంగం మొదలు పెట్టగానే కార్యకర్తలు వెనుదిరిగారు. ఆతరువాత గుంపులు, గుంపులుగా వెళ్లిపోయారు. జగన్ ప్రసంగం సగం పూర్తయ్యే సరికే ఖానాల్లో సగం, ముప్పాతిక భాగం ఖాళీ అయ్యాయి. సభకు పార్టీకి చెందిన పలు నియోజకవర్గాలకు చెందిన అసమ్మతివాదులు గైర్హాజరయ్యారు, మొత్తం మీద సిద్ధం సభ అట్టర్‌ఫ్లాప్ అనే టాక్ వచ్చింది. దీంతో ఆ పార్టీ శ్రేణులు డీలా పడుతున్నట్లు వినికిడి.

అన్నం కూడా పెట్టలేదు... పొద్దుగాల వచ్చాం

జగన్ రాక ముందే ఓ తల్లి చేతిలో సిద్ధం ప్లకార్డులు పట్టుకుని బిడ్డలతో సభ నుంచి వెళ్లిపోతుండటం గమనించిన ఓ పోలీస్ ఎందుకు వెళుతున్నారని అడిగారు. పొద్దుగాల వచ్చాం... ఏదో ఆశతో వచ్చాం... కనీసం అన్నం కూడా పెట్టలేదు. బిడ్డలు ఆకలికి అల్లాడుతున్నారు. బయటకుపోయి వారికి ఏదన్నా తనిపించాలని కంటతడి పెడుతూ వెళ్లటం చూచినవారు మీ నాయకులను అడగండని ఒక ఉచిత సలహా ఇవ్వటం వారిని మరింత కష్టపెట్టింది.

మద్యం మత్తులో చిందులు


సభకు వచ్చిన వారిలో ఎక్కువ మంది మద్యం సేవించి ఉన్నారు. వారిలో కుర్ర వాళ్లు కొన్ని ఖానాల్లో చిందులు వేస్తూ, నీళ్ల ప్యాకెట్లను విరజిమ్ముతూ చుట్టుపక్కల పడేవిధంగా విసరటంతో మహిళలు ఇబ్బంది పడ్డారు. రావటం తప్పయిందని ఆయా ఖానాల్లోని పలువురు మహిళలు అన్నారు. అందుకే మహిళలను సభకు పెద్దగా తీసుకురావద్దని ముందుగానే నాయకులు చెప్పారని కొందరు వ్యాఖ్యానించటం విశేషం. ఈక్రమంలో మద్యం సేవించి వచ్చిన వారిలో పలువురు సభా ప్రాంగణంలోను, కొందరు రోడ్డు మార్జిన్లలో స్పృహ లేకుండా పడిపోయారు.

వైసీపీ శ్రేణులు డీలా..

సిద్ధం అట్టర్ ఫ్లాప్ అయ్యిందనే టాక్ వచ్చింది. 10 లక్షల పైచిలుకు శ్రేణులతో సభ అని చెప్పుకున్న నాయకులకు వచ్చిన జనాలను చూచి షాక్ తిన్నారు. అంతా కూడా తమ అంచనాల్లో ఐదో వంతు కూడా లేకపోవటం అందుకు కారణంగా చెప్తున్నారు. ఈ క్రమంలో జగన్ హెలికాప్టర్ దిగిన తరువాత జనాలు ఏమేరకు వచ్చారనే అంచనాకు, ప్రజలకు అభివాదం పేరుతో సభావేదకకు కుడివైపు ఓపెన్ టాప్ వాహనంలో అభివాదం చేస్తూ ముందుకు వెనక్కుతిరిగారు. ఈసమయంలో ఎడమవైపు అరకొరగా ఉన్నవారు కూడా కుడివైపు ఖానాలకు వెళ్లటంతో ఎడమ వైపు ఖానాలు దాదాపుగా ఖాళీ అయ్యాయి. సభకు పలు నియోజకవర్గాలకు చెందిన అసమ్మతి వాదులు హాజరుకాలేదు. మొత్తం మీద సిద్ధం సభ అట్టర్ ఫ్లాప్ అనే టాక్ వెలుపలకు వచ్చిందని ఆ పార్టీ శ్రేణులు డీలాపడుతున్నారని ప్రచారం జరుగుతోంది.

మంత్రిగారూ మీరెక్కడ..?

- ఆదిమూలపు సురేష్ కనిపించడం లేదంటూ ఎర్రగొండపాలెంలో పోస్టర్లు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్



మంత్రి సురేష్ కనిపించడం లేదని ఎర్రగొండపాలెంలో వేసిన పోస్టర్

ఎర్రగొండపాలెం, మార్చి 10 : రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ 'కనబడుటలేదు' అని ఆదివారం ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఎర్రగొండపాలెంలో పోస్టర్లు వెలిశాయి. ఇవి ఇటు ఎర్రగొండపాలెంతో పాటు ఆయన వైసీపీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న కొండపి నియోజకవర్గంలోనూ చర్చనీయాంశమయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఓవైపు సిద్ధం సభ జరుగుతుండగా అదేసమయంలో మంత్రి పోస్టర్లు ప్రత్యక్షం కావడం గమనార్హం. 'మేము 2019లో ఓట్లు వేసి గెలిపించిన 59 ఏళ్ల ఆదిమూలపు సురేష్ కనిపించడం లేదు. అచూకీ తెలిసిన వారు మాకు తెలియజేగలరు' అని ఎర్రగొండపాలెం ప్రజల తరఫున ఈ పోస్టర్ ఉంది.

రమణీయం.. ఆదిదేవుడి రథోత్సవం

- శివనామస్మరణతో మార్మోగిన త్రిపురాంతకం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

త్రిపురాంతకం, మార్చి 10: మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం త్రిపురాంతకంలో ఆదిదేవుడి రథోత్సవం రమణీయంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. మధ్యాహ్నం తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రథం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ పూజా కార్యక్రమాలను రథదాతలైన గ్రామంలోని గోళ్ల, ఇమ్మడిశెట్టి వంశీయులు నిర్వహించారు. అనంతరం ఉత్సవం జరిగింది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. తహసీల్దారు బి.రామకృష్ణ శివప్రసాద్, ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ చైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు విశ్వం, ప్రసాద్ పూజలు చేశారు. సీఐ ఎస్.సుబ్బారావు, ఎస్ఐ వి.సాంబశివయ్య ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవానికి వచ్చిన భక్తులకు అన్ని సంఘాల సత్రాల వారు భోజన సౌకర్యాలు కల్పించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహించారు.



రథం లాగుతున్న భక్తులు (ఇన్‌సెట్లో) కొలువైన పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరుడు

సిద్ధం ఫ్లాప్!

- ఎన్ని చేసినా కదలని జనం
- భారీగా తాయిలాలు.. గ్రాఫిక్‌తో జిమ్మిక్కులు
- గ్రామాల్లోనే ఆగిపోయిన కొన్ని వాహనాలు
- మినీ బార్లుగా మారిన బస్సులు
- టార్గెట్‌లో ఒక వంతు కూడా వెళ్లని వైనం
- ఇద్దరు ఎమ్మెల్యేలు, పలువురు నేతలు, వారి అనుచరులు గైర్హాజరు
- ఒక్కొక్కరికి రూ.300 నుంచి రూ.500 వరకు చెల్లింపు
- అదనంగా మద్యం బాటిల్, పలావు ప్యాకెట్
- చివర్లో వేదిక వద్ద గ్యాలరీ మారుతూ ఒత్తిడికి గురై ఒంగోలు కార్మికుడు మృతి

వైసీపీ ఆదివారం ఉమ్మడి జిల్లాలోని మేదరమెట్ల సమీపంలో నిర్వహించిన సిద్ధం సభకు జనం నుంచి స్పందన కరువైంది. వైసీపీ నాయకులు సామ,దాన,భేద దండోపాయాలను ప్రయోగించినా, వలంటీర్లను పూర్తిగా రంగంలోకి దింపినా ఫలితం కన్పించలేదు. మరోవైపు పార్టీలోని అంతర్గత కలహాలు బహిర్గతమయ్యాయి. ఇద్దరు ఎమ్మెల్యేలు, పలువురు కిందిస్థాయి నాయకులు, వారి అనుచరులు సభకు దూరంగా ఉండిపోయారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాకు వైసీపీ అధిష్ఠానం ఇచ్చిన టార్గెట్‌లో ఒకవంతు కూడా జనసమీరణ జరక్కపోగా వెళ్లిన వారిలో ఎక్కువ మంది సభకు దూరంగా ఉండటం, కొద్దిసేపటికే తిరుగు ప్రయాణం కావడం స్పష్టంగా కనిపించింది. జనంలేని సభను జన సందోహంతో కిక్కిరిసిపోయిందని చూపుకునేందుకు ఆపార్టీ నేతలు గ్రాఫిక్స్ జిమ్మిక్కులతో చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ఇతర జిల్లాల నుంచి కూడా ఆశించిన మేర జనం రాకపోవడం వైసీపీ అగ్ర నేతలను నిరాశకు గురిచేసింది. కొన్ని గ్రామాల్లో వాహనాల్లోకి అసలు పార్టీ శ్రేణులు ఎక్కకపోగా, మరికొన్ని గ్రామాల్లో వచ్చిన వాహనాలకు పార్టీలోని అసమ్మతి వాదులు అంతరాయాలు కల్గించడం లాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. మధ్యలో ఒకట్రెండు చోట్ల సభకు రాని వారిపై వైసీపీ నేతలు బెదిరింపులకు పాల్పడ్డారు. జగన్ ప్రసంగం సమయంలో గ్యాలరీలో ఓ చోటు నుంచి మరో చోటుకు పోయేందుకు ప్రయత్నించిన సమయంలో ఒంగోలుకు చెందిన మున్సిపల్ కార్మికుడు మృతి చెందాడు.



సీఎం జగన్ ప్రసంగం సమయంలో సభాస్థలిలో అరకొరగా ఉన్న జనం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రాష్ట్రంలో భారీగా సిద్ధం సభల నిర్వహణ ద్వారా ఎన్నికల సమరానికి అధికార వైసీపీ శ్రీకారం పలికింది. అందులో భాగంగా నాల్గవది అయిన ఆఖరు సభ ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మండల కేంద్రమైన కొరిశపాడు సమీపంలో నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి భారీగా జనసమీకరణకు ప్రయత్నించారు. అందుకోసం ఆపార్టీ ముఖ్య నాయకులంతా సర్వశక్తులూ ఒడ్డారు. వైసీపీ రాష్ట్ర నాయకత్వం నియోజకవర్గాలవారీ నాయకులపై ఒత్తిడి పెంచి టార్గెట్లు ఇచ్చి భారీ జనసమీకరణకు ఆదేశించింది. ఆమేరకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన స్థాయిలో సభ విజయవంతం కాకపోవడంతో ఆపార్టీ నాయకులు కూడా నిర్ఘాంతపోయారు. ఆ సభ నిర్వహణ పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిపివేయడం, ఆర్టీసీ బస్సులన్నింటినీ జనసమీకరణకు పంపడంతో సాధారణ ప్రయాణికులు నరకయాతనకు గురయ్యారు. ఇంత చేసినా వైసీపీ నాయకత్వం ఆశించిన స్థాయిలో సభ సక్సస్ కాలేదు. సుమారు 15 లక్షల మంది హాజరవుతారని ప్రకటించుకోగా అందులో ఒకవంతు కూడా రాలేదు.

ఇద్దరు ఎమ్మెల్యేలు, మరికొందరు నాయకులు గైర్హాజరు

దర్శి, కందుకూరు ఎమ్మెల్యేలు మద్దిశెట్టి వేణుగోపాల్, మానుగుంట మహీధర్‌రెడ్డి సభకు గైర్హాజరయ్యారు. కందుకూరులో మహీధర్‌రెడ్డి అనుచరులు ముందుగానే చెప్పి మరీ కార్యక్రమాన్ని బహిష్కరించారు. దర్శిలో ఎమ్మెల్యే వేణుగోపాల్ అనుచరుల్లో కొందరు సభకు వెళ్లాలని భావించారు. కానీ వారికి వాహనాలను పార్టీ నుంచి ఏర్పాటు చేయలేదు. ఇక ఆయా నియోజకవర్గాల్లో కింది స్థాయి నాయకుల్లో చాలామంది సిద్ధం సభకు దూరంగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌తో పాటు కనిగిరి, గిద్దలూరు, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు, కొండపి తదితర నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికతో అసంతృప్తితో ఉన్న పలువురు నాయకులు, ఆ పార్టీ ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు కూడా సమావేశానికి గైర్హాజరయ్యారు.

భారీగా తాయిలాలు ఇచ్చినా స్పందించని ప్రజలు

జనసమీకరణకు సర్వశక్తులు ఒడ్డిన వైసీపీ నేతలు భారీగా తాయిలాలు కూడా ఇచ్చారు. సభకు వచ్చే వారికి కొన్ని ప్రాంతాల్లో ఒక్కొక్కరికి రూ.300, మరికొన్ని ప్రాంతాల్లో రూ.500 ప్రకారం చెల్లించారు. ఇక మద్యం, పలావు పొట్లాలు అయితే అన్ని ప్రాంతాల్లో ఇచ్చారు. ఇవన్నీ కలుపుకుంటే రవాణా ఖర్చులు కాకుండా ఒక్కొక్కరికి రూ.800 నుంచి రూ.1000 వరకు వెచ్చించారు. అయినా వైసీపీ నాయకులు ఆశించిన స్థాయిలో ప్రజలు వాహనాలు ఎక్కలేదు. అనేక ప్రాంతాల్లో సర్పంచ్‌లు.. 'మాకు జగన్ అన్యాయం చేశారే తప్ప అభివృద్ధికి సహకరించలేదు. సభకు మేము రాము. మా అనుచరులనూ పంపం' అని ఎదురుతిరిగారు. కందుకూరు నియోజకవర్గంలో సర్పంచ్‌లు ముందుగానే విషయాన్ని తేల్చిచెప్పారు. గిద్దలూరు నియోజకవర్గంలోని కొమరోలు మండలం దద్దవాడ గ్రామంలో ఒక వైసీపీ కార్యకర్త గ్రామానికి వచ్చిన బస్సు టైర్లు పంక్చర్ చేసి కదలకుండా చేశారు. పుల్లలచెరువు మండలం సిద్దన్నపాలెంలో గ్రామానికి వెళ్లిన బస్సులో ఒక్కరూ ఎక్కకపోవడంతో సాయంత్రం వరకు అక్కడే ఉంది. ఇలాంటి సంఘటనలు అనేక ప్రాంతాల్లో చోటుచేసుకున్నాయి.

బస్సుల్లోనే మద్యం తాగి చిందులు

ఇక నలభై మంది పట్టే బస్సులో 10 మంది 5 మంది వచ్చిన వాహనాలు చాలా ఉన్నాయి. అయితే ప్రతి ప్రాంతంలోనూ పురుషులనే అధికంగా సమీకరించేందుకు ప్రయత్నించారు. మహిళలు వచ్చినా ప్రత్యేక వాహనం ఎక్కించారు. పురుషులు ఉన్న వాహనాలన్నీ మినీ బార్లుగా మారిపోయాయి. మద్యం సేవిస్తూ చిందులు వేశారు. కొన్ని వాహనాలు అయితే మధ్యలో ఆపుకొని సభ పూర్తయ్యే వరకు అదే పనిలో ఉండటం కనిపించింది. సభ వరకు వచ్చిన వారిలో కూడా మహిళలు ఎక్కువ మంది ప్రాంగణానికి దూరంగా చెట్ల కింద కూర్చుని కనిపించారు. అదేమిటని ప్రశ్నిస్తే 'డబ్బులు ఇచ్చారు వచ్చాం. తిరిగి వెళ్లేటప్పుడు వెళ్లిపోతాం. ఆ సభతో మాకెందుకు' అని స్పష్టంగా చెప్పారు.

ఫలించని బెదిరింపులు

వైసీపీ నేతల బెదిరింపులు కూడా ఫలించలేదు. ఒక వైపు వలంటీర్లకు డబ్బులు, బహుమలు ఇచ్చి జనాన్ని సమీకరించమని ఒత్తిడి చేశారు. డ్వాక్రా సంఘాల గ్రూపుల నాయకులకు అలాంటి ఆదేశాలే ఇచ్చారు. గ్రామాల్లో సాధారణ ప్రజలపై అయితే వైసీపీ నాయకులు దౌర్జన్యంగా వ్యవహరించారు. పంగులూరు మండలం రామకూర్‌లో చక్రవర్తి అనే యువకుడు సభకు రాకపోవడమే కాక తన పొలంలో పనిచేసేవారిని పంపకపోవడంతో గ్రామంలోని వైసీపీ నాయకులు ఆయన్ను రక్త గాయాలయ్యేలా కొట్టారు.

ఫలించని జిమ్మిక్కులు

సభకు భారీగా జనం వచ్చినట్లు చూపేందుకు గ్రాఫిక్ జిమ్మిక్కులకు వైసీపీ నాయకులు పాల్పడ్డారు. సీఎం జగన్ రాకముందు సభా ప్రాంగణంలో రెండో డ్రోన్ కెమెరా దృశ్యాలు చిత్రీకరిస్తుంటే అది నారా లోకేష్ పని అంటూ మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. చివరకు పోలీసులు ఆ డ్రోన్ కెమెరా వైసీపీ అధికారిక సంస్థ అయిన ఐప్యాక్‌దని తేల్చేశారు.

టార్గెట్‌లో ఒక వంతు మాత్రమే

జిల్లా నుంచి కనీసం ఐదు లక్షల మందిని సమీకరించాలని వైసీపీ భావించింది. ప్రధానంగా అద్దంకి, పర్చూరు, చీరాల నుంచి అధికంగా తరలించాలని ఆదేశించారు. కానీ ఆమూడు నియోజకవర్గాల నుంచి వారు ఆశించిన స్థాయిలో పార్టీశ్రేణులు కానీ, ప్రజలు కానీ హాజరుకాలేదు. ఇతర నియోజకవర్గాల నుంచి అధిష్ఠానం ఇచ్చిన టార్గెట్‌లో ఒకవంతు మాత్రమే వచ్చారు. కొన్ని నియోజకవర్గాల్లో రెండు నుంచి ఐదు వేలమంది, మరికొన్ని సెగ్మెంట్‌లలో పది నుంచి పదిహేను వేల మంది, ఒకట్రెండు నియోజకవర్గాల నుంచి 20వేల ప్రకారం సమీకరణ జరిగింది. సరాసరి లక్షపైచిలుకు జిల్లా నుంచి సమీకరించగా, ఇతర జిల్లాల నుంచి మరో లక్ష వచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు.

కాంట్రాక్టు కార్మికుడు మృతి

సభ ముగిసిన తర్వాత ముందు వరుసలో ఉన్న యువ కార్యకర్తలు జగన్‌ను దగ్గరగా చూసేందుకు, వీలైతే కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. ఆ సమయంలో ఒంగోలు మునిసిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న మురళి తీవ్ర ఒత్తిడికి గురై మృతి చెందాడు. అదేవిధంగా సిద్ధం సభకు వచ్చిన నరసరావుపేట పట్టణంలోని స్టేడియం ఎదురు చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన గేదెల బాల దుర్గారావు (27) తిరిగి వెళ్లే సమయంలో బస్సు నుంచి జారిపడి ఒక్కడిక్కడే మృతి చెందాడు. కాగా ఇది పూర్తిగా రాజకీయ సభ కావడం కాబోలు ముఖ్యమంత్రి జగన్ స్థానిక అంశాలు, జిల్లా అభివృద్ధి అంశాలను ప్రస్తావించలేదు.

సొసైటీలో స్వాహాపర్వం

- కొమరోలు సహకారసంఘంలో భారీ కుంభకోణం
- రూ.80.26 లక్షలు గోల్‌మాల్
- సొంతానికి వాడేసుకున్న సీఈవో
- విచారణలో వెలుగు చూసిన వైనం
- చర్యలకు డీసీవో ఆదేశం

ఒంగోలు (విద్య), మార్చి 10 : కొమరోలు విశాల వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో భారీ కుంభకోణం చోటుచేసుకుంది. సొసైటీ నిధులు రూ.80.26 లక్షలు స్వాహా అయ్యాయి. లావాదేవీల్లో అడుగడుగునా అక్రమలు చోటుచేసుకున్నాయి. వీటన్నింటికీ సీఈవో రావూరి దిలీప్‌కుమార్ కేంద్రబిందువుగా నిలిచారు. సొసైటీ నిధులను సీఈవో యథేచ్ఛగా సొంతానికి వాడేసుకున్నారు. సొసైటీ నిర్వహించిన ఎరువుల వ్యాపారంలో అక్రమాలు, శనగలు కొనుగోలు చేసి ఇష్టారాజ్యంగా బహిరంగ మార్కెట్‌లో విక్రయించి దిగమింగారు. రుణాలకు సంబంధించి రైతుల నుంచి వసూలు చేసిన సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా స్వాహా చేశారు. సూపర్ మార్కెట్ వ్యవహారంలోనూ నిధులు స్వాహా చేశారు. సొసైటీలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గిద్దలూరు సబ్ డివిజనల్ సహకారాధికారి చేపట్టిన విచారణలో నిధులు స్వాహా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై డీసీవో సమగ్ర విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా పొదిలి సబ్ డివిజనల్ సహకారాధికారి కె.వెంకటేశ్వర్లును నియమించారు. దీన్ని అడ్డుకోసేందుకు సీఈవో చేయని ప్రయత్నాలు లేవు. రాజకీయంగా, న్యాయపరంగా ఆయన చేసిన ప్రయత్నాలకు అడ్డుకట్టపడింది. విచారణ చేపట్టడతో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. 80.26 లక్షలు దిగమింగినట్లు తేలింది.

అక్రమాల్లో మచ్చుకు కొన్ని..

సొసైటీలో 41 మంది రైతుల నుంచి రూ.29.64 లక్షలు వసూలు చేసి ఆ మొత్తాన్ని నగదు పుస్తకాల్లో నమోదు చేయకుండా, బ్యాంకులో జమ చేయకుండా సీఈవో దిగమింగారు. బకాయిలు చెల్లించిన రైతులకు సొసైటీ రసీదులు ఇవ్వకుండా తెల్లకాగితం మీద స్టాంపులు అంటించి ఇచ్చారు.



కొమరోలు సొసైటీ కార్యాలయం

రైతులు రెండోసారి చెల్లించిన బకాయిలు రూ.8.75 లక్షలు సొసైటీ నగదు పుస్తకంలో రాయకుండా, బ్యాంకులో జమ చేయకుండా సీఈవో స్వాహా చేశారు.

రైతుల వ్యవసాయ రుణాలకు సంబంధించి వడ్డీ చెల్లింపు కోసం వసూలు చేసిన రూ.1.78 లక్షలు సొంతానికి వాడుకున్నారు.

సొసైటీ ద్వారా కొనుగోలు చేసిన శనగల విక్రయంలో కూడా గోల్‌మాల్ జరిగింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన శనగలు నేరుగా మార్క్‌ఫెడ్‌కు విక్రయించకుండా కొన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొని ఆ మొత్తాలు రైతులకు చెల్లించకుండా దిగమింగారు. రైతులు ఒత్తిడి చేయడంతో సీఈవో వారికి చెక్కులు ఇవ్వగా అవి బౌన్స్ అయ్యాయి. ఈవిధంగా రూ.7.24లక్షలు స్వాహా చేశారు.

మార్క్‌ఫెడ్ నుంచి రూ.15.55 లక్షల ఎరువులు కొనుగోలు చేసి వాటిలో కొంత మొత్తం అసలు సొసైటీకి చేరకుండానే బయట విక్రయించారు. దీనికి సంబంధించి మార్క్‌ఫెడ్‌కు రూ.2.50 లక్షలు జమ చేశారు ఈ వ్యాపారంలో ర. 2.52 లక్షలు స్వాహా చేశారు అదేవిధంగా సొసైటీలో నిల్వ ఉన్న నగదులో రూ.4.49 లక్షలు సొంతానికి వాడుకున్నారు.

సొసైటీ అధ్వర్యంలో నిర్వహించిన సూపర్ మార్కెట్ లావాదేవీల్లోనూ అక్రమాలకు పాల్పడి లక్షల రూపాయలు దోచుకున్నారు. సూపర్ బజారు స్టాక్ నిల్వలో తేడా వలన రూ.5.49 లక్షలు, బయటి వ్యక్తులకు విక్రయించి సొసైటీకి జమ కాని మొత్తం రూ.3.50 లక్షలు, సూపర్ మార్కెట్ రూము రెంటు రెండు లక్షలు, రెంట్ అడ్వాన్స్ రూ.1.50 లక్షలు స్వాహా చేశారు.

సొసైటీకి జమ అయిన మొత్తాలను ఖర్చుగా చూపించి రూ.46,260 సొంతానికి వాడుకున్నారు.

పాలకవర్గం అనుమతి లేకుండా, జీతాల పే బిల్లుల ఎంట్రీలు లేకుండా రూ.2.46 లక్షలు డ్రా చేసి దిగమింగారు.

సొసైటీకి తనఖా పెట్టిన 26,842 బాండ్లు వాయిదా, గడువు మీరిపోవడంతో సంస్థకు నష్టం వాటిల్లింది.

తగు చర్యలకు ఆదేశం

కొమరోలు సొసైటీలో జరిగిన కుంభకోణంపై జిల్లా సహకారాధికారి పోలిశెట్టి రాజశేఖర్‌ను వివరణ కోరగా అక్కడ నిధులు దుర్వినియోగం వాస్తవమేనని ధ్రువీకరించారు. తగు చర్యలు తీసుకోవాలని మార్కాపురం డివిజనల్ సహకారాధికారిని ఆదేశించినట్లు చెప్పారు. నిధులను సంబంధిత వ్యక్తులనుంచి రాబట్టేందుకు చర్యలు తీసుకుంటామని రాజశేఖర్ తెలిపారు.

సైకో జగన్‌ను సాగనంపుదాం



అభివాదం చేస్తున్న నేతలు దామచర్ల జనార్దన్, రియాజ్ నేతలు

- రాక్షసుడుని తరిమికొట్టేందుకే మూడుపార్టీలు ఒక్కటయ్యాయి
- టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశంలో జనార్దన్, రియాజ్

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 10 : 'రాష్ట్రంలో నియంత పాలన సాగుతోంది. సైకో జగన్‌ను సాగనంపేందుకు టీడీపీ, జనసేన కలిసికట్టుగా పనిచేయాలి' టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పీఏజీ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ పథకాలు చేపడితే వాటన్నింనీ తొలగించిన దుర్మార్గపు ముఖ్యమంత్రి జగన్ అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రాక్షసుడి పాలనను అంతమొందించేందుకు మూడు పార్టీలు ఒక్కటయ్యాయని అన్నారు. ప్రస్తుతం మన అందరి ముందు ఉన్న ఏకైక లక్ష్యం సైకోను శాశ్వతంగా ఇంటికి పంపి, సంక్షేమ పాలన సాధించుకోవడం కోసం టీడీపీని గెలిపించుకోవడమేనన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యే, రెండు సార్లు మంత్రి అయిన ఒంగోలు ఎమ్మెల్యే ఇప్పటి వరకూ పట్టించుకుండా ఎన్నికల సమయంలో పట్టాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఆయన కుమారుడి అరాచకాలు మరీ ఎక్కువయ్యాయని అన్నారు. అనేక మంది టీడీపీలో చేరుతుంటే ఎమ్మెల్యే కొడుకు బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడటం సిగ్గు చేటన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మినీ స్టేడియం, అంబేడ్కర్ భవన్ ఆధునికీకరణ, పోతురాజు కాలువ పనులు, గుండ్లకమ్మ నుంచి రోజూ తాగునీటి కోసం రూ.163 కోట్లు, షాదీఖానా నిర్మాణం, ఇంకా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నేడు వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే వ్యాపారం చేస్తున్నదని మండిపడ్డారు. జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్, ఒంగోలులో బాలినేని రాక్షస పాలన ముగిసే సమయం దగ్గరపడిందన్నారు.

ఒంగోలు అభివృద్ధి కోసం బాలినేని హఠావో, ఒంగోలు బచావో నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. జనసేన, టీడీపీ అన్న భేదం లేకుండా అందరూ అన్నదమ్ముల్లాగా, ఒకే కుటుంబంలా పనిచేసి టీడీపీని గెలిపించాలన్నారు. సమావేశంలో ఇరుపార్టీలకు చెందిన నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య, శశికాంత్ భూషణ్, మహిళా నాయకులు ఆర్ల వెంకటరత్నం, కుసుమ కుమారి, బీరం అరుణ రెడ్డి, నాళం నరసమ్మ, జనసేన నాయకులు, కార్పొరేటర్ మలగా రమేష్‌బాబు, సుంకర సాయిబాబా, చనపతి రాంబాబు, రాయపాటి అరుణ, పలువురు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నయనానందం.. శివపార్వతుల రథోత్సవం

దర్శి, మార్చి 10 : దర్శిలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నయనానందంగా సాగింది. శివపార్వతుల కల్యాణం ఆదివారం నిర్వహించారు. ఆది దంపతులను ఆదివారం బంగారు రథంలో ఊరేగించారు. జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లివెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గొలుసులాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. వందలాది మంది భక్తులు, మహిళలు గొలుసులాగేందుకు పోటీపడ్డారు. కాశీవిశ్వేర ఆలయం నుంచి అద్దంకి రోడ్డు మీదుగా గడియార స్తంభం వద్దకు చేరుకున్న రథంపై ఆదిదంపతులు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయం వరకు రథోత్సవం జరిగింది.

‘సిద్ధం’పై నిరాసక్తత

- సీఎం సభకు ఆసక్తిచూపని వైసీపీ కార్యకర్తలు
- పలుగ్రామాల నుంచి ఖాళీ సీట్లతో వెళ్లిన బస్సులు
- డుమ్మా కొట్టిన వైసీపీ మండల కన్వీనర్ శంకర్

బల్లికురవ, మార్చి 10: వైసీపీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సిద్ధం సభకు బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో ఆపార్టీ కార్యకర్తలు ఆసక్తి చూపలేదు. ప్రభుత్వం అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులను పంపించింది. మేదరమెట్ల వద్ద జరిగే సభకు వెళ్లే కార్యకర్తలకు బిర్యాని ప్యాకెట్లతో పాటు తాగే వారికి మందు బాటిళ్లను కూడా అందించారు. అయినప్పటికీ కొన్ని గ్రామాల నుంచి బస్సులలో సరిపడ కార్యకర్తలు ఎక్కక పోవటంతో ఖాళీగానే సభకు తరలి వెళ్లాయి. కొన్ని బస్సులలో అయితే బిర్యాని తింటూ కార్యకర్తలు తరలివెళ్లారు. వైసీపీ నేతలు గ్రామాలలో ఎంత బ్రతిమిలాడిన ప్రజలు బస్సులు ఎక్కేందుకు ఇష్టపడలేదు. కొన్నిగ్రామాలకు పెద్ద ఎత్తన బస్సులు ఏర్పాటుచేశారు. కొన్ని బస్సులు కార్యకర్తలు లేక అర కొరతో తరలివెళ్లాయి. ఉదయం 8 గంటలకు బస్సులు వచ్చినా సాయంత్రం వరకు కొన్ని కదలలేదు. కొందరు సభ దగ్గరకు వెళ్లకుండానే మధ్యలోనే వెనుదిరిగారు.

సిద్ధం సభకు డుమ్మా..

మేదరమేట్ల వద్ద వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు వైసీపీ బల్లికురవ మండల కన్వీనర్ ముద్దపాటి శంకర్ గైర్హాజరయ్యారు. మల్లాయపాలెం గ్రామానికి చెందిన ముద్దపాటి శంకర్‌ను వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి పది రోజుల క్రితం మండల కన్వీనర్‌గా నియమించారు. బాధ్యతల స్వీకరణ వేడుకలు కూడా ఎంతో ఆర్భటంగా నిర్వహించారు. ఏమి జరిగిందో ఏమోగాని గత రెండు రోజుల నుంచి శంకర్ సెల్‌ఫోన్‌ను స్విచ్‌అఫ్ చేసుకొన్నాడు సిద్ధం సభకు జగన్ హాజరవుతున్నా ఆయన వెళ్లక పోవటం మండలంలో చర్చనీయాంశమైంది. ఆయన అనుచరులు కూడా బస్సులు ఎక్కకపోవటంతో కార్యకర్తలు లేక వెలవెలబోయాయి.

అలాగే, వైసీపీకి చెందిన నక్కబొక్కలపాడు సర్పంచ్ దూళిపాళ్ల బుల్లిరామయ్య కూడా సిద్ధం సభకు దూరంగా ఉన్నాడు. తన అనుచరులు కూడా సభకు వెళ్లలేదు. వల్లాపల్లి, చెన్నుపల్లి గ్రామాలకు చెందిన వైసీపీలో ఉన్న ద్వితీయ శ్రేణి నేతలు కూడా సభకు డుమ్మా కొట్టారు.



బల్లికురవ మండలం నుంచి అరకొరగా కార్యకర్తలతో సిద్ధం సభకు తరలిన బస్సులు

వైసీపీలో నిరుత్సాహం

- క్యాడర్‌లో జోష్ నింపని ‘సిద్ధం’
- ఆశించిన స్థాయిలో హాజరుకాని జనం

మేదరమెట్ల/అద్దంకి, మార్చి 10: సిద్ధం సభ వైసీపీ క్యాడర్‌లో జోష్ పెంచకపోగా నిరుత్సాహన్ని నింపింది. మేదరమెట్ల సమీపంలో పి.గుడిపాడు వద్ద జాతీయ రహదారి సమీపంలో ఆదివారం సాయంత్రం సిద్ధం సభ జరిగింది. సభ లో బాపట్ల జిల్లాకు వరాల జల్లు కురిపిస్తారని ఆశించిన ప్రజలకు ఒకింత నిరుత్సాహమే మిగిలింది. అద్దంకి నియోజవర్గంలో వైసీపీ గెలుపును సీఎం జగన్మోహనరెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని స్థానిక వైసీపీ నేతలు అవకాశం వచ్చినప్పుడల్లా చెప్పుకుంటుండగా, అద్దంకి నియోజవర్గంలో జరిగిన సిద్ధం లోనైనా వరాల జల్లు కురిపిస్తారని భావించిన అద్దంకి నియోజవర్గ ఓటర్లకు పూర్తి నిరాశే మిగిలింది. సిద్ధం సభకు అత్యంత సమీపంలో వైసీపీ నేతలలో కీలక నేతగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి తండ్రి పేరుతో పనులు చేపట్టి అర్ధంతరంగా నిలిచిపోయిన యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేసే హామీ కూడా ఇవ్వకపోవటం క్యాడర్ లో మరింత నిరుత్సాహం నెలకొంది. సిద్ధం సభకు రావద్దని కొరిశపాడు మండలంలోని తూర్పుపాలెంకు చెందిన నలుగురు రైతులకు పోలీసులు ముందస్తు నోటీసులు అందించటం గ్రామస్థులను మరింత కలిసి వేసింది. పోలీసులు నోటీసులు ఇచ్చిన రైతులు వైవీ సుబ్బారెడ్డి కుటుంబానికి బంధువులు కూడా కావటం విశేషం. ఇలా ఏఒక్క విషయాన్ని కూడా ప్రకటించక పోవటం క్యాడర్ లో ఒకింత నిరుత్సాహం నెలకొంది.



సీఎం సభ వద్దకు వెళ్ళకుండానే వెను తిరిగి మేదరమెట్ల వద్ద సేదతీరుతున్న మహిళలు



ఒకవైపు సిద్ధం సభ వద్దకు వెళ్తున్న బస్సులు, మరో రోడ్డులో వచ్చిన జనంతో వెనుతిరిగి వెళ్తున్న బస్సులు

సభ ప్రారంభం కాకముందే వెనుదిరిగిన జనం

గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి జనాన్ని ప్రత్యేక బస్సులలో నానాతిప్పలు పడి తరలించారు. వైసీపీ నేతలు గత పక్షం రోజులుగా ఊదరగొట్టిన విధంగా 15 లక్షల మంది హాజరవుతున్నారని చెప్పిన మాటలు, ఆదివారం హాజరైన జనానికి భారీ వ్యత్యాసం ఉందని పలువురు అంచనా వేస్తున్నారు. భారీ సంఖ్యలో ఆర్టీసీ, కళాశాలల, పాఠశాలల బస్సులు ఏర్పాటుచేసి తరలించే ప్రయత్నం చేసినా ఐదో వంతు మందికి లోపుగానే హాజరై ఉంటారని అంచనా వేస్తున్నారు. సిద్ధం సభా ప్రాంగణంలో లక్ష మందికి మించి పట్టే పరిస్థితి లేదు. ఇక మిగిలిన జనం మొత్తం జాతీయ రహదారిపైనే ఉండిపోయారు. అత్యధిక శాతం మంది అయితే సభా వేదికకు సుమారు మూడు నుంచి 5 కి.మీ దూరం నుంచే కనీసం బస్సుల నుంచి కూడా దిగకుండానే వెనుతిరిగిపోయారు.

సిద్ధం సభ ప్రారంభానికి సుమారు గంట ముందు నుంచి దూర ప్రాంతాల నుంచి వచ్చిన జనం వెనుతిరిగి పోవటం ప్రారంభించారు. కొంతమంది అయితే ఎండ వేడిమికి సభా వేదిక వద్దకు వెళ్ళలేక సభా వేదిక నుంచి సుమారు 5 కి.మీ దూరంలోనే చెట్ల కింద సేద తీరారు. ఒంగోలు వైపు నుండి వచ్చిన పలు బస్సులు కొరిశపాడు, మేదరమెట్ల ఫ్లైఓవర్‌ల వద్ద నుంచే వెనుతిరిగాయి. సిద్ధం సభకు వచ్చే జనం కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేయటంతో పాటు పురుషులకు ఒక మద్యం బాటిల్, బిర్యానీ ప్యాకెట్ ఇచ్చారు. మహిళలకు కూల్‌డ్రింక్, బిర్యానీ ప్యాకెట్ సరఫరా చేశారు. ఇంతచేసినా పలు గ్రామాల నుంచి మాత్రం ఆశించిన స్థాయిలో జనం రాకపోవటంతో బస్సులు కనీసం సగం సీట్లలో కూడా జనం లేకుండానే సిద్ధం సభకు వచ్చాయి.

అద్దంకిలో ఆశించినస్థాయిలోలేక..

అద్దంకి పట్టణంలోని పలు వార్డులలో అయితే పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. జనం లేకపోవటంతో బస్ డ్రైవర్‌లు ఆయా వార్డులలోని వైసీపీ నేతలకు ఫోన్‌లు కూడా చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో వెళ్ళలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలోని పలుగ్రామాలలో కూడా ఇదే పరిస్థితి కనపించింది. కొరిశపాడు మండలంలోని ఓ గ్రామంలో స్థానికంగా ప్రజలలో పెద్దగా స్పందన లేకపోవటంతో మిర్చి కోతలకు కర్నూలు నుంచి వచ్చిన కూలీలకు అన్ని సదుపాయయాలు కల్పించటంతో పాటు రూ.500 చొప్పున కూలీ ఇచ్చి బస్సులలో తరలించారు. బల్లికురవ మండలంలో ఇద్దరు, ముగ్గురు నేతలు అలకబూని సిద్ధం సభకు వెళ్లకుండా ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ చసినట్లు తెలుస్తుంది. అద్దంకి నియోజకవర్గంలో స్థానిక క్యాడర్ ఆశించిన స్థాయిలో పనిచేయకపోవటంతో ఆశించిన స్థాయిలో జనాన్ని తరలించటంలో విఫలమయినట్లు తెలుస్తుంది. పంగులూరు మండలం రామకూరులో సిద్ధం సభకు రానన్నందుకు యువకుడిపై వైసీపీ శ్రేణులు దాడిచేశారు.

కార్యకర్తల తరలింపులో తంటాలు

మార్టూరు, మార్చి 10: మేదరమెట్లలో ఆదివారం జరిగిన సీఎం సిద్ధం సభకు మండలం నుంచి వైసీపీ నాయకులు పార్టీ కార్యకర్తలను, అభిమానులను బస్సులలో తరలించారు. ప్రతి బస్సులో వచ్చే వారికి భోజనం, తదితర ఖర్చుల నిమిత్తం నియోజకవర్గ వైసీపీ అధినేత నుంచి రూ.10 వేల వంతున పార్టీ నాయకులకు అందినట్లు తెలిసింది. దాంతో ఈ నాయకులు సభ కు వచ్చే వారికి బిర్యానీతో పాటు పురుషులకైతే మద్యం బాటిళ్లు, మహిళలకైతే రూ.200 వంతున నజరానా ఇచ్చినట్లు తెలిసింది. అందుకోసం రూ.10 వేలు సరిపోక పోవడంతో కొంతమంది స్థానిక నాయకులు ఎంతోకొంత చేతిసొమ్ము వినియోగించినట్లు సమాచారం.

యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో సిద్ధం సభ కోసం కార్యకర్తలను తీసుకెళ్లడానికి వచ్చిన ఆర్టీసీ బస్సులో ఎవరూ ఎక్కకపోవడంతో ఖాళీగా వెనక్కు వెళ్లిపోయినట్లు తెలిసింది. అలాగే, యద్దనపూడి గ్రామంలో ఒక వైసీపీ నాయకుడు కూడా ఎందుకనో తెలియదు గాని సొంతనిధులతో వాహనాలలో కార్యకర్తలను సిద్ధం సభకు తర లించినట్లు తెలిసింది. పెద్ద జాగర్లమూడిలో గ్రామానికి చెందిన ఒక వైసీపీ నాయకునికి బస్సులను పంపిం చినప్పటికీ వాటిలో వెళ్లకుండా ఎస్సీ కాలనీకి చెందిన వారు ప్రత్యేకంగా రెండు వాహనాలలో వెళ్లినట్లు తెలిసింది. ఈ మూడు గ్రామాలలో జరిగిన సంఘటనలు మండలంలో వైసీపీ కార్యకర్తలలో చర్చ నీయాంశమైంది.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ

మార్టూరు, మార్చి 10: మండలంలోని బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు జెండాను ఆవిష్కరించారు. అనంతరం టోల్‌ప్లాజా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు యూనియన్‌గా ఏర్పడ్డారు. అధ్యక్షుడిగా రాజశేఖర్, కార్యదర్శిగా శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, కార్మికులు పాల్గొన్నారు.

నేడు యద్దనపూడిలో టీడీపీ, జనసేన కార్యకర్తల సమావేశం

యద్దనపూడి(మార్టూరు), మార్చి 10: యద్దనపూడిలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం ఆపార్టీ, జనసేన మండల కార్యకర్త సమావేశం జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

పుణ్యభూమి పుస్తకం ఆవిష్కరణ

అద్దంకి, మార్చి 10: కవయిత్రి ఐవీ సుబ్బాయమ్మ రచించిన పుణ్యభూమి పుస్తకాన్ని ఆదివారం స్థానిక నాగులబండ బజారులోని మారం సేవాసదన్ లో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఆవిష్కరించారు. ఈసందర్భంగా సాహిత్య మిత్రమండలి ఆధ్వర్యంలో సుబ్బాయమ్మను సన్మానించారు. కార్యక్రమంలో లక్కరాజు చంద్రశేఖర్, ఓరుగంటి శ్రీనివాసరావు, కుందా సుబ్బారావు, రఘురామశర్మ, గాడేపల్లి దివాకర్‌దత్, తదితరులు పాల్గొన్నారు.

మోటారుసైకిల్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

అద్దంకి, మార్చి 10: మోటార్‌సైకిల్ అదుపుతప్పటంతో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా శ్యావల్యాపురం మండలం వైకల్లుకు చెందిన పెదరోశయ్య సిద్ధం సభకు వచ్చి తిరిగి వెళ్ళే సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. అద్దంకి మండలం ధర్మవరం వద్ద ఆదివారం సాయంత్రం మోటార్‌సైకిల్ అదుపుతప్పి పడిపోవటంతో గాయాలయ్యాయి.

బస్సు నుంచి జారిపడి యువకుడు మృతి



మృతి చెందిన గేదెల బాలదుర్గారావు

అద్దంకి, మార్చి 10: మేదరమెట్ల సమీపంలో జరిగిన సిద్ధం సభకు వచ్చిన యువకుడు తిరిగి వెళ్ళే సమయంలో బస్సులో నుంచి జారిపడి అక్కడిక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. నర్సరావుపేట పట్టణంలోని స్టేడియం ఎదురు చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన గేదెల బాల దుర్గారావు(27) ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓ ప్రయివేట్ కళాశాల బస్సులో మేదరమెట్ల సమీపంలో జరిగిన సిద్ధం సభకు హాజరయ్యారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సభ జరిగే సమయంలోనే దుర్గారావు వచ్చిన బస్సు తిరుగు ప్రయాణమైంది. అద్దంకి మండలం గోపాలపురం వద్దకు వచ్చేసరికి బస్సులో గేటు వద్ద నిలబడి ఉన్న బాలదుర్గారావు జారి కిందపడ్డాడు. దీంతో అతనిపై గుండా అదే బస్సు వెనుక టైర్లు వెళ్లటంతో తల నుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. దుర్గారావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. దుర్గారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైసీపీ కార్యకర్తల దాడిలో యువకుడికి గాయాలు



గాయపడిన చక్రవర్తి

పంగులూరు, మార్చి 10: సిద్ధం సభకు రానని చెప్పడంతో వైసీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేశారు. మండలంలోని రామకూరులో ఆదివారం జరిగిన ఈ ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. మేదరమెట్ల సమీపంలో ఏర్పాటుచేసిన సిద్ధం సభకు ప్రత్యేక బస్సులలో వైసీపీ కార్యకర్తలు బయలుదేరారు. ట్రాక్టర్ నడుపుతూ గ్రామంలో మంచినీరు తాగేందుకు ఆగిన తలారి ధనచక్రవర్తిపై పార్టీ జెండాలున్న కర్రలతో వైసీపీ కార్యకర్తలు దాడిచేయడంతో గాయపడ్డాడు. గాయపడిన ధన చక్రవర్తిని చికిత్స నిమిత్తం ఉపసర్పంచ్ పెదవల్లి అశోక్, మరికొందరు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సిద్ధం సభకు రమ్మని కోరగా తాను నిరాకరించాడంతో తలపై కర్రతో మోది గాయపరిచారని ధనచక్రవర్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గతంలో వైసీపీలో ఉన్న ధనచక్రవర్తి మూడేళ్ళ క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికలలో ఆ పార్టీకి దూరమైనట్లు సమాచారం.

నలుగురికి నోటీసులు

చినగంజాం, మార్చి 10: కొరిశపాడు మండలం గుడిపాడు వద్ద జరిగే సిద్ధం సభలో పాల్గొనరాదని మండలంలోని నలుగురికి చినగంజాం పోలీసులు నోటీసులు అందజేశారు. మండలంలోని కడవకుదురుకు చెందిన సీపీఎం నాయకుడు గున్నమనేని ప్రతాప్‌కుమార్, జనసేన మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు, సోపిరాలకు చెందిన వైసీపీ నాయకుడు అనుమాలశెట్టి శ్రీరామకృష్ణ, చినగంజాంకు చెందిన మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్‌కు శనివారం రాత్రి పోలీసులు నోటీసులు అందజేసి, ఆదివారం ఉదయం బైండోవర్ చేశారు. సిద్ధం సభలో పొల్గొని ఏదైనా చట్ట వ్యతిరేక కార్యక్రమలు జరగకుండా ఉండేనిమిత్తం ముందు జాగ్రత్తచర్యలో భాగంగా నోటీసులు అందజేశారు. మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై సిద్ధం సభలో ప్లకార్డులను ప్రదర్శిస్తామనే భయంతో నోటీసులు జారీచేసి భయ భ్రాంతలకు గురిచేయడం అన్యాయమని ప్రతాప్‌కుమార్, శ్రీనివాసరావు పేర్కొన్నారు.

‘సిద్ధం’ కష్టాలు



ఢీకొన్న వ్యాను, బస్సు

- ట్రాఫిక్ మళ్లింపుతో వాహనచోదకుల అవస్థలు
- సరైన పార్కింగ్ స్థలాలు లేక సభకు వచ్చిన వాహనదారులు, ప్రజల ఇబ్బందులు



జాతీయ రహదారిపై నిలిచిపోయిన సిద్ధం సభకు వచ్చిన బస్సులు

మేదరమెట్ల/అద్దంకి, మార్చి 10: సిద్ధం సభను మేదరమెట్ల సమీపంలో జాతీయ రహదారి వెంబడే ఏర్పాటు చేయటంతో ఆదివారం జాతీయరహదారి పై సుమారు పది గంటలపాటు ట్రాఫిక్‌ను ఇతర మార్గాలకు మరల్చారు. ఇక సిద్ధం సభకు వేల సంఖ్యలో బస్సులు ఏర్పాటుచేసినప్పటికీ సరైన పార్కింగ్ స్థలాలు ఏర్పాటుచేయకపోవటం, పార్కింగ్ స్థలాలలో వాహనాలు సరైనరీతిలో నిలపకపోవటంతో సభకు వచ్చిన జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుదూరప్రాంతాల నుంచి వచ్చిన జనం తీరా సిద్ధం సభ వద్దకు వెళ్లే అవకాశం లేకపోవటం, సభాస్థలం ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు పడ్డారు. వీటన్నింటికి మించి జనం వచ్చిన బస్సులను మేదరమెట్ల, కొరిశపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జిల సమీపంలో, నామ్ రోడ్డులో బొడ్డువానిపాలెం సమీపంలో రోడ్లపైనే నిలిపివేయటంతో ట్రాఫిక్ కష్టాలు కనిపించాయి. ఎక్కడికక్కడే వాహనాలు రోడ్లపైనే నిలపటంతో వాహనదారులు తిరుగు ప్రయాణంలో మరింత ఇబ్బంది పడ్డారు. సిద్ధం సభ ఆరు గంటల సమయానికి ముగిసినా ట్రాఫిక్ రాత్రి పొద్దుపోయే వరకు క్లియర్ కాలేదు. ఇక దూర ప్రాంతాల నుంచి వచ్చిన జనానికి వాళ్ళు వచ్చిన బస్సులు ఎక్కడ నిలిపిఉంచారో అర్థం కాక మరింత ఇబ్బంది పడ్డారు.

ఇక ఆర్టీసీ బస్సులను అత్యధిక శాతం సిద్ధం సభకు కేటాయించటంతో ప్రయాణికులు మరిన్ని కష్టాలు పడ్డారు. అద్దంకి నియోజకవర్గంలో జనాన్ని తరలించేందుకు సుమారు 400 ఆర్టీసీ బస్సులు కేటాయించగా అత్యధిక శాతం బస్సులు తూర్పుగోదావరి జిల్లాల నుంచి పంపించారు. అద్దంకి పట్టణంతో పాటు కొరిశపాడు మండలం, పంగులూరు మండలంలోని అత్యధిక శాతం గ్రామాలకు సిద్ధం సభావేదిక 5 నుండి 20 కి.మీ దూరం మాత్రమే ఉంది. అయినప్పటికీ సుమారు 350 కి.మీ దూరం ఉండటంతో రానుపోను 700 కి.మీ దూరం ఆ బస్సులు ప్రయాణించేసి వచ్చి ఇక్కడ ప్రజలను తరలించేందుకు కేటాయించటం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. డీజిల్‌తో పాటు ఇతర ఖర్చులు కూడా వృధా అయ్యాయన్న విమర్శలు వస్తున్నాయి. అదే సమయంలో అద్దంకి డిపో బస్సులను పల్నాడు జిల్లాలోని గురజాల మండలానికి కేటాయించారు. ఇలా అటు బస్సులు ఇటు. ఇటు బస్సులు అటు కేటాయించటంతో వృధా ఖర్చు ఎక్కువగానే ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

సిద్ధం సభకు చీరాల నుంచి 500 బస్సులు

చీరాల, మార్చి 10: కొరిశపాడు మండలం పి.గుడిపాడు సమీపంలో ఆదివారం జరిగిన వైసీపీ సిద్ధం సభకు చీరాల నియోజకవర్గం నుంచి 500 బస్సుల్లో జనాలను తరలించినట్లు తెలిసింది. అయితే, మున్సిపల్ పరిధిలోని ఓ కౌన్సిలర్ చెప్పమన్నాడంటూ ఓవ్యక్తి వార్డులోని పలువురికి ఫోన్‌చేసి సభకు వచ్చేవారికి ఒక్కొక్కరికి రూ.300 ఇస్తారని, మద్యం అలవాటు ఉన్నవారికి మద్యం సీసా, అందరికి బిర్యానీ ప్యాకెట్లు అందజేస్తారంటూ చెప్పిన మాటల వాయిస్ రికార్డింగ్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

అది నిజంగా ఆ కౌన్సిలర్ అనుచరుడు చేసిన ఫోన్‌కాలా, లేకుంటే ఎవరన్నా ఉద్దేశ్యపూర్వకంగా చేశారా అనే విషయంలో రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తంమీద సభకు తరలివెళ్లిన వారికి తాయిలాలు బాగానే ముట్టజెప్పినట్లు తెలిసింది.

ప్రయాణికులకు తప్పని పాట్లు

- మండుటెండలో బస్సుల కోసం నిరీక్షణ
- అదనపు చార్జీలతో ఆటోల్లో ప్రయాణం



బస్సుల కోసం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

పర్చూరు, మార్చి 10: కొరిశపాడు మండలం పిగుడిపాడు వద్ద ఆదివారం జరిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను తరలించటంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో ఆయా ప్రాంతాలకు వెళ్ళేందుకు వచ్చిన ప్రయాణికులు పడరానిపాట్లు పడ్డారు. గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూసిన ప్రయాణికులకు సీఎం సభకు ఆర్టీసీ బస్సులను తరలించారన్న సమాచారం తెలియటంతో వారు పడిన అవస్థలు అన్నీఇన్నీకావు. ఉన్న అరకొర బస్సులతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. ఓ పక్క మండుటెండలు, మరో పక్క తాగటానికి చుక్కనీరు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పర్చూరు నుంచి ఆయా ప్రధాన పట్టణాలకు వెళ్ళేందుకు ప్రయాణికులు స్థానిక బొమ్మల సెంటర్‌లో మండుటెండలో నిరీక్షించారు. గత్యంతరం లేక అదనపు చార్జీలు వెచ్చించి ఆటోలో ప్రయాణాలు సాగించారు. రోజూ ఆర్టీసీ బస్సులతో రద్దీగా ఉండే పర్చూరు బస్టాండ్ వెలవెలబోయింది.



బస్సులు లేక ఆటోల్లో ప్రయాణం



పర్చూరు బొమ్మల సెంటర్‌లో భారీగా మోహరించిన పోలీసులు

జగన్ సభకు వెళ్ళే వాహనాలకే అనుమతి

పర్చూరు, మార్చి 10: సీఎం సిద్ధం సభ నేపథ్యంలో పర్చూరు నుంచి ఒంగోలు వెళ్ళే వాహనాలను చీరాల వైపు వెళ్ళేవిధంగా పోలీసులు ఆంక్షలు విధించారు. సిద్ధం సభకు వెళ్ళే వాహనాలను మాత్రమే ఈమార్గం ద్వారా అనుమతి ఇచ్చారు. దీంతో సిద్ధం సభకు లైన్ క్లియర్ అన్నట్లు ప్రజల నుంచి చర్చసాగింది. వాహనదారులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్పెషల్ పార్టీ పోలీసులు పర్చూరులో మోహరించారు. పోలీసులు బొమ్మల సెంటర్‌కు పెద్దఎత్తున చేరుకొని బందోబస్తు నిర్వహించటంతో ప్రజలు ఒకింత ఆందోళనకు గురయ్యారు. అసలు ఏమి జరిగింది.. ఏమి జరగబోతుంది అన్న విధంగా వాతావరణం నెలకొంది. ఎక్కడో సీఎం సభ అయితే ఇక్కడ పెద్దమొత్తంలో పోలీసులను మోహరించటం ఏమిటని ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే ఏలూరి ఫ్లెక్సీ చించివేత



క్యాంపు కార్యాలయం వద్ద ఏలూరి ఫ్లెక్సీని చించివేసిన ఆగంతకులు

మార్టూరు, మార్చి 10: మండలంలోని ఇసుక దర్శిలోగల క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావుకు జన్మదిన శుభా కాంక్షలను తెలియచేస్తూ గతంలో వేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని ఆగంతకులు చించివేశారు. ఆదివారం జరిగిన ఈ సంఘటన పార్టీ కార్యకర్తలను, ఏలూరి అభిమానులను తీవ్ర మానసిక వేదనకు గురి చేసింది. మేదరమెట్ల వద్ద జరిగిన సిద్ధం సభకు వెళుతూ వైసీపీకి చెందిన కొంతమంది ఆగంతకులు ఈ దుందుడుకు చర్యలకు పాల్పడి ఉంటారని టీడీపీ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఫ్లెక్సీలను చించివేసి గొడవలకు ఆద్యం పోయాలనుకోవడం మంచి సంప్రదాయం కాదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

ఘర్షణలో పలువురికి గాయాలు

మార్టూరు, మార్చి 10: స్థానిక సంపత్ నగర్‌లో గల గ్రానైట్ పరిశ్రమలో భాగస్వామ్యులుగా ఉన్న కోవూరి శ్రీనివాసరావు, తన్నీరు శ్రీనివాసరావు కుటుంబాల మధ్య ఆదివారం ఉదయం ఘర్షణ జరిగినట్లు తెలిసింది. వ్యాపారపరమైన విషయంపై మనస్పర్థలు కారణంగా రెండు కుటుంబాలకు చెందిన వారు ఒక రిపై మరొకరు దాడి చేసుకున్నారు. దాంతో రెండు కుటుంబాలకు చెందిన కొంతమందికి గాయాలయ్యాయి. ఈ విషయమై వారిద్దరు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నట్లు తెలిసింది. పోలీసులు విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ భాషా తెలిపారు.

115 మందికి వైద్యసేవలు

ఇంకొల్లు, మార్చి 10: మండలంలోని గంగవరంలో వైద్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 115 మంది రోగులకు వైద్య సేవలందించారు. గ్రామానికి చెందిన బోడెంపూడి రాధాకృష్ణమూర్తి, జరుబుల వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యుల సహకారంతో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎం. రమేష్‌బాబు, బోడావుల శ్వేతాశ్రీ, దుర్గాప్రసాద్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్రనాయకులు వలేటి కృష్ణయ్య, సీఐటీయూ నాయకులు వై.సిద్దయ్య, రామకోటేశ్వరరావు, వినోద్, నాగండ్ల వెంకట్రావు, వైద్యవేదిక కన్వీనర్ కరి బాలచంద్ర, కరి సృజన తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల భవిష్యత్తే చంద్రబాబు లక్ష్యం

- ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, మార్చి 10: తెలుగు ప్రజల భవిష్యత్తే లక్ష్యంగా చంద్రబాబు అడుగులు వేస్తున్నారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం బెంగుళూరులోని ఎస్‌కేజీ కల్యాణ మండపంలో పర్చూరు ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధ్వంసం, అరాచకం, దోపిడీ పాలనలో రాష్ట్రం ధ్వంసం అయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల భావితరాల కోసం చంద్రబాబు అలుపెరగని పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీల కలయిక చరిత్రాత్మకమైందన్నారు. రాష్ట్రం ప్రగతి కోసం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలందరూ ముక్తకంఠంతో హర్షిస్తున్నారన్నారని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్టపరిస్థితుల ఆధారంగా అధినేత చంద్రబాబు పొత్తు నిర్ణయం తీసుకున్నారన్నారు.

జగన్ రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందని ఎమ్మెల్యే సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చింది వైసీపీ ప్రభుత్వమేనన్నారు. బీసీలు, ఎస్టీలు, ఎస్సీలపై దాడులు జగన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు దార్శనిక పాలన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రక్షణగా ఉంటుందన్నారు. ప్రతి ఓటరు రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకొని రాష్ట్ర ప్రగతికి తమ వంతు కర్తవ్యంగా పనిచేయాలన్నారు. ఓటు అనే ఆయుధంతో అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. అక్రమ మార్గంలో గెలవాలనే కుట్రతో వైసీపీ ప్రభుత్వం ఓట్లు తొలగింపునకు కుట్రలు పన్నిందని చెప్పారు. ఈసందర్భంగా జరిగిన పరిణామాలను వివరించారు. వైసీపీ ఓట్లు తొలగింపు అక్రమ మార్గాన్ని చాకచక్యం తో తిప్పికొట్టామన్నారు. యువ ఓటర్లు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌కోసం ఓటు వేయాలన్నారు. వైసీపీ పతనానికి నూతన ఓటరు ఓటే నాంది పలకాలన్నారు.

బెంగుళూరులో జరిగిన పర్చూరు నియోజకవర్గ వాసుల ఆత్మీయ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు ఘనస్వాగతం లభించింది. ప్రాంగణానికి చేరుకున్న ఏలూరిని పర్చూరు వాసులు ఆత్మీయ పలుకరింపుతో అభిమానం చాటుకున్నారు. పెద్ద ఎత్తున యువత ఏలూరి వద్దకు చేరుకొని గజమాలతో ఘనంగా సత్కరించారు. తొలుత మహిళలు హారుతులిచ్చి స్వాగతం పలికారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



గజమాలతో ఏలూరిని సత్కరిస్తున్న యువత

టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శిగా వేణుగోపాలరావు



పర్చూరు, మార్చి 10: తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా పర్చూరు మండలం అడుసుమల్లికి చెందిన అడ్డగడ్డ వేణుగోపాలరావు (వేణు)ను రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించినట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశిరావు తెలిపారు. ఈమేరకు ఉత్తర్వులు అందజేసినట్లు ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి ప్రకటించారు. న్యాయవాదిగా పనిచేస్తూ తెలుగుదేశం పార్టీలో క్రియాశీ లకంగా ఉన్న వేణుగోపాలరావును లీగల్ సెల్ కార్యదర్శిగా నియమించినట్లు తె లియజేశారు. ఈసందర్భంగా ఏలూరి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



సోమశిలలో 13.884 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, మార్చి 10: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి జలాశయంలో 13.884 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1600, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

ప్రమాద ఘంటికలు !


- జలాశయాల్లో పడిపోతున్న నీటిమట్టం
- చివరి ఆయకట్టుకు అందని నీరు
- మోటార్లతో తోడేస్తున్న అనధికార ఆయకట్టు రైతులు
- పర్యవేక్షించలేకపోతున్న అధికార యంత్రాంగం
- మరో మూడు వారాలు నీరివ్వాల్సిన పరిస్థితి
- ప్రణాళిక లేకుండా తాగునీటికీ కష్టాలే..!

జిల్లాలో నీటి సమస్య ముంచుకొస్తోంది. ప్రాజెక్టుల్లో నీటిమట్టం పడిపోతుండగా, ఇంకా మూడు వారాల పాటు సాగుకు నీరివ్వాల్సి ఉంది. మరో వైపు ఎండలు మొదలవుతుండగా మంచినీటి అవసరాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నీటిని పొదుపుగా చివరి ఆయకట్టు వరకు అందించాల్సి ఉండగా, మధ్యలోనే అనధికార ఆయకట్టు రైతులు మోటార్లతో తోడేస్తున్నారు. దీంతో పంటలకు నీరందక చివరి ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో ఇరిగేషన్ సిబ్బందికి ఎన్నికల విధులు అప్పగించడంతో వారు నీటి యాజమాన్యంపై సక్రమంగా దృష్టి సారించలేకపోతున్నారు. ఎన్నికల నేపథ్యంలో అటు ప్రజా ప్రతినిధులు, ఇటు ఉన్నతాధికారులు నీటి యాజమాన్యంపై దృష్టి పెట్టడంలేదు. ఈ ప్రభావం వేసవిలో మంచినీటిపై పడే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పొదలకూరు మండలంలో ఓ కాలువపై నీటిని తోడేస్తున్న మోటార్లు



నెల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల ప్రాజెక్టులో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరువవుతోంది. సాగు కూడా చివరి దశకు చేరుకోవడంతో ఈ నెలాఖరు వరకు తప్పనిసరిగా నీటి విడుదల కొనసాగించాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో జనవరిలో నాట్లు వేయడంతో ఆ పంట కోసం ఏప్రిల్ మొదటి వారంలో కూడా నీటిని విడుదల చేయాల్సి వస్తుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారానికి చూస్తే 13.884 టీఎంసీలకు సోమశిలలో నీటిమట్టం పడిపోయింది. ప్రస్తుతం మూడు వేల క్యూసె క్కులను సాగుకు విడుదల చేస్తున్నారు. ఆయకట్టు సాగుకు పూర్తిస్థాయిలో పంటకు మరో 7 టీఎంసీల వరకు నీరు ఇవ్వాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆ లెక్కన చూసుకున్నా సోమశిల ఇంకో ఏడు టీఎంసీలు మాత్రమే మిగులుతుంది. ఈ నీరే డెడ్‌స్టోరేజీతోపాటు వేసవిలో జిల్లా అంతటా తాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉంది. అయితే ఇదంతా సక్ర మంగా జరిగితేనే.. లేకపోతే డెడ్ స్టోరేజీ నుంచి సాగుకు నీరివ్వాల్సిన పరి స్థితులు ఏర్పడితే తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ దఫా నిర్దేశించిన ఆయకట్టు కన్నా ఎక్కువగానే పంట సాగైంది. అదే సమయంలో కాలువల వెంబడి ఉన్న అనధికార ఆయకట్టు (జామాయిల్, నిమ్మ, చేపలు, రొయ్యల గుంతలు)కు మోటార్లతో నీటిని తోడేస్తున్నారు. దీని ఫలితంగా చివరి ఆయకట్టుకు సక్ర మంగా నీరు అందడం లేదు. దీనిపై నిరంతరం రైతులే ఇరిగేషన్ అధికా రులను అప్ర మత్తం చేయాల్సి వస్తోంది. ఇలా విచ్చలవిడిగా అనధికార ఆయ కట్టుకు నీటిని తోడేస్తే ఆ ప్రభావం తాగునీటిపై పడే ప్రమాదముంది.



గండిపాలెం జలాశయంలో అడుగంటిన నీరు

నీటి యాజమాన్యం చేస్తేనే..

ఈ దఫా డెడ్‌స్టోరేజీ నుంచి తాగునీటికి కేటాయింపులు ఇచ్చారు. అంటే మోటార్ల సాయంతో సోమశిలలో నీటిని తోడాల్సి ఉంటుందని ఇంజనీర్లు చెబుతున్నారు. సోమశిలలో ఐదు టీఎంసీల దిగువకు చేరితే బురద వచ్చే అవకాశం ఉందని, అప్పుడు మోటార్లతో తోడేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్నారు. అదే సమయంలో వేసవిలో నీటి ఆవిరి కూడా ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇప్పుడే మేల్కొని నీటిని పొదుపు చేయకపోతే వేసవిలో ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ ద్వారా తెలుస్తోంది. ఆ నేపథ్యంలో పశువులు, జీవరాశులు, భూగర్భ జలాలకు ఇబ్బందులు లేకుండా చెరువుల్లో నీటిని నిల్వ చేయాల్సిన అవసరముంది. అయితే ఇంతటి కఠిన పరిస్థితుల్లో నీటి యాజమాన్యంపై దృష్టి పెట్టేవారు లేకుండా పోయారు. సాగునీటి సలహా మండలి సమావేశంలో నీటి కేటాయింపులపై నిర్ణయం తీసుకున్నాక కాలువలపై నీటి యాజమాన్యాన్ని పర్యవేక్షించేం దుకు ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అయితే కీలకమైన ఇరిగేషన్ ఇంజనీర్లకు ఎన్నికల విధులు కేటాయించారు. వారంతా ఎన్నికల శిక్షణలో పడిపోయారు. దీంతో కాలువలపై నీటి యాజమాన్యాన్ని పట్టించు కునే వారు లేకుండా పోయారు. వచ్చే వారంలో ఎన్నికల కోడ్ రానుంది. ఆ తర్వాత పూర్తిగా ఎన్నికల విధుల్లోకి వెళ్లిపోతారు. అప్పుడు నీటి యాజమాన్యాన్ని పట్టించు కునేవారు కొరవడుతారు. ఎన్నికల నేపథ్యంలో అటు ప్రజాప్రతినిధులు, ఇటు జిల్లా ఉన్నతాధికారులు నీటి నిర్వహణపై దృష్టి పెట్టడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో తాగునీటికి ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



నెల్లూరు మూలాపేట వీధుల్లో సాగుతున్న ముక్కంటి రథోత్సవం (ఇన్‌సెట్‌లో) రథంపై ఆశీనులైన ఆది దంపతులు

- వైభవంగా ముక్కంటి రథోత్సవం
- కిక్కిరిసిన మూలాపేట వీధులు

జై శంకర.. జైజై శంకర !

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 10: నెల్లూరు నగరంలోని మూలాపేట వీధులన్నీ ఆదివారం భక్తులతో కిక్కిరిసి పోయాయి. హర...హర.. మహాదేవ .. జై శంకర, జైజై శంకర.. ఓం నమఃశివాయ... హరోం.. హర.. శంభో .. శివ శంభో... అంటూ భక్తులు ముక్కంటి రథోత్సవంలో పాల్గొన్నారు. మూలస్థానేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైభవంగా రథోత్సవం జరిగింది. భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ ఉత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. అనంతరం శివపార్వతులను పల్లకిలో అలంకరించి, ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారి రథంపై ఆశీనులను చేశారు. ఉభయకర్త అల్లూరి గిరీష్‌రెడ్డి, ఆలయ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ కే జనార్దన్‌రెడ్డి, ఈవో ఆరంబాకం వేణుగోపాల్‌లు ముందుగా రథానికి పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టి, గుమ్మడికాయ దిష్టి తీసి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం రథోత్సవం బ్రాహ్మణవీధి, ఈఎస్ఆర్ఎం హైస్కూల్, పొట్టిశ్రీరాములు విగ్రహం, అలంకార్‌సెంటర్, రాజాగారివీధి, రావిచెట్టు సెంటర్ మీదుగా మూలాస్థానేశ్వరాలయం వరకు సాగింది. రథంలో ఊరేగుతున్న ఆదిదంపతులకు భక్తులు దారి పొడవునా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించారు. భక్తులకు స్థానికులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ప్రసాదాలు, మజ్జిగ, తాగునీరు, పండ్ల రసాలు, పుచ్చకాయలు వంటివి అందచేశారు. బాణసంచా, మంగళవాయిద్యాలు, తెనాలి బ్యాండు మేళాల మధ్య రథోత్సవం కనుల పండువగా సాగింది. అలాగే మూలాపేట నీలకంఠేశ్వరస్వామి రథోత్సవం కూడా వైభవంగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు రథోత్సవాన్ని వీక్షించి తరించారు.



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



మద్యం కొనుగోలు కోసం ఉలవపాడులో ఆపిన తిరుపతి జిల్లా నగరి నియోజకవర్గానికి చెందిన బస్సు

సిద్ధం సభకు కందుకూరు నేతలు దూరం

- సీఎం కార్యక్రమానికి వెళ్లని మహీధర్ వర్గం
- మద్యం, బిర్యానీ, నగదు పంపిణీ చేసినా స్పందన అంతంత మాత్రమే

కందుకూరు, మార్చి 10: మేదరమెట్ల సమీపంలో ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగసభకు కందుకూరు నియోజకవర్గంలో స్పందన అంతంత మాత్రంగానే కనిపించింది. సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి అనుచర వర్గమంతా సభకు వెళ్లేదిలేదని తీర్మానం చేశారు. దీంతో ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్, ఇతర ముఖ్యనేతలు జనసమీకరణ కోసం శ్రమించినా ఆశించిన ఫలితం కనిపించలేదు. మహీధరరెడ్డి స్థానికంగానే ఉన్నప్పటికీ సభకు వెళ్లలేదు. దీంతో వాహనాల సంఖ్యను కూడా తగ్గించి పంపినా ప్రజలు తక్కువసంఖ్యలోనే వెళ్లారు. బిర్యానీ, మద్యంతో పాటు రూ. 500 నగదు కూడా అందజేసినా జనసమీకరణ జరగలేదు. కందుకూరు మండలంలో కోవూరు, పందలపాడు, విక్కిరాలపేట, నరిశెట్టివారిపాలెం, జిల్లెలమూడి, మహదేవపురం, కొండముడుసుపాలెం, మోపాడు, శ్రీరంగరాజపురం, జి. మేకపాడు తదితర గ్రామాల నుంచి అసలు వాహనాలే ఏర్పాటుచేయలేదు. మాచవరం నుంచి అసమ్మతి నేతలుగా ఉన్న ఇద్దరు ముగ్గురు కలిసి కారులో వెళ్లినట్లు తెలిసింది. కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల నుంచి కూడా ఒక్క వాహనం కూడా వెళ్లలేదు. గుడ్లూరు మండలంలోనూ అనేక గ్రామాలకు బస్సులు ఏర్పాటుచేయలేదు. ఆ మండలంలో కూడా ఆశించిన రీతిలో జనసమీకరణ జరగలేదు. ఉలవపాడు మండలంలో ఓ సామాజికవర్గంలోని ముఖ్యమైన నాయకులంతా ఈ కార్యక్రమానికి దూరంగా ఉండిపోయారు. మండలంలో తొలుత 70 బస్సులు ఏర్పాటుచేయాలనుకున్నా 30కే కుదించారు. కరేడు పంచాయతీలో అలగాయపాలెం, టెంకాయచెట్లపాలెం తదితర కాలనీలవారు అసలు కదలేందుకు ఇష్టపడలేదు. మద్యం, బిర్యానీ, నగదు తాయిలాలు చూపించినా స్పందన లేదు. వలేటివారిపాలెం మండలంలోనూ 20కిపైగా పంచాయతీలున్నా 10 బస్సులే ఏర్పాటుచేశారు. ఈ మండలంలోనూ ముఖ్యనేతలంతా కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. లింగసముద్రం మండలం నుంచి ముఖ్యనేతలు వెళ్లకపోవటంతో గ్రామాల నుంచి పరిమిత సంఖ్యలోనే వెళ్లారు.



ఉలవపాడులో మద్యం దుకాణం వద్ద గుమిగూడిన నగరి, పుంగనూరు, చిత్తూరు, సూళ్లూరుపేట ప్రాంతాల వైసీపీ కార్యకర్తలు

ఉలవపాడులో విడిది

ఉలవపాడు : సిద్ధం సభకు వెళ్లేవారికి ఉలవపాడు విడిదిగా మారింది. రాయలసీమ నుంచి కార్యకర్తలు తరలివెళుతూ ఆదివారం మధ్యాహ్నం మద్యం షాపుల వద్ద హడావిడి చేశారు. నగరి, పుంగనూరు, చిత్తూరు నియోజకవర్గాల కార్యకర్తలు బీర్లు, మద్యం భారీగా కొనుగోలు చేశారు. హైవేపై బిర్యానీ హోటళ్లు కిక్కిరిశాయి.

మద్యం, నగదు పంపిణీ

కావలి : కావలి నియోజకవర్గం నుంచి సీఎం సిద్ధం సభకు తరలివెళ్లే ప్రజలకు నగదు, మద్యం ఇచ్చి బస్సులు ఎక్కించినట్లు సమాచారం. నియోజకవర్గంలోని కావలి పట్టణం, కావలి రూరల్, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాలకు 72 బస్సులను కేటాయించగా, బస్సులు ఫుల్ కాకుండానే వెళ్లాల్సి వచ్చింది. జనసమీకరణ కోసం కావలి ఎమ్మెల్యే ఒక్కో మనిషికి వెయ్యి రూపాయలు ఖర్చు పెట్టేలా నేతలకు నగదు ముట్టచెప్పినట్లు సమాచారం.

అమ్మో.. సీఎం సభా ?

- ఆర్టీసీ బస్సులు వెళ్లడంతో ప్రయాణికుల ఇక్కట్లు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా సీఎం సభ జరుగుతుందా ? అయితే ఆ రోజు ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సిందే. ఎందుకంటారా ? ఆయా జిల్లాల పరిధిలోని వైసీపీ నాయకులు ప్రజలను వేలాదిగా తరలిస్తున్నారు. అందుకు ఆర్టీసీ బస్సులు అవసరం కావడంలో వాటిని తీసుకెళుతున్నారు. దీంతో ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. కాగా ఆదివారం మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభకు నెల్లూరు రీజియన్ నుంచి 320 బస్సులను తరలించారు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.



చేజర్ల : మేదరమెట్లకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న తిరుమల డిపో బస్సు

వైసీపీ సభకు తిరుమల బస్సులా... ?

చేజర్ల : మేదరమెట్ల సిద్ధం సభకు తిరుమల డిపో బస్సులు తరలించడంపై ప్రజలు విమర్శలు గుప్పించారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకే తిరుపతిడిపోతో పాటు తిరుమల డిపో బస్సులు తరలించారని పలువురు పేర్కొన్నారు.



ఆత్మకూరు : బస్సులు లేక వెలవెల బోతున్న మున్సిపల్ బస్టాండ్

బస్టాండ్ వెలవెల

ఆత్మకూరు : స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో 44 ఆర్టీసీ బస్సులు ఉంటే 34 బస్సులను సిద్ధం సభకు కేటాయించారు. మిగిలిన 10 బస్సులు నెల్లూరు, కావలి, సోమశిల తదితర ముఖ్యమైన మార్గాల్లో నడిపారు. ముఖ్యంగా పల్లెలకు వెళ్లే బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు వేచి చూడాల్సి వచ్చింది. చివరకు అధిక ధరలు చెల్లించి ఆటోలు ప్రయాణించారు. సభకు వెళ్లే వారికి ఒక్కొక్కరికి రూ. 700, విజిటబుల్ బిర్యానీ, లెమన్ రైస్, పెరుగన్నం ప్యాకెట్లు ఇచ్చారని సమాచారం.



అనంతసాగరం నుంచి సిద్ధం సభకు బయలుదేరనున్న తిరుమల సర్వీసు

తిరుమలేశా.. ఇందేందయ్యా !

అనంతసాగరం : సిద్ధం సభకు అనంతసాగరం నుంచి నాలుగు సర్వీసులు వెళ్లగా, అవి చిత్తూరు, తిరుపతి ప్రాంతాలకు చెందిన తిరుమలకు వెళ్లే సప్తగిరి సర్వీసులు కావడం గమనార్హం. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా పార్టీ కార్యక్రమానికి తిరుమల సర్వీసులు వినియోగించుకోవడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేశారు.

బాబుతో బొల్లినేని భేటీ

- పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియామకం
- ఎన్నికల్లో గెలుపునకు కృషి చేస్తానని రామారావు వెల్లడి
- నేడు నెల్లూరులో ఉదయగిరి నేతలతో సమావేశం

నెల్లూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి టీడీపీ వ్యవహారం ఓ కొలిక్కి వచ్చింది. టికెట్ వ్యవహారమై అలకబూనిన మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావును చంద్రబాబు తన వద్దకు పిలిపించుకొని సర్దుబాటు చేశారు. ఉదయగిరి టీడీపీ అభ్యర్థిగా కాకర్ల సురేష్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. 20 ఏళ్లుగా పార్టీ కోసం శ్రమిస్తున్న తనకు టికెట్ ఇవ్వకపోగా, మాటమాత్రమైనా చెప్పకుండా కాకర్ల సురేష్‌కు టికెట్ ఖరారు చేయడం బొల్లినేనిని తీవ్రంగా కలిచి వేసింది. తీవ్ర మనస్తాపానికి గురైన బొల్లినేని చంద్రబాబు ఆదేశాల మేరకు బీద రవిచంద్ర వెంటబెట్టుకొని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం సుమారు గంటన్నరసేపు చంద్రబాబు, రామారావు, ఎన్ఆర్ఐ ధనియాల వెంకటేశ్వర్లు, బీద రవిచంద్ర రాజకీయాలపై చర్చించుకున్నారు. రాష్ట్ర పార్టీ సమాచారం మేరకు, రామారావు రాజకీయ భవిష్యత్తుకు సంబంధించి చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలిసింది. జాతీయ కమిటీలో క్రియాశీలక పదవితోపాటు అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ ఢిల్లీ వ్యవహారాల ఇన్‌చార్జి బాధ్యతను బొల్లినేనికి అప్పగిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు తెలిసింది. టీడీపీకి సేవలందిస్తున్న ఎన్ఆర్ఐ ధనియాల వెంకటేశ్వర్లుకు కూడా తగిన న్యాయం చేస్తానని అధినేత హామీ ఇచ్చినట్లు రాష్ట్ర పార్టీ తెలిపింది. చంద్రబాబుతో భేటీతో సంతృప్తి చెందిన బొలినేని వెంకటరామారావు ఉదయగిరిలో పార్టీ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో సోమవారం నెల్లూరులో ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేతలతో బొల్లినేని రామారావు సమావేశం కానున్నారు. వారిని ఎన్నికలకు సన్నద్ధం చేయనున్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావును టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కె అచ్చన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశానుసారం ఈ నియామకం జరిపినట్లు ఆయన ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



చంద్రబాబుతో భేటీ అయిన బొల్లినేని రామారావు, బీద రవిచంద్ర, ధనియాల వెంకటేశ్వర్లు

కంటైనర్ టెర్మినల్‌పై స్పష్టమైన ప్రకటన చేయాలి

- మాజీ మంత్రి సోమిరెడ్డి డిమాండ్
- పోర్టు రోడ్డుపై టీడీపీ నేతలను అడ్డుకున్న సెక్యూరిటీ
- తోపులాట, స్వల్ప ఉద్రిక్తత

ముత్తుకూరు, మార్చి 10 : అదానీ కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ ఉద్యోగుల శాంతియుత ధర్నాకు మద్దతు తెలిపిన మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ఆదివారం పోర్టు సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడంతో తోపులాట, స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. గోపాలపురం వద్ద పోర్టు రోడ్డులో సోమిరెడ్డి టీడీపీ నాయకులతో కలిసి టెర్మినల్ ఉద్యోగులు చేస్తున్న ధర్నాలో పాల్గొన్నారు. ఈ సమయంలో పోర్టు సెక్యూరిటీ సిబ్బంది టీడీపీ నాయకులతో దురుసుగా ప్రవర్తించడంతో సోమిరెడ్డి వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు తిరగబడి పోర్టు గేటు వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో సెక్యూరిటీతో తోపులాట జరిగింది. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. సమన్వయం పాటించాలని టీడీపీ నాయకులను కోరుతూ సోమిరెడ్డి పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నా చేస్తున్న తమపై దౌర్జన్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. పోర్టు అధికారులు, యాజమాన్యం మంత్రి కాకాణికి తొత్తులుగా పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. కంటైనర్ టెర్మినల్ కొనసాగింపుపై పోర్టు సీఈవో జీజేరావు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జున యాదవ్, నాయకులు ఏకొల్లు కోదండయ్య, రమేష్‌శర్మ, జనసేన సర్వేపల్లి కన్వీనర్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు, సీపీఐ నాయకులు దామా అంకయ్య తదితరులు పాల్గొన్నారు.



సెక్యూరిటీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సోమిరెడ్డి

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష


సంగం : రూమ్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

సంగం, మార్చి 10: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన 5వ తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 5వ తరగతిలో ప్రవేశ పరీక్షకు 202 మందికిగాను 162 మంది, ఇంటర్ ప్రవేశ పరీక్షకు 291 మందికిగాను 246 మంది హాజరయ్యారు. కాగా, ఈ ప్రవేశ పరీక్షకు సంగం మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి 5వ తరగతిలో ప్రవేశానికి 202 మంది, ఇంటర్‌లో ప్రవేశానికి 291 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా, మేదరమెట్లలో సీఎం సిద్ధం సభకు జిల్లాలోని బస్సులన్నీ తరలి వెళ్లడంతో సంగం రూట్‌లో బస్సులు సరిగా లేవు. దీంతో ప్రవేశ పరీక్షకు హాజరు

బస్సులు లేక విద్యార్థుల ఇబ్బందులు

కావలసిన సుమారు 500 మందిలో రవాణా వసతి లేక సుమారు 85 మంది గైర్హాజరయ్యారు. అలాగే పరీక్షకు హాజరైనవారు ఆటోలు, మోటారుబైక్‌లపై విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్షకు తీసుకువచ్చారు. పరీక్ష ముగిసే వరకు తల్లిదండ్రులు ఉండి మోటారు బైక్‌లు, ఆటోలలో విద్యార్థులను తీసుకెళ్లారు.

చేజర్ల: మండలంలోని ఆదురుపల్లిలో ఉన్న డా. బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహించారు. 5వ తరగతిలో ప్రవేశానికి 203 మంది, ఇంటర్మీడియట్‌కు 197 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ శైలజాకుమారి తెలిపారు. డిసివో పి హేమలత, అబ్జర్వర్ జి సునీత పర్యవేక్షించారు.

మురుగు కాలువల్లో పూడికతీతకు శ్రీకారం


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఆత్మకూరు, మార్చి 10: మున్సిపాల్టీ పరిధిలో పారిశుధ్యం మెరుగుదలకు అధికారులు ఆదివారం మురుగు కాలువల్లో పూడికతీ పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని జేఆర్‌పేట, ఎల్‌ఆర్‌పల్లి, ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న మెయిన్ కాలువ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పూడికతీత పనులను మున్సిపల్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పంట కాలువలు, మురుగు నీటి కాలువలలో ఆయా ప్రాంతాల ప్రజలు ఇళ్లలోని వ్యర్థ పదార్థాలను వేయడం వల్ల మురుగునీరు పారుదల లేకుండా నిలబడి పోవడంతో పూడికతీత పనులను చేపట్టామని, పలు ప్రాంతాల్లో ఇళ్లలో సెప్టిక్ ట్యాంకులు నిర్మించకుండా నేరుగా కాలువల్లోకి పైపులు పెట్టి వదిలేస్తుండడంతో ఇబ్బందికరంగా తయారైందన్నారు. అలాంటి ఇళ్లను గుర్తించి నోటీసులు జారీచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ జూపల్లి ప్రసాద్, ఆర్‌ఐ షేక్ ఖాసీం పాల్గొన్నారు.

రేవూరులో ఉచిత వైద్య శిబిరం

అనంతసాగరం, మార్చి 10: మండలంలోని రేవూరులో ఆదివారం ఎస్ఎన్ఆర్ క్లినిక్ ఆధ్వర్యంలో నెల్లూరు విహాస్ స్పెషలిటీ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పాలకొల్లు అమర్‌నాథ్‌రెడ్డి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

అబాకస్‌లో లుంబిని విద్యార్థుల ప్రతిభ

చేజర్ల, మార్చి 10: ఆదిత్యాస్ ఎంటర్‌ప్రైజస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఆదివారం నెల్లూరులో జరిగిన అబాకస్ కాంపిటేషన్‌లో చేజర్ల లుంబిని విద్యాలయానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచారు రెండో తరగతికి చెందిన జి గురుచరణ్, నాల్గో తరగతికి చెందిన ఎ హిమ షణ్ముఖప్రియ, ఐదవ తరగతికి చెందిన సిఎచ్ లహరి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ బి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా భీమేశ్వరుడి గ్రామోత్సవం

సంగం, మార్చి 10: మండలంలోని వంగల్లు భీమేశ్వరాలయంలో జరుగుతున్న మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి భీమేశ్వరస్వామి అంబారీపై భక్తులకు దర్శనమిచ్చారు. కామాక్షిదేవి, భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను అంబారీపై ఉంచి ప్రత్యేకంగా అలంకరించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చేజర్ల, మార్చి 10: మండలంలోని చిత్తలూరులో సోమవారం నెల్లూరు నారాయణ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ టీడీపీ నాయకులు మోదేపల్లి పెంచలనాయుడు తెలిపారు. ఈ శిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కావున సమీప గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న యువత

అనంతసాగరం, మార్చి 10: మండంలోని రేవూరులో ఆదివారం స్థానిక యువత సేవా కార్యక్రమాలు చేశారు. గ్రామానికి చెందిన పాశం వినయ్ అనే ఇంజినీరింగ్ విద్యార్థి ఆరు మాసాల క్రితం చెన్నైలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆదివారం అతని జయంతి సందర్భంగా తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, మమత, అతని మిత్రులు మజ్జిగ చలివేంద్రంతో పాటు, సిమెంట్ బెంచీలను గ్రామంలో ఏర్పాటు చేశారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం : డీబీసీడబ్ల్యూవో


మాట్లాడుతున్న డీబీసీడబ్ల్యూవో వెంకటయ్య

ఆత్మకూరు, మార్చి 10 : ప్రభుత్వ బీసీ వసతిగృహాల్లో చదివే 10వ తరగతి విద్యార్థులు ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించి చదివిస్తున్నామని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వై వెంకటయ్య తెలిపారు. ఆదివారం రాత్రి ఆత్మకూరు పట్టణంలో ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ అమలు తీరు, రికార్డులను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని తెలిపారు. పరీక్ష కాలంలో సమయం వృథా చేసుకోకుండా ప్రణాళిక ప్రకారం చదువు కోవాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పరీక్షలంటే భయపడకుండా ఒత్తిడిని జయిస్తే విజయం తథ్యమని తెలిపారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలికల కాలేజీ వసతిగృహాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యువో ఎం శ్రీదేవి, హెచ్‌డబ్ల్యువోలు మమత, సునీత పాల్గొన్నారు.

రేవూరు బీసీ బాలికల వసతిగృహం తనిఖీ

అనంతసాగరం: జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో చదివిస్తున్నట్లు జిల్లా బీసీ సాంఘీక సంక్షేమాధికారి వై వెంకటయ్య తెలిపారు. అనంతసాగరం మండలంలోని రేవూరు బీసీ బాలికల వసతి గృహాన్ని ఆదివారం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవితో కలసి తనిఖీ చేశారు. గతేడాది జిల్లాలో ఈవసతి గృహం నుంచి మొదటి ర్యాంకు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ వార్డెన్ మల్లేశ్వరీని అభినందించారు.

టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

ఆత్మకూరు, మార్చి 10 : రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అత్యధిక మెజార్టీ సాధించి అధికారంలోకి రావడం ఖాయమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తోడేటి వెంకటయ్య అన్నారు. ఆదివారం 14వ వార్డులో స్థానిక నేతలతో కలిసి బాబు షూరిటీ- భవిష్యత్ గ్యా రంటీ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంటేరు మల్లికార్జున, పొన్నం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధిష్ఠానం నిర్ణయం మేరకే నడుచుకుంటాం


ఉదయగిరి రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్

ఉదయగిరి రూరల్, మార్చి 10: ఉదయగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు దిశా నిర్దేశంతో టీడీపీ అధిష్ఠానం నిర్ణయం మేరకే ముందుకెళతామని మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలోని తన నివాసంలో టీడీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ త్వరలో బొల్లినేనితో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో అధిష్ఠానం నిర్ణయించిన వ్యక్తిని కలవడం జరుగుతుందన్నారు. మూడు పార్టీల పొత్తుతో వైసీపీ పతనం ప్రారంభమైందని, రాబోయేది ఉమ్మడి ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, నరసింహ, గూడూరు వెంకటేశ్వరరావు, శ్రీరాములు, కప్పా శ్రీనివాసులు, సయ్యద్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం మండల సీనియర్ నాయకుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, మండలంలో పార్టీ బలోపేతంపై చర్చించారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సూచనలతో మండలంలోని ప్రతి కార్యకర్త పనిచేసి ఎన్నికల్లో టిడిపి ఉదయగిరి నియోజకవర్గ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వేంకటేశ్వర్లు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, సీనియర్ నాయకులు వెంగళశెట్టి వెంకటయ్య, చింతల శ్రీనివాసులు, షేక్‌బాబు, జాషువా, గౌసు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంగంలో జనసేన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నేతలు

సంగం, మార్చి 10: మండలంలోని దువ్వూరుకు చెందిన ఎన్ఆర్ఐ చదలవాడ హరీష్‌రావు, మిధున దంపతులు ఆదివారం జనసేన పార్టీలో చేరిన సందర్భంగా సంగంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వూరు నుంచి సంగం వరకు మోటారు బైక్‌లు, ఆటోల ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంగంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జనసేన పార్టీ ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో భానుకిరణ్, ఆనంద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీపీఆర్‌ను కలసిన సాగరం నేతలు


వీపీఆర్‌తో సాగరం నేతలు

అనంతసాగరం, మార్చి 10: టీడీపీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అనంతసాగరం టీడీపీ సీనియర్ నాయకుడు పాతపాటి మదుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు ఆదివారం కలిశారు. అలాగే ఆత్మకూరు టీడీపీ నాయకుడు ఆనం రామనారాయణరెడ్డిని కలిసారు. రానున్న ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలిపిస్తామని పేర్కొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి : సీసీఎఫ్

ఉదయగిరి రూరల్, మార్చి 10: వేసవి దృష్ట్యా అడవులు అగ్నికి ఆహుతి కాకుండా అటవీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీసీఎఫ్ వై శ్రీనివాసులరెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక అటవీ శాఖా కార్యాలయంలో అడవుల సంరక్షణపై సిబ్బందితో సమీక్షించడంతోపాటు ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో ప్లాంటేషన్‌లు, నర్సరీలను తనిఖీచేసి తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వేసవి కాలంలో అడవులు అగ్నికి అహుతి కాకుండా ముందస్తు చర్యలు చేపడతామన్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాల్లో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించడంతోపాటు దండోరా వేసి కరపత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అటవీ ప్రాంతాల్లో విద్యుత్ కంచెలు ఏర్పాటుచేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. జగనన్న భూహక్కు సర్వేలో భాగంగా రిజర్వు ఫారెస్టు సమీపంలో ఉన్న భూములు సర్వే చేసే సమయంలో అటవీ భూములు అక్రమణకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో మారుతీప్రసాద్, సబ్ డీఎఫ్‌వో రాజశేఖర్‌బాబు, రేంజ్ అధికారులు తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, హరి, డీఆర్వో శ్రీనివాసులు, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నేడు వాహనాల ర్యాలీ

లింగసముద్రం : టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి గెలుపే లక్ష్యంగా సోమవారం కందుకూరు నుంచి వలేటివారిపాలెం, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లో వాహనాల ర్యాలీని జరుగుతుందని జనసేన మండల అధ్యక్షుడు అంగుళూరి నరసింహారావు ఓ ప్రకటనలో తెలిపారు.

నెలలో 5 రోజులే మంచినీటి సరఫరా!

- ఇప్పుడే ఇలా ఉంటే వేసవిలో పరిస్థితి ఏమిటి ?
- ఉలవపాడు ఎస్సీ, ఎస్టీ కాలనీలకు తప్పని నీటి ఎద్దడి


ఐదు ప్రాంతాలకు నీటి సరఫరా అయ్యే ట్యాంక్


కొల్లూరుపాడు పైపులైన్‌కు వేసిన డమ్మీ


ఉలవపాడు, మార్చి 10 : మండలకేంద్రమైన ఉలవపాడులో మంచి నీటి వనరులు సంవృద్ధిగా ఉన్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ కాలనీలు, పాతూరు, తదితర ప్రాంతాలకు నెలకు 5 రోజులే మంచినీటి సరఫరా చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రెండు, మూడు రోజులకొకసారి వంతున నెలకు 10 నుంచి 15 రోజులు నీటి సరఫరా జరిగేది. ప్రస్తుతం 6 రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉండే రానున్న వేసవిలో పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో వేసవికి ముందే నీటి ఎద్దడి ఏర్పడి కష్టాలు తప్పడం లేదు. వివరాల మేరకు... ఉలవపాడు మేజర్ పంచాయతీలో సుమారు 15,000 మంది జనాభా ఉన్నారు. వీరికి తాగునీటి సరఫరాకు 3 ప్రాంతాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు. అందులో భాగంగా రెండు ఎస్సీ కాలనీలు, ఒక ఎస్టీ కాలనీ, పాతూరుకి నీటి సరఫరాకు 20 ఏళ్ల క్రితమే ఎస్టీ కాలనీ వద్ద ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. అయితే దీనికి డైరెక్ట్ పంపింగ్ ద్వారా కాకుండా ట్యాంక్ పక్కనే ఉన్న సంపును నింపి అక్కడి నుంచి ట్యాంక్‌ను నింపిన తరువాత పైపులైన్ల ద్వారా నీటీ సరఫరా చేస్తారు. దీంతో అవకాశాన్ని బట్టి 2, 3 రోజులకొకసారి నీటి సరఫరా చేసేవారు. కాగా జలజీవన్ మిషన్ పథకం కింద సీహెచ్‌సీ పక్కన వరదాయమ్మ కాలనీ, డిగ్రీ కళాశాల వద్ద నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ, కొల్లూరుపాడు ఎస్సీ కాలనీకి అదనంగా పైప్ లైన్లు వేసి ఆ ప్రాంతాలకు కూడా ఇదే ట్యాంకు నుంచి నీటిసరఫరా చేస్తున్నారు. దీంతో రోజుకొక ప్రాంతానికి నీటి సరఫరా చేయాల్సి రావడంతో ఒక ప్రాంతానికి నెలకు 5 రోజులే నీటి సరఫరా జరుగుతోంది. దీంతో రోజుల కొద్దీ నీళ్ల కోసం కాలనీవాసులు ఎదురు చూడాల్సివస్తుందని వాపోతున్నారు.

ప్రత్యమ్నాయంపై దృష్టి పెట్టని అధికారులు, పాలకులు

గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలు, పాతూరు, వరదాయమ్మ నగర్ ప్రాంతాలకు జరుగుతున్న నీటి సరఫరాలో అంతరాయాన్ని అధిగమించేందుకు పాలకులు, అధికారులు ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పైగా కొల్లూరుపాడు ఎస్సీ కాలనీ జగనన్న లేవుట్‌కు స్థానికంగా పైప్‌లైన్ కనెక్షన్ ఉన్నప్పటికీ ఉలవపాడు ట్యాంక్ నుంచి నూతన కనెక్షన్ ఇవ్వడంతో మరికొంత భారం పెరిగి నీటి సరఫరా ఇంకాస్త ఆలస్యం అవుతోందని, ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ కాలనీలలో నీటి ఎద్దడిపై దృష్టి సారించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

- కొల్లూరుపాడు అరుంధతి కాలనీలో రెండు నెలలుగా వాటర్ పైప్‌లైన్ ఇసుక, మట్టితో నిండి నీరు రావడం లేదు. దీనిపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. 4 రోజుల క్రితం కాలనీవాసుల ఒత్తిడి మేరకు సమస్య ఉన్న చోట పైప్‌లైన్ గాడితీసి డమ్మీ బిగించి ఇంక పట్టించుకోలేదు. దీంతో కాలనీలోని రెండు వీధులకు, ప్రభుత్వ పాఠశాలకు నీటి సరఫరా నిలిచిపోయి ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. సుమారు 300 మీటర్లు పైప్‌లైన్ కొత్తది వేస్తేగాని సమస్యకు పరిష్కారం లభించదని స్థానికులు తెలిపారు.

వైభవంగా మల్లన్న రథోత్సవం


రథోత్సవంలో భక్తులకు దర్శనమిస్తున్న మల్లన్న

కావలిటౌన్, మార్చి 10: కావలి పట్టణం పాతూరులోని ప్రాచీన శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మల్లన్నకు రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు శశిగురుకుల్ పర్యవేక్షణలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, హోమం పూజ లు, బలిహరణ, పల్లకీ సేవలు నిర్వహించారు. సాయం త్రం ఆలయ ప్రాంగణంలో భక్తిరజని కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మల్లన్న రథంపై పట్టణ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అడుగడుగునా రథోత్సవానికి బ్రహ్మరథం పట్టారు.

గ్రామదేవతలకు చద్దులు, పొంగళ్లు


పోలేరమ్మకు పూజలు చేస్తున్న ఇంటూరి రాజేష్

కందుకూరు, మార్చి 10: స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని కందుకూరు గ్రామదేవతలు పోలేరమ్మ, మహాలక్ష్మమ్మలకు ధర్మకర్త దివి లింగయ్యనాయుడు ఆధ్వర్యంలో చద్దులు, వడపప్పు పానకం సమర్పించే కార్యక్రమం ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. మహిళలు పెద్దసంఖ్యలో హాజరై చద్దులు, వడపప్పు, పానకం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 16 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, పట్టణ ప్రజలు తమ వీలును బట్టి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేసుకోవాలని లింగయ్యనాయుడు తెలిపారు. ఈనెల 17న అంకమ్మకు పాలపొంగళ్లు సమర్పించే కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

'డీఎస్ఆర్'లో ఉచిత విద్యకు ప్రవేశ పరీక్ష


ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు

అల్లూరు, మార్చి 10 : దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌లో ఉచిత విద్యకు ప్రైవేటు పాఠశాలల్లో ఐదో తరగతి చదివే విద్యార్థులకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 156 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అడ్మిన్ మేనేజరు అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 3న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నిర్వహించామన్నారు. ట్రస్ట్ ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించే విధంగా అన్ని రకాల చర్యలను ట్రస్ట్ అధినేత దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మకు పూజలు


పోలేరమ్మకు పూజలు చేస్తున్న సునీల్, ఏటుకూరి

జలదంకి, మార్చి 10: ఉదయగిరి టీడీపీ అభ్యర్థిగా కాకర్ల సురేష్‌కు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు మొదటి జాబితాలోనే చోటు కల్పించడంతో కాకర్ల అభిమాని మెకానికల్ ఇంజనీర్ ఏటుకూరి మల్లేష్‌నాయుడు ఆయన స్వగ్రామమైన మండలంలోని గోపన్నపాలెంలోని పోలేరమ్మగుడిలో ఆదివారం ప్రత్యేక పూజలు చేసి మొక్కుతీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాకర్ల సురేష్ సోదరుడు సునీల్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మల్లేష్‌నాయుడు 101 టెంకాయలు అమ్మవారికి అందజేసి కాకర్ల అభిమానులతో కొట్టించారు. ఈ కార్యక్రమంలో అంబటి హరిప్రసాద్‌నాయుడు, స్వర్ణ కొండపనాయుడు, గొట్టిపాటి మనోజ్, కాసు చెంచునాయుడు, ముచ్చాల మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీల కలయిక చరిత్రాత్మకం : కావ్య


టీడీపీలో చేరిన వారితో కావ్య కృష్ణారెడ్డి

కావలి, మార్చి 10: టీడీపీ, జనసేన, బీజేపీల కలయిక చరిత్రాత్మకమైనదని కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కలయికతో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో వైసీపీ నిరంకుశపాలనను తుదముట్టించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, కొమరా రమణయ్య, బిట్రగుంట శివప్రసాద్, జనసేన నేత రిషికేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక : కావలి పట్టణంలోని పాతూరు, 35 వార్డు వైకుంఠపురంకు చెందిన వివిధ పార్టీల నేతలు పలువురు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం టీడీపీలో చేరగా వారికి ఇన్‌చార్జి కావ్యక్రిష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ ముఖ్య అనుచరుడు గుంజి ప్రసన్నకుమార్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు బాలు యాదవ్, వైసీపీకి చెందిన విజయమ్మ, సుశీలమ్మ, మల్లి, మురళి, సూరి, వెంకటేష్, యనమల రవి, హజరత్ నాయుడు, గుంజి ప్రభాకర్, కృష్ణ తదితరులు పార్టీలో చేరారు. అలాగే కావలి ఎమ్మెల్యే సొంతగడ్డ అయిన పాతూరుకు చెందిన వైసీపీ నాయకులు శనివారం రాత్రి కృష్ణుడి బొమ్మ వద్ద జరిగిన కార్యక్రమంలో టీడీపీలో చేరారు. రైతుసంఘం అధ్యక్షుడు, ప్రముఖ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ రామిరెడ్డి కృష్ణారెడ్డి, కావలి పెద్ద చెరువు మాజీ డైరెక్టర్ వాకా శ్రీనివాసులురెడ్డి, అమ్ములూరు రఘురామిరెడ్డి, కంసాని శ్రీకాంత్, బొంత సురేష్, కొర్సుపాటి రవీంద్రరెడ్డి, వాకా చంద్రారెడ్డి, వింత నారపరెడ్డి, గొడ్డేటి శ్రీనివాసులు, పవన్ తదితరులు టీడీపీలో చేరగా వారికి ఇన్‌చార్జి కృష్ణారెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు.

జగన్ నైజమే దోపిడీలు, మోసాలు : ఇంటూరి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు

కందుకూరు, మార్చి 10: తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని వేలకోట్లు దోచుకున్న జగన్ 16 నెలలు జైల్లో ఉండివచ్చినా ఏమాత్రం మార్పురాకుండా ఈ ఐదేళ్లు కూడా అదే దోపిడీని కొనసాగించి రాష్ట్రాన్ని అధోగతిపాల్జేశాడని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. పట్టణంలోని 31వ వార్డు పరిధిలోని నాంచారమ్మ కాలనీలో ఆదివారం శంఖారావం కార్యక్రమంలో భాగంగా పార్టీ మినీమేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, అత్తంటి శివకృష్ణ, గుత్తా శ్రీనివాసులు, అంబటి శ్రీనివాసులు, నల్లబోతుల మురళి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కోర్టు సెంటర్, 60 అడుగుల రోడ్డు ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివారం రాత్రి టీడీపీ ఒంగోలు పార్లమెంటు అధ్యక్షుడు డాక్టరు నూకసాని బాలాజీ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంలో ఇంటూరి

పట్టణంలోని జనార్ధనస్వామి కళ్యాణ మండపంలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల శక్తి మహిళలకే ఉందని, ఓవైపు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరోవైపు వివిధ వృత్తులలో అద్భుతాలు సాధించటం మహిళలకే చెల్లిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, యూటీఎఫ్, సీఐటీయూ, ఐద్వా కమిటీల్లోని మహిళలు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి


సావిత్రీబాయికి నివాళులర్పిస్తున్న మహిళలు

కావలి, మార్చి 10: సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ముసునూరులో ఉన్న టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య మాట్లాడుతూ స్త్రీ విద్యావంతురాలు అయినప్పుడే ఆ కుటుంబం వృద్ధి చెందుతోందని, సమాజం అభివృద్ధి చెందుతోందని తెలిపిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అన్నారు. మొదటి మహిళా ఉపాధ్యాయినిగా స్త్రీ విద్య కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తిరువీధి ప్రసాద్, గుండ్లపల్లి శివాజీ యాదవ్, కొల్లూరు అశ్వనీ, పసుపులేటి పద్మావతి, గుర్రం అనురాధ, కట్టమూరి శ్రీదేవి, రాధమ్మ, షేక్ అయేషా, షబానా తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యంతోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నేత సుమకుమారి

కావలిటౌన్, మార్చి 10: మహిళా చైతన్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు సుమకుమారి పేర్కొన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం కోర్టు వెనుక వీధిలోని కల్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఆ సం ఘం జిల్లా నాయకులు కల్యాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సుమకుమారితో పాటు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. సుమకుమారి మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి మహిళ చైతన్యవంతులు కావాలన్నదే మహిళా దినోత్సవ ఉద్దేశ్యమన్నారు. సావిత్రబాయు పూలే మహిళలకు ఆదర్శమని, బాలికా విద్య కోసం అమె ఎనలేని కృషి చేశారన్నారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చి అధికారంలోకొచ్చాక విస్మరించారని, టీడీపీ ప్రభుత్వం రావడం ఖాయమని సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్న దీమా వ్యక్తం చేశారు. సుభద్రాదేవి, సీ శారద, యుటీఎఫ్ జిల్లా కార్యదర్శులు మాదవరావు, భారతి, జిల్లా నేతలు లక్ష్మి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.